అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 30-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 | సంచిక : 281 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తం !

- హాస్టళ్లలో ఘటనలపై సమగ్ర విచారణ చేయిస్తున్నాం
- సైకోరావు కుట్రలెన్ని చేసినా ఐదేండ్లు రేవంతన్న పాలనే
- కేసీఆర్ కుటుంబంలోనే పదవుల కోసం గొడవలు
- టైం వచ్చినప్పుడు కేసీఆర్, కేటీఆర్ అరెస్టు : మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ హస్తం ఉందనీ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు హాస్టళ్లలో ఉన్న ఆయన అనుచరులు కావాలనే సమస్యలను సృష్టిస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గురుకులాలపై సైకోరావు ఎన్ని కుట్రలు చేసినా ప్రయోజనం ఉండదనీ, ఐదేండ్లు రేవంతన్న ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. గురుకుల విద్యార్థి శైలజ మృతి బాధాకరమన్నారు. నిమ్స్‌లో ప్రత్యేక చికిత్స అందించినా ఆమె చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం ఇస్తున్నామని తెలిపారు. గురుకుల విద్యార్థి మరణాన్ని రాజకీయంగా వాడుకోవాలని బీఆర్ఎస్ చూస్తున్నదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో కవిత, హరీష్ ఏకమై కేటీఆర్‌ని పక్కనబెడుతున్నారనీ, కేటీఆర్‌తో పార్టీకి నష్టం జరుగుతున్నదనే భావనలో కేసీఆర్ ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం కేసీఆర్ కుటుంబంలోనే పదవుల కోసం గొడవలు జరుగుతున్నాయన్నారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్‌కు పిచ్చిపట్టి సైకోరావుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తాను తప్పులు చేశానని కేటీఆర్‌కు తెలుసనీ, అందుకే జైలుకు పోతా..పోతా..అని కలువరిస్తున్నారని దెప్పిపొడిచారు. సరైన సమయం వచ్చినప్పుడు కేటీఆర్, కేసీఆర్ అరెస్టు అవుతారన్నారు. కేటీఆర్ తన పేయిడ్ సోషల్ మీడియాతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా కుటీల యత్నాలు పన్నుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న పెయిడ్ సోషల్ మీడియా వాళ్లకు, యూట్యూబర్లకు భార్యలు, తల్లులు లేరా? అని ప్రశ్నించారు. కించపరిచే వ్యాఖ్యలు చేసేవారిపై కచ్చితంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఇంకా నాలుగేండ్లు తమకు అవకాశం ఉందనీ, ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ అయినప్పుడు ఎవరినైనా ఆదుకున్నారా? ఒక్కసారైనా బాధిత కుటుంబాలను పరామర్శించారా? అని నిలదీశారు. వాంకిడి ఘటన జరిగిన వెంటనే తాము స్పందించామనీ, మంత్రులుగా తానూ, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ బాధిత కుటుంబాన్ని పరామర్శించామని గుర్తుచేశారు. నిజంగా బాధ ఉంటే ఆ అమ్మాయి కుటుంబానికి సైకోరావు ఒక కోటి రూపాయలు ఇవ్వాలని సూచించారు. గురుకులాలకు బాధ్యులుగా ఉన్న సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారనీ, గతంలో ఆయనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్, గ్యాదరి కిషోర్‌లు స్వయంగా అసెంబ్లీలోనే ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 103 గురుకుల పాఠశాలల భవనాలు బీఆర్ఎస్ నేతల బంధువుల బిల్డింగ్‌లలోనే నడిచాయనీ, వాటికి సంబంధించిన కమిషన్ ఎవరి జేబుల్లోకి వెళ్ళిందో అందరికీ తెలుసు అని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరగణం లక్షల రూపాయలు వసూలు చేసి ఆయన ఖర్చులకు ఇచ్చేదని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ఉన్న దళిత ఓటర్లను కాంగ్రెస్ వైపు రాకుండా చూసేందుకే ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీలో చేరి పోటీచేశారని విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అన్ని గురుకులాల్లోనూ ఆయన పెట్టుకున్న టీములు పనిచేస్తున్నాయన్నారు. కమ్యూనిటీ రిలేషన్ ఆఫీసర్ ను పెట్టుకుని పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. దీనిపై కూడా లోతుల్లోకి వెళ్లి ఆరా తీస్తున్నామన్నారు. నిబంధనల మేరకు కొత్తగా టెండర్లు వేసి కొత్తవారికి కాంట్రాక్టులు ఇస్తున్నామని చెప్పారు. పులిదాడి ఘటనలో చనిపోయిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని వెంటనే వర్తింపజేశామని తెలిపారు. కవ్వాల్ అటవీ ప్రాంతంలోని వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే పనులకు వెళ్లాలని సూచించారు.

13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు

చేపట్టాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం పొందిన 13 జిల్లాల స్పౌజ్ టీచర్ల బదిలీలను వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ తిరుపతి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వ్యవహారంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తేయాలని కోరారు.

తెలంగాణ వ్యతిరేకులతో కేటీఆర్ సంబురాలా?

- ఫిషరీస్ చైర్మెన్ మెట్టుసాయికుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర విభజన వ్యతిరేకులైన మాజీ మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, గంగుల కమలాకర్ పక్కన పెట్టుకుని కేటీఆర్ దీక్షా దివస్ సంబురాలా? అని ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ నేతల జీవితమంతా అబద్ధాలేనని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే కేటీఆర్ ఎవరు? ఆయన స్థాయి ఎంత? బతుకెంత? అని ప్రశ్నించారు. కేటీఆర్ లాంటి కంచరగాళ్లకు తాము బయపడుతామా? కేటీఆర్ డ్రగ్స్ తీసుకోకుండా బయటకు వస్తాడా? కేటీఆర్ అనుకోకుండా లీడర్ అయ్యారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉండదనీ, కేటీఆర్ కూడా ఉండబోరని తెలిపారు. పదేండ్ల పాలనలో విద్యార్థులను, రైతులను అరెస్టు చేసి జైళ్లకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌పై ఇంకోసారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎవరు, ఎవర్ని ఉరికిస్తారో చూసుకుందామా? అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్న రోజే తెలంగాణతో మీకు పేగు బంధం తెగిపోయిందని తెలిపారు. ఇప్పటికైనా కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

డిజిటల్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థీకృత సైబర్ నేరాలలో 'డిజిటల్ అరెస్టులు' అనేవి పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ సైబర్ నేరాల కారణంగా భారతీయులు రాబోయే సంవత్సరంలో రూ.1.2 లక్షల కోట్లు నష్టపోతారని, ఇది జీడీపీలో 0.7 శాతమని 14సీ అంచనా వేసింది. ఈ సంవత్సరం నవంబర్ 11వ తేదీ వరకూ కేంద్ర విదేశాంగ శాఖ సైబర్ నేరాల పోర్టల్ నమోదు చేసిన ఆర్థిక నేరాల విలువ రూ.19,888.42 కోట్లు. ఇలాంటి నేరాలు జరిగినప్పుడు హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటి వరకూ 14.41 లక్షల కాల్స్ నమోదయ్యాయి. గత సంవత్సరం 15.56 లక్షల కాల్స్ వరకూ వచ్చాయి.

వేర్వేరు ఖాతాలకు 'మోసం' సొమ్ము బదిలీ

సైబర్ నేరాలు అనేక రూపాలలో జరుగుతుంటాయి. మీకు వచ్చిన పార్శిల్ కస్టమ్స్ శాఖ వద్ద ఉన్నదని, అందులో కొన్ని నిషిద్ధ వస్తువులు ఉన్నాయని, ఈ కేసు నుండి తప్పించుకోవాలంటే తాము చెప్పిన బ్యాంక్ ఖాతాలకు సొమ్మును బదిలీ చేయాలని చెబుతారు. వారు చెప్పినట్లు ఆ ఖాతాలలో సొమ్ము జమ చేశామా ఇక మోసగాళ్ల పత్తా ఉండరు. వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయి ఉంటాయి. ఒకవేళ ఆ బ్యాంక్ ఖాతాల నుండి సొమ్ము బదిలీ కాకుండా అడ్డుకుందామని అనుకున్నా ఫలితం ఉండదు. ఎందుకంటే అప్పటికే ఆ సొమ్ము వేర్వేరు ఖాతాలకు బదిలీ అవుతుంది. నేరస్థులు డబ్బు జమ చేసే వరకూ ఫోన్ చేస్తూ బాధితులను భయభ్రాంతులను చేస్తూనే ఉంటారు.

ఎలా మోసం చేయాలో శిక్షణ ఇస్తారు

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ వైద్యుడిని 48 గంటల పాటు డిజిటల్‌గా నిర్బంధించి, ఆయన వద్ద నుండి రూ.48 లక్షలు గుంజే వరకూ నేరగాళ్లు నిద్రపోలేదు. ఒకరి తర్వాత మరొకరు ఫోన్ చేస్తూ భయపెడుతూనే ఉంటారు. దీనినే 'డిజిటల్ అరెస్ట్' అంటారు. ఎట్టకేలకు లక్నో పోలీసులు విచారణ జరిపి హర్యానాలోని గురుగ్రామ్ నుండి ఐదుగురు సైబర్ మోసగాళ్లను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు పాల్పడే వారు ముందుగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుంటారు. వారికి సీబీఐ, పోలీస్, క్రైమ్‌బ్రాంచ్, మాదక ద్రవ్యాల విభాగం అధికారులమని చెప్పి ప్రజలను ఎలా మోసగించాలో వారికి శిక్షణ ఇస్తారు.

యువతకు వల

కాంబోడియా, మయన్మార్, లావోస్, అజర్‌బైజాన్ వంటి ఆసియా దేశాలు ఈ సైబర్ మోసాలకు కేంద్రాలుగా ఉన్నాయని 14సీ గుర్తించింది. ఈ దేశాల నుండే కాల్ సెంటర్లు పని చేస్తుంటాయి. థాయ్‌లాండ్‌లో ఐటీ లేదా అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి మన దేశానికి చెందిన యువతను రిక్రూట్ చేసుకుంటున్నారని అక్టోబరులో విడుదలైన ఐరాస నివేదిక తెలిపింది. థాయ్‌లాండ్ చేరుకున్న తర్వాత వీరిని ఏజెంట్లు కలుసుకుంటారు. వారు వీరందరినీ వివిధ దేశాల ఏజెంట్లకు అప్పగిస్తారు. ఆ తర్వాత సరిహద్దులు దాటించి కాంబోడియా, మయన్మార్, లావో పీడీఆర్ పంపుతారు. ఈ సంవత్సరం మే-ఆగస్ట్ మధ్యకాలంలో నేరస్థుల వలలో చిక్కుకున్న 1,300 మంది నిరుద్యోగ యువతను అధికారులు కాపాడారు.

అద్దెకు బ్యాంక్ ఖాతాలు

కాంబోడియా, మయన్మార్ దేశాలలో నేరస్థులకు స్థావరాలు ఉంటాయి. నేరస్థుల ఆదేశాల మేరకు బాధితులు ఎవరి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారో వారికి 30 శాతం వరకూ కమిషన్ అందుతుంది. కొందరైతే తమ బ్యాంక్ ఖాతాలను నేరగాళ్లకు అద్దెకు ఇస్తారంటే అతిశయోక్తి కాదు. బాధితుల సొమ్మును కొంత కాలం పాటు నిల్వ చేసుకుంటున్న వేలాది ఖాతాలను ప్రతి రోజూ గుర్తిస్తూనే ఉంటామని 14సీ చెప్పింది. గత సంవత్సర కాలంలో ఇలాంటి ఏడు లక్షల ఖాతాలను బ్లాక్ చేశారు. 'ప్రజల మనసులో ఉండే భయాన్ని మోసగాళు సొమ్ము చేసుకుంటారు. బాధితుడు తన ఆధార్ నెంబర్ ఇస్తే వారు అందులోని సమాచారాన్ని దుర్వినియోగం చేస్తారు. నువ్వు నేరంలో భాగస్వామివి అయ్యావంటూ అతన్ని భయపెడతారు. మీరు బలహీనులైతే వారు మీ మనసుతో ఆడుకుంటారు. చివరికి ఆ వ్యక్తి మోసానికి గురవుతాడు' అని అధికారులు తెలిపారు.

బాధితులకు అందింది గోరంతే

నేరం జరిగిన 24 గంటల్లోగా సమాచారం అందిస్తే ఫలితం ఉంటుంది. 14సీ ఆధ్వర్యంలో నడిచే హెల్ప్‌లైన్, పోర్టల్ రాష్ట్రాల పోలీస్ విభాగాలతో అనుసంధానమై ఉంటుంది. అంతేకాదు...300 ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, వాలెట్లకు కూడా సమాచారం అందుతుంది. బ్యాంకులు, పేమెంట్ వాలెట్లకు 14సీ నుంచి హెచ్చరికలు జారీ అవుతాయి. దీంతో అవి ఆయా ఖాతాలను స్తంభింపజేస్తాయి. అయితే ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో రూ.11,269 కోట్ల మేర మోసం జరిగిందని 14సీ సమాచారం చెబుతోంది. ఇందులో రూ.1,361 కోట్లను బ్యాంకులు ఫ్రీజ్ చేశాయి. కానీ బాధితులకు రూ.11.97 కోట్లు మాత్రమే వాపసు చేశారు.

అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాల్సిందే

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- 9న బస్ భవన్ ముందు ధర్నా : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి రంగారావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాల్సిందేనని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ పార్టీ నేతలు కె సూర్యం, ఎం హన్మేశ్, కె స్వరూప, కెఎస్ ప్రదీప్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీతో మోడీ, అమిత్‌షాకు విడదీయలేని బంధం ఉన్నదనీ, అందుకే ఆయన వ్యవహారంలో జేపీసీ వేసేందుకు జంకుతున్నారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయటంలో రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమయిందని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణమంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మూడు వేల బస్సులను ఎందుకు తగ్గించిందో చెప్పాలని ప్రశ్నించారు.

బస్సులు సరిపోక ఘర్షణలు జరుగుతున్నాయని తెలిపారు.తక్షణమే బస్సుల సంఖ్యను పెంచాలనే డిమాండ్‌తో వచ్చేనెల నాలుగున రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల ముందు ఆందోళనలు, 9న హైదరాబాద్‌లోని బస్సు భవన్‌ముందు ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావటం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన విధంగా స్పందించటంలో విఫలమయిందన్నారు. ఇలాంటి ఘటనలను సాకుగా చూపించి వంట బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. శ్రీచైతన్య, నారాయణలాంటి ప్రయివేటు విద్యా సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు విమర్శలున్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల ఆందోళనకు మాస్‌లైన్ మద్దతు ప్రకటిస్తున్నదన్నారు. ఆటో వర్కర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలనీ, ఆటో మోటారు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో వర్కర్స్ బందుకు వచ్చే నెల 7న బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. మూసీ, హైడ్రా విషయంలో పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రయివేటు మెడికల్ షాపుల దందా పెరుగుతున్నదనీ, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పోటు రంగారావు చెప్పారు.

నండూరి ప్రసాదరావు విజ్ఞాన గని

ఆయన ఆశయబాటలో ముందుకెళ్దాం : ప్రసాదరావు వర్ధంతి కార్యక్రమంలో ఎం. సాయిబాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మిక నేత నండూరి ప్రసాదరావు అన్ని అంశాలపైనా పట్టున్న విజ్ఞానగని అని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. ఆయన ఆశయబాటలో కార్మికులంతా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి ప్రసాదరావు 23వ వర్ధంతిని నిర్వహించారు. ఎం. సాయిబాబుతో పాటు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీనియర్ నేత పి.రాజారావులు ప్రసాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ భారతదేశంలో విప్లవోద్యమానికి కావాల్సిన సిద్ధాంతాన్ని తయారు చేసిన అగ్రగణ్యుల్లో నండూరి ఒకరని కొనియాడారు. అఖిల భారత కిసాన్ సభలో పనిచేస్తూనే కార్మికవర్గ ఉద్యమ నిర్మాణం కోసం సీఐటీయూ వైపు వచ్చారని గుర్తుచేశారు. ఆయన సుదీర్ఘకాలం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేశారని తెలిపారు. అనేక ప్రభుత్వరంగ సంస్థల్లోనూ, ప్రయివేటు రంగ సంస్థల్లోనూ, తిరుపతి దేవస్థానంలోనూ కార్మిక హక్కుల కోసం పోరాటాలను రూపొందించడంలో ప్రసాదరావు కృషి మరువలేనిదన్నారు. కార్మికవర్గ విషయంలో ఎంతటి జఠిలమైన సమస్యలెదురైనా అంతే వేగంగా పరిష్కారం చూపిన నేర్పరి అని కొనియాడారు. సిఐటియుగా ఆర్థిక పోరాటాలపై కేంద్రీకరించడమే గాక కార్మికుల్లో రాజకీయ, సామాజిక చైతన్యం కల్పించి అంతిమంగా సోషలిస్టు వ్యవస్థను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నొక్కిచెప్పారు. నాయకత్వ స్థాయిని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నయా ఉదారవాదం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదనీ, వారు రోడ్లెక్కుతున్నారని చెప్పారు. ఇలాంటి తరుణంలో వారిని విప్లవోద్యమం వైపు నడిపించాల్సిన బాధ్యత సిఐటియుపై ఉందన్నారు. చుక్కరాములు, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ప్రసాదరావు సీనియర్ కమ్యూనిస్టు అగ్రనేత అని అన్నారు. ఆయన ఆశయ సాధనలో ముందుకు నడవాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను పరిష్కరించడంలోనూ, తత్వశాస్త్రాన్ని బోధించడంలోనూ నండూరి కృషి మరువలేనిదని కొనియాడారు. దేశంలో మతతత్వం, అస్థిత్వ ధోరణులు పెరుగుతున్న తరుణంలో శాస్త్రీయ, భౌతికవాద దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందనీ, ఆ దిశలో నండూరి ప్రసాదరావు రచనల్ని విస్తృతంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సీనియర్ నేత పి. రాజారావు మాట్లాడుతూ ఉద్యమ అవసరాల రీత్యా పనిచేయాలనే నిబద్ధతను, నమ్రతను నాయకులు కలిగి ఉండాలని సూచించారు. కార్మికవర్గంలోనూ ఆర్థిక చైతన్యాన్నే కాకుండా రాజకీయ, సామాజిక చైతన్యాన్ని కల్పించాల్సిన బాధ్యత సీఐటీయూపై ఉందని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్వీ. రమ, భూపాల్, కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సోమన్న, ఎ. సునీత, ఎస్ఎస్ఆర్ఎ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 30-11-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 281 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

జీడీపీ ధమాల్



సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతమే
దాదాపు రెండేండ్ల కనిష్టానికి పతనం
ఆర్‌బీఐ అంచనాలకు బహు దూరం
తయారీ, గనుల రంగాలు డీలా
వ్యవసాయం భళా : ఎన్‌ఎస్‌ఓ

వివరాలు 11లో

ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలకు
తొలి ప్రాధాన్యం

వికలాంగులు, వ్యవసాయ కూలీలు సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులకు పెద్దపీట

పూర్తిస్థాయి సిబ్బందితో గృహ నిర్మాణ శాఖ బలోపేతం

లబ్దిదారులు ఆసక్తి చూపితే అదనపు గదుల నిర్మాణానికి అనుమతి : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. వికలాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు ఇలా ప్రాధాన్యతా క్రమం ఎంచుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతోపాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌లో ...11లో

తెలంగాణను నిలబెట్టిన
రైతన్నకు ప్రోత్సాహం
సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

1.53 కోట్ల టన్నుల వరి ధాన్యం పండించి దేశానికే అన్నపూర్ణగా తెలంగాణను రైతన్న నిలబెట్టారని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆ రైతన్నను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని శుక్రవారం చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఎకరాకు రూ.12 వేల బోనస్ ఇవ్వడం ద్వారా వ్యవసాయాన్ని పండగ చేసే ఈ ప్రయత్నం తనకు గొప్ప తృప్తిని ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

వేగంగా తెలంగాణ తల్లి విగ్రహం
తయారీని పరిశీలించిన సీఎం 11లో..



భూసేకరణ రద్దు

నోటిఫికేషన్ ఉపసంహరించుకున్న ప్రభుత్వం

- ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో మరో ప్రయత్నం
- టెక్స్‌టైల్ కంపెనీలపై సర్కారు దృష్టి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లా లగచర్ల ఫార్మా కంపెనీల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాలను సేకరించాలని గతంలో సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత ఆగస్టు 1న ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసిన ప్రభుత్వం రైతుల ఆందోళనల నేపథ్యంలో వెనక్కి తీసుకుంది.

అసలు జరిగిందేంటి ?

ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించతలపెట్టిన గ్రామసభ గందరగోళమైంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక రైతులు గత కొంతకాలంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ సహా ముఖ్య అధికారులంతా అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని ఆయా గ్రామాల రైతులు ఘేరావ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాడిలో పలువురు అధికారులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ విషయమై వాదోపవాదాలు, పరస్పర ఆరోపణల మధ్య రాష్ట్రవ్యాప్తంగా రాజకీయం వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో



క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన వామపక్షాలు ప్రజలతో నేరుగా చర్చించడం, ఆపైన ప్రజాభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం గమనార్హం.

మరో పేరుతో నోటిఫికేషన్ ?

ఫార్మా పరిశ్రమలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన రైతులను మెప్పించేందుకు సర్కారు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో చేసేందుకు మరో రూపంలో భూసేకరణ నోటిఫికేషన్ జారీచేయనుందని తెలిసింది. ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ఇతర పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇతర కంపెనీలైతే పర్యావరణ కాలుష్యం ఉండబోదనీ, యువతకు భారీగా ఉద్యోగావకాలు వచ్చే అవకాశముంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రధానంగా టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.



వామపక్షాల
పోరాట ఫలితమే

ఇది లగచర్ల ప్రజల విజయం : భూసేకరణ రద్దు పట్ల సీపీఐ(ఎం) హర్షం

పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లను పరిష్కరించాలి : తమ్మినేని వీరభద్రం

వివరాలు 10లో

అదానీ వ్యవహారంపై సమాచారం లేదు



మొదటిసారి నోరు విప్పిన విదేశాంగ శాఖ ప్రతినిధి

న్యూఢిల్లీ : అదానీలపై అమెరికా నేరారోపణ పత్రాన్ని దాఖలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా శుక్రవారం నోరు విప్పింది. "అమెరికా న్యాయ శాఖకు, ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల మధ్య జరిగిన చట్టపరమైన విషయం" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. పైగా ఈ దర్యాప్తు గురించి ముందుగా భారత ప్రభుత్వానికి అమెరికా తెలియచేయలేదని వివరణ ఇచ్చారు. ఇప్పటివరకు అదానీల అరెస్టు వారంటు లేదా చట్టపరమైన అభ్యర్దనలకు సంబంధించి ...11లో

ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీలు, వర్సిటీ ఉద్యోగులకు శుభవార్త

ఐదు శాతం ఐఆర్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లతో సమానంగా అన్ని ప్రభుత్వరంగ సంస్థలు, సహకార సొసైటీలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూలవేతనంపై ఐదు శాతం ఐఆర్‌ను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

సీపీఎస్, యూపీఎస్ వద్దు..ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఎన్ఈపీని రద్దు చేయాలి : ఎస్‌టీఎఫ్ఐ మహా ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఎస్, యూపీఎస్ తమకు వద్దని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) ధర్నాలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఎస్‌టీఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. " సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. ఎన్‌పీఎస్, జీపీఎస్, యూపీఎస్, పీఎఫ్ఆర్‌డీఏను వెనక్కి తీసుకోవాలి. జాతీయ విద్యా విధానం-2020ని ఉప సంహరించుకోవాలి. నాణ్యతతో కూడిన తప్పనిసరి ఉచిత విద్యను అందరికీ అందించాలి. తాత్కాలిక, అహడక్, కాంట్రాక్ట్, టెర్మ్ బేసిస్ టీచర్లను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. శాశ్వత ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలి. విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలి. అందుకు చట్టం చేయాలి. పాఠశాలల మూసివేత, విలీనం ఆపాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి" వంటి డిమాండ్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేసీ హరికృష్ణన్, సీఎన్ ...11లో



ఈ ఫలితాలు పెద్ద కుదుపే

కఠిన నిర్ణయాలతో పాటు క్రమశిక్షణా అవసరం : కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరిణామాలతో కాంగ్రెస్ లోతుగా విశ్లేషణ చేస్తోంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలను అందుకోలేకపోవడానికి మన పనితీరే పార్టీకి పెద్ద సవాల్‌గా మారిందని అన్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలతో పాటు క్రమశిక్షణ అవసరమని, ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి మార్పులు తీసుకురావాలి

"కాంగ్రెస్ ఎన్నికల వ్యూహాన్ని మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్ మెరుగుదలకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనేందుకు మెరుగైన మార్గాలను అభివద్ధి చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు మనం అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పెద్ద కుదుపే. ఇందుకు కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందకుండా పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.



ఈవీఎంలతో ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదం!

"ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఈసీ వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ కూటమి సాధించిన ఫలితాల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలను చూసి రాజకీయ విశ్లేషకులు కన్‌ఫ్యూజన్‌లో ఉన్నారు. ఇప్పటికైనా సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతానికి నేతలంతా మరింత కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి."

క్రమశిక్షణే ఆయుధం

"పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ...11లో



గుజరాత్ గులాములు..
ఢిల్లీ కీలుబొమ్మలు

ఇలాంటి వారితో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం

ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన సీఎం రేవంత్

తెలంగాణ ఆనవాళ్లను చెరిపేసేందుకు కుట్రలు పన్నుతున్నడు

ప్రతీ విషయంలోనూ ప్రభుత్వంపై ప్రతిఘటనే : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుజరాత్ గులాములు, ఢిల్లీ కీలు బొమ్మలతో తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రమాదం పొంచి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాడు ఉద్యమంపై గన్నెక్కుపెట్టిన వ్యక్తే నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. అలాంటి సీఎం... తెలంగాణ ఉద్యమ రథసారధి కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. తద్వారా ...10లో

భగ్గుమన్న పార్లమెంట్

అదానీ, మణిపూర్, సంభాల్ హింసపై చర్చకు ప్రతిపక్షాలు పట్టు



మోడీ సర్కార్ నిరాకరణ

నిమిషాల్లో పార్లమెంట్ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ హింస, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో శాంతి భద్రతల ఉల్లంఘన అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాల నినాదాల హోరుతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశాలపై ప్రభుత్వం చర్చకు నిరాకరించడంతో పార్లమెంట్ నిమిషాల్లోనే సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హోరెత్తించారు. అదానీ ముడుపులు, లంచం వ్యవహారంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ స్పీకర్ ఓం బిర్లా ...11లో



తటస్థంగా వ్యవహరించాలి

శాంతి సామరస్యతలను కాపాడాలి : యూపీ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం ఆదేశాలు

వివరాలు 11లో


డిజిటల్ అరెస్ట్

ఇదో రకం సైబర్ నేరం

- బాధితుల బలహీనతతో ఆటలు
- ఫోన్ ద్వారా నిర్బంధించి...బెదిరించి...డబ్బు గుంజుతారు
- భయపడ్డామా అంతే సంగతులు
- 24 గంటల్లో ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం



దేశంలో డిజిటల్ మోసాలు నానాటికీ పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. వీటి బారిన పడి అనేక మంది భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నారు. అవమానభారంతో కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు కూడా. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఓ కొత్త కుంభకోణం పుట్టుకొచ్చింది. ఇప్పటికే వేలాది మంది దీనికి బాధితులుగా మారారు. ముందుగా ఫోన్ చేసి ఏదో కేసులో మీ కుమారుడో లేదా కుమార్తో అరెస్టయ్యారని చెబుతారు. కేసును మాఫీ చేయాలంటే డబ్బు ముట్టజెప్పాలని తొందరపెడతారు. వారి మాటలు నమ్మి సొమ్ము సమర్పించుకుంటే అంతే సంగతులు...ఆనక మోసం జరిగిందని గ్రహించినా పెద్దగా ప్రయోజనం ఉండదు.



న్యూఢిల్లీ : ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుండి నవంబర్ 15వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా 92,323 'డిజిటల్ అరెస్ట్' కేసులు వెలుగు చూశాయి. వీటి ద్వారా రూ.2,140.99 కోట్ల ప్రజల సొమ్ము మోసగాళ్ల పరమైందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ) తెలిపింది. అయితే ఇవన్నీ పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసుల వివరాలే. చాలా మంది ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోతారు. ఈ కొత్త సైబర్ నేరం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోడీ అక్టోబర్ 27న ప్రజలను హెచ్చరించారు. నేరస్థులు ముందుగా ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత వారికి ఫోన్ చేస్తారు. వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన అధికారులమంటూ పరిచయం చేసుకుంటారు. కొందరైతే రిజర్వ్‌బ్యాంక్ నుండి అని చెబుతారు. ఏదో మోసం జరిగిపోయిందని, కేసును మూసేయాలంటే డబ్బు ఇవ్వాలని బెదిరిస్తారు. దీంతో భయాందోళనలకు గురైన బాధితులు వారు అడిగినంత సొమ్ము ముట్టజెబుతారు. పెరుగుతున్న సైబర్ నేరాలు దేశంలో చోటుచేసుకుంటున్న ...2లో

నవతెలంగాణ

గెలుస్తానన్న నమ్మకం లేనివాడు, ఓడిపోతాననే అనుమానం ఉన్నవాడు కచ్చితంగా పరాజయం పాలవుతాడు - నెపోలియన్

శనివారం 30 నవంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

నేడు అజ్మీర్ షరీఫ్.. రేపు..?

మొన్నటిదాకా అయోధ్య, బాబ్రీ మసీదు, రామమందిరం...! ఆ వివాదం ముగిసిందో లేదో వారణాసి, జ్ఞానవాపి మసీదు, విశ్వేశ్వరాలయం...!! తాజాగా ఆ జాబితాలో రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ చేరింది. అసలీ దేశంలో ఇవి తప్ప ఇంతకు మించిన సమస్యలే లేవా? అంతులేని అసమానతలు, అదుపులేని ధరలు, అంతకుమించిన ఆకలి, నిరుద్యోగంతో ప్రజాజీవితం అంతకంతకూ అగాథంలోకి జారుతుంటే, ఇవేవీ కనీస చర్చకు నోచుకోకపోవడం వైచిత్రి! మన ప్రయాణం ఏవైపునకు సాగుతుందో తెలుసుకోడానికి ఇంతకంటే ఉదాహరణలేం కావాలి? పాలకులు మనుషుల్ని మతాలుగా చీల్చేస్తున్నారు. 2024 ఎన్నికల ముందు జ్ఞానవాపి వివాదం తెరమీదికి వచ్చింది. త్వరలో మరి కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అజ్మీర్ షరీఫ్ దర్గా శివాలయం అన్న అర్జీ

> 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని దేవాలయాలు, మసీదులు,చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాలన్నీ ఎలా ఉన్నాయో అలాగే ఉంచాలి తప్ప వాటిలో ఎలాంటి మార్పులకు, వివాదాలకు చోటివ్వరాదని నిర్దేశిస్తుందీ చట్టం. ఇప్పుడు అలాంటి వాటి గురించే వివాదాలు లేవనెత్తుతూ పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని విచారణకు స్వీకరించడం ఆ చట్టాన్ని ఉల్లంఘించడమేనని జడ్జీలకు ఎందుకు తట్టదో అంతుపట్టదు. 1991 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేండ్లు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం చట్టంలోనే ఉంది. అర్జీలు పెటుకున్నవారికి, వాటిని విచారించిన జడ్జీలకు ఈ చట్టం కింద శిక్ష పడ్డ దాఖలాలు ఎక్కడా లేవు.

దాఖలైంది. రాజస్థాన్ కోర్టు ఆ పిటిషన్ విచారించడానికి అంగీకరించింది. దర్గా కమిటీకి, భారతీయ పురాతత్వశాఖకు, మైనారిటీశాఖకు సైతం నోటీసులు జారీ చేసింది. సర్వే చేయించడానికి సిద్ధపడింది. ప్రజల భావోద్వేగాలతో చెలగాట మాడటం, వారి నెత్తుటి ధారలతో పీఠాలకు బాటలు వేసుకోవడం ఈ పాలకులకు కొత్తేమీకాదు గానీ, ఈ ఉన్మత్త రాజకీయాల పట్ల ప్రజల ఉదాసీనతే అవాంఛనీయం. న్యాయస్థానాలు కూడా ఇది గుర్తించక పోవడం ఆందోళనాకరం. అందుకే కండ్లకు కాషాయం పులిమి మరీ సామరస్యాన్ని కూల్చేస్తున్నారు.



అజ్మీర్ షరీఫ్ ఖాజా మొయినుద్దీన్ చిష్టీ దర్గా కింద దేవాలయం ఉందని మధ్యాహ్నం అర్జీ దాఖలు చేస్తే వెంటనే కోర్టు దాన్ని విచారణకు స్వీకరిస్తుంది. పురాతతత్వ శాఖ సర్వే ప్రారంభిస్తుంది. కానీ, ముస్లింలపై దాడులు, మూక హత్యలు గత పదేండ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. వీటి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది సంఘ పరివార్ ఎజెండా అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అజ్మీర్ దర్గా కింద శివాలయం ఉందన్న వాదన మూడేండ్ల నుంచి కొనసాగుతూనే ఉంది. ప్రకటనల మీద ప్రకటనలు జారీ చేస్తూనే ఉన్నారు. అజ్మీర్ షరీఫ్ దర్గా దాదాపు 400 ఏండ్ల నుంచి ఉంది. అన్ని మతాలవారు ఈ దర్గా సందర్శిస్తారు. ఒక రకంగా దర్గాలు భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణం. ఈ దర్గాను "సంకట్ మోచన్ మహాదేవ్" దేవాలయంగా ప్రకటించాలని హిందూ సేనకు చెందిన విష్ణు గుప్తా పిటిషన్ దాఖలు చేశారు. సదరు విష్ణు గుప్తాకు దర్గా కింది హరిహర దేవాలయం ఉన్నట్టు కల వచ్చిందట. ఆ కల ఆధారంగా ఆయన పిటిషన్ దాఖలు చేశారు. విజ్ఞత గల కోర్టు దాన్ని విచారించ డానికి అంగీకరించడం విషాదం.


ఇందులో విష్ణు గుప్తా మత రాజకీయ చదరంగంలో చిన్నపావు కావొచ్చు. దీని వెనక పెద్ద ప్రణాళిక ఉందనడం మాత్రం సత్యం. ఈ దర్గాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నింటీ రద్దు చేయాలని కూడా అభ్యర్థించారు. ఈ దర్గా పర్యవేక్షణ ప్రధాన ద్వారం హిందూ వాస్తుశాస్త్రానికి అనుగుణంగా ఉన్నట్టు కనిపిస్తోందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. సంభాల్లో ఇటీవలే మత కలహాలు జరిగాయి. అక్కడ కూడా వివాదం మసీదు కింద మందిరం ఉందనేదే.

అయితే, ఇలాంటి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోగలిగిన కోర్టులు, 1991 ప్రార్థనా స్థలాల చట్టాన్ని మాత్రం విస్మరించడం విడ్డూరం! 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాలన్నీ ఎలా ఉన్నాయో అలాగే ఉంచాలి తప్ప వాటిలో ఎలాంటి మార్పులకు, వివాదాలకు చోటివ్వరాదని నిర్దేశిస్తుందీ చట్టం. ఇప్పుడు అలాంటి వాటి గురించే వివాదాలు లేవనెత్తుతూ పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని విచారణకు స్వీకరించడం ఆ చట్టాన్ని ఉల్లంఘించడమేనని జడ్జీలకు ఎందుకు తట్టదో అంతుపట్టదు. 1991 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడేండ్లు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం చట్టంలోనే ఉంది. అర్జీలు పెటుకున్నవారికి, వాటిని విచారించిన జడ్జీలకు ఈ చట్టం కింద శిక్ష పడ్డ దాఖలాలు ఎక్కడా లేవు.

హిందూ రాజులే హిందూ దేవాలయాలను కొల్లగొట్టిన సందర్భాలు కూడా కోకొల్లలు. ఈ దేశంలో దేవాలయాల విధ్వంసం ఓ కాదనలేని చారిత్రక సత్యం. ఇందుకు ఏ మతానికీ మినహాయింపు లేదు. అదే సమయంలో ఈ విధ్వంసాలు, మత విద్వేషాలు మధ్యయుగాల నాటి అజ్ఞానానికీ, అనాగరికానికీ, రాజ్యవిస్తరణ కాంక్షకూ ప్రతీకలు అనడం కూడా అంతే వాస్తవం. కానీ ఈ తరతరాల మూఢత్వాన్నీ మూర్ఖత్వాన్నీ ఛేదించుకుని శాంతీ, సహజీవనం, సామరస్యాలను సాధించింది పరిణామం. వీటిని కాపాడు కోవడం, మరింత ముందుకు తీసుకుపోవడం నేటి ఆధునిక సమాజ లక్ష్యాలు కావాలి తప్ప, తిరోగమనంలోకి నడవడం కాదు కదా..?!

తెలుగు వెలుగుల నీడ 'గురజాడ'

'దేశమును ప్రేమించమన్నా,మంచి అన్నది పెంచమన్నా, వొట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేలు తల పెట్టవోయ్, పాడి పంటలు పొంగి పొరలె దారిలో నువ్వుపాటు పడవోయ్,తిండి కలిగితే కండ కలదోయ్,కండ కలవాడె మనిషోయ్" ఈ దేశభక్తి గీతం ఎవరు రాశారని అడిగితే ఇట్టే చెప్పే సమాధానం గురజాడ అప్పారావు. తన రచనల ద్వారా వాడుక భాష వ్యాప్తికి, సమాజ సంస్కరణకి కృషి చేసిన ఆయన అభ్యుదయ కవితా పితామహుడిగా కీర్తి గడించారు. తెలుగు సాహిత్య రంగంలో తన కంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సాహితీకారుడు.1862 సెప్టెంబర్ 21న ఉమ్మడి ఏపీలోని విశాఖపట్నం జిల్లా యలమంచిలి మండలం రాయవరం గ్రామంలో జన్మించిన ఆయన 1915 నవంబర్ 30న 53 ఏండ్ల వయసులో మృతిచెందారు. విజయనగరంలోనే స్థిరపడ్డ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన



మహాకవి. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు, హేతువాది. 19వ, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ అతను చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. అతను ప్రజలందరికీ అర్థమయ్యే జీవభాషలో రచనలు చేశారు. వీరి కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం. ఈ నాటకంలో అతను సృష్టించిన గిరీశం, మధురవాణి రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. విజయనగరంలో ఆయన డిగ్రీ చదువుతున్నప్పుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి అతనికి సహాధ్యాయి.వారిద్దరూ ప్రాణస్నేహితులు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుకభాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909లో రచించారు. 1892లో గురజాడ వారి కన్యాశుల్కము నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీంతో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికినట్టయింది. గురజాడ, గిడుకు ఇద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో అలసట ఎరగకుండా తలపడ్డారు. గిడుగు వాదనాబలానికి, గురజాడ రచనాశక్తి వ్యవహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి.వీరు నాడు తెలుగు భాషకు చేసిన కృషికి మరింత వన్నెతెచ్చే విధంగా నేడు కవులు, రచయితలు రచనలు చేయాలి. తెలుగు భాషకు సాటి ఏదీ లేదని చాటిచెప్పాలి.

(నేడు గురజాడ వర్ధంతి)

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

'ప్రజాపాలన'లో కార్మికవర్గానికి ఒరిగిందేమిటి?



భూపాల్
9490098034

రాష్ట్రంలో కాంగ్రెసు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నది. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రజాపాలన పేరిట విజయోత్సవాలు జరుపుకుంటున్నది. అన్ని స్థాయిల్లోని ఉద్యోగులను, కార్మికులను, ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నది. సంవత్సర కాలంగా ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరువు పెడుతున్నది. వాస్తవంగా పదేండ్ల బీ(టీ)ఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజానీకం కాంగ్రెస్‌కు పట్టంగట్టింది. కాంగ్రెస్ ఆరుగ్యారంటీల పథకం కూడా ఇందుకు దోహదం చేసింది. మరి రాష్ట్ర ప్రభుత్వ పయనం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ఉందా? తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు ప్రజాపాలనేనా?

ప్రధానంగా కార్మికవర్గం సమస్యల్ని ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో కొన్ని కీలకమైన వాగ్దానాలు చేసింది. వాటి గురించి ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఎక్కడా ప్రస్తావించింది లేదు. విజ్ఞప్తులు చేస్తున్నా కార్మిక వర్గం పట్ల నిర్లక్ష ధోరణితో వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, కాంట్రాక్ట్ - ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమ బద్ధీకరణ, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, స్కీమ్ వర్కర్లలో అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.18వేలు, ఆశాలకు వేతనాల పెంపు, మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.10వేలు, బీడీ కార్మికులకు జీవిత బీమా, ఈఎస్ఐ, పరిధి వర్తింపు లాంటి హామీలనిచ్చింది. ఇంకా నిరుద్యోగుల కోసం నెలకు రూ.4వేల భృతి, వికలాంగుల నెలవారీ పెన్షన్ రూ.6వేలకు పెంపు, చక్కెర కర్మాగారాలు, పసుపు బోర్డుల ఏర్పాటు, పద్దెనిమిది సం॥లు పైబడిన ప్రతి విద్యార్థికి స్కూటీ, ఆడపిల్లల పెండ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం తదితర ముఖ్యమైన వాగ్దానాలు చేసింది. ఇవన్నీ కార్మికవర్గానికి వారి కుటుంబాలకు ప్రయోజనం కలి గించే హామీలు. వీటితో పాటు రాష్ట్రంలో కోటి ఇరవై లక్షల మంది కార్మికవర్గానికి వేతనాల సవరణ, సింగరేణికి కొత్త బొగ్గుబావులు, ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు కూడా హామీల్లోని ముఖ్యమైన అంశాలు. వీటిలో ఏ ఒక్కటీ కూడా అమలు చేయకపోవడం కార్మికవర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేస్తున్నది. ఈ పరిస్థితిలో కొత్తసర్కార్ కార్మికవర్గానికి చేసిన మేలేంటి అనేది ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏడాది కాలంలో పెట్టుబడిదారి వర్గానికి రెడ్ కార్పెట్ పరుస్తూ ఆర్థికరంగంలో బీజేపీ విధానాలనే కొనసాగిస్తున్నది.

రాష్ట్రంలో తొమ్మిది లక్షల మంది ప్రభుత్వ శాఖల్లో పనిచేసే

> రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ రంగంలోని 23 వేల మంది ఆర్టిజన్ల సర్వీసులను జూనియర్ లైన్‌మెన్లుగా కన్వర్షన్ ఇవ్వాలని జెపిసిగా పోరాడుతున్నది. టీజీఎస్ఆర్టీసీలోని ఉద్యోగులకు పనిభారం పెరిగింది. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలకు ఉపయోగపడినా బస్సుల సంఖ్య పెంచకపోవడం, ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవు తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వల్ల ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆర్టీసీలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. తెలంగాణకు ఆదాయాన్ని సమకూర్చే నల్ల బంగారం (బొగ్గు) ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బావులు సాధించకుండా, వాటి కోసం కేంద్రంతో పోరాడకుండా లోపాయికారిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు కేంద్రం వేలంపాటలను వ్యతిరేకించడం లేదు.

కార్మికుల నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు. వీరికి ప్రతి ఐదేండ్లకోసారి పిఆర్‌సి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పదహారు నెలలు గడిచినా ఎప్పుడిస్తారన్నది తేల్చ లేదు. ఐదు డిఏలలో ఒక డిఏ ఇచ్చి చేతులు దులుపుకున్నది. ఇంకా నాలుగు డిఏలు బకాయి పెట్టింది. ఎప్పుడిస్తారన్నది చెప్ప డం లేదు. ప్రభుత్వ శాఖల్లో రెండులక్షల ఖాళీలుంటే అరకొరగా నోటిఫికేషన్లు వేసి పోలీసులు, టీచర్లు, వైద్యశాఖ తదితరాలలో కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేసింది. నిరుద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా ఖాళీ పోస్టుల భర్తీలేదు. నిరుద్యోగుల కోసం యూత్ కమిషన్ పేరిట రూ.పది లక్షల వడ్డీ లేని రుణం ఊసేలేదు. కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు విద్యాభరోసా కింద ఇస్తామన్న రూ.ఐదు లక్షల హామీ అటకెక్కింది. ఇవన్నీ అమలు చేస్తే కార్మిక కుటుంబాలకు పరోక్షంగా మేలు జరిగేది. రెండు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. 1995 నుండి పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. వీరందరూ ప్రత్యేక రాష్ట్రం ఏర్ప డితే తాము పర్మినెంట్ అవుతామని ఆశించిన వారిని బీఆర్ఎస్ సర్కార్ మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుంద నుకుంటే స్పందించడం లేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏజెన్సీలను రద్దుచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. వీరందరినీ పర్మినెంట్ చేయడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారమేమి పడదు. నిరుద్యోగుల ఉద్యోగాలకు సంబంధం ఉండదు. కానీ హైకోర్టు కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయరాదని ఉత్తర్వులిచ్చింది. దీన్ని ప్రభుత్వం సమీక్షించి అందర్నీ పర్మినెంట్ చేయాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో స్కీమ్ వర్కర్లది కీలక పాత్ర. నేషనల్ హెల్త్ మిషన్‌లోని పదిహేడు వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్ ఉన్నది. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు తమ సర్వీసులను పరీక్షా విధానం లేకుండా క్రమబద్ధీకరించాలని పోరుబాటలో ఉన్నారు. 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైంది. ఆరోగ్యమిత్రలకు హామీనిచ్చిన డిఇఓ కేడర్ వేతనాలు పెంచడం లేదు. కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాల్సి అవసరం ఉన్నది. కాంగ్రెస్ పార్టీ 70 వేల మంది అంగన్‌వాడీలకు నెలకు రూ.18వేలు జీతం ఇస్తామని చెప్పినా, నేటికీ చర్యలు తీసుకోలేదు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష ఇస్తామని ఇవ్వకుండా మోసం చేసింది. వీరికి సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలి. 26వేల మంది ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు వీరికి రూ.18వేల వేతనమివ్వాలి. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు హామీ నిచ్చిన వేతనం రూ.10వేలకు పెంచనేలేదు. ఐకెపి విఓఏలకు కనీస వేతనాలు పరిస్థితి కూడా అంతే. ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నది. 52 వేల మంది గ్రామ పంచాయితీ కార్మికులకు వేతనం పెంచలేదు. మున్సిపల్ కార్మికులకు పక్క రాష్ట్రం మాదిరిగా రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టింపు కరువైంది. అలాగే యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్‌స్కేల్ ఉద్యోగుల పర్మినెంట్ గురించి ఆలోచించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి భారం లేని ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు పిఆర్‌సి వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నది. వేలాదిమంది సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, స్కూల్ స్వీపర్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, గురుకుల కార్మికులు, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు నెల నెలా జీతాలు చెల్లిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాల్సి ఉంది.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ రంగంలోని 23 వేల మంది ఆర్టిజన్ల సర్వీసులను జూనియర్ లైన్‌మెన్లుగా కన్వర్షన్ ఇవ్వాలని జెపిసిగా పోరాడుతున్నది. టీజీఎస్ఆర్టీసీలోని ఉద్యోగులకు పనిభారం పెరిగింది. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలకు ఉపయోగపడినా బస్సుల సంఖ్య పెంచకపోవడం, ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బంది ఎదురవు తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వల్ల ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆర్టీసీలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. తెలంగాణకు ఆదాయాన్ని సమకూర్చే నల్ల బంగారం (బొగ్గు) ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బావులు సాధించకుండా, వాటి కోసం కేంద్రంతో పోరాడకుండా లోపాయికారిగా వ్యవహరిస్తున్నది.



తెలంగాణ బొగ్గు సింగరేణి హక్కు. కేంద్రం వేలంపాటలను వ్యతిరేకించడం లేదు. రాబోయే పదేండ్లలో సింగరేణి పూర్తిగా ప్రయివేటీకరణ అయ్యే ప్రమాదమున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి ఉద్యోగుల సభలో పాల్గొని సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పారు. అలవెన్సులపై ఇన్‌కమ్‌టాక్స్‌ను కోలిండియా మాదిరిగా సింగరేణి ఉద్యోగులను రీయంబర్స్‌మెంట్ చేస్తామన్నారు. వీటిన్నింటిని 'ప్రజాపాలన'లోనే మర్చిపోయారు.

అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలిలోని వందల కోట్ల రూపాయలు కార్మికుల కోసం కాకుండా ఇతర అవసరాలకు వాడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయలేదు. ఐదు లక్షల మంది హమాలీలకు కూడా వెల్ఫేర్ బోర్డు లేదు. కార్మిక సంక్షేమ నిధి రుసుము యాజమాన్యం వాటా కనీసం రూ.వందలకు ఆదుకోవాల్సి ఉంది. పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ వర్కర్స్ ఐదు లక్షల వరకు ఉంటారు. వీరి సబ్సిడీలు, కూలీరేట్లు పెంచడం లేదు. నెలకు 26 రోజులు పని కల్పించాలి. రాష్ట్రంలో ఏడు లక్షల మందిలో నాన్‌పీఎఫ్ సమస్య పరిష్కరించాలి. అందరికీ జీవనభృతినివ్వాలి.మరో కీలక సమస్యను కాంగ్రెస్ సర్కార్ విస్మరించింది. తన పెట్టుబడిదార్ల సభ్యత్వాన్ని చాటుకున్నది.

> ప్రజాపాలన పేరిట ప్రభుత్వం ప్రజావాణిని నిర్వహిస్తున్నది. అధికారంలోకి వచ్చిన రోజే ప్రగతి భవన్ గేట్లు కూలగొట్టింది. కానీ ప్రజాస్వామ్యం కనబడటం లేదు. సమ్మెలను నిషేధిస్తున్నది. పోరాటాల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తున్నది. ఇటీవల లగచర్ల ఫార్మా బాధితులు, దామగుండం ప్రాజెక్ట్ నిరసనకారులు, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జరిగిన పోరాటం అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ప్రజల తిరుగుబాటుతో కొన్నింటిలో వెనక్కి తగ్గడం అనివార్యమైంది. రాష్ట్రంలో పేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే నేటికీ పట్టాలివ్వాలని స్పష్టంగా ఉత్తర్వులివ్వలేదు. గృహలక్ష్మి పథకంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు పట్ల నేటికీ స్పష్టత లేదు. రాష్ట్రంలో రైతు, కూలీ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లేదు. వ్యవ సాయ కూలీలు, కౌలు రైతుల రక్షణ గురించి పట్టింపు లేదు. మధ్యతరగతి ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతున్నది.

రాష్ట్రంలో 1.20 కోట్ల మందికి వర్తించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాలు పెంచకుండా సవరించి మోసం చేసింది. 2024 జనవరి 30న 73 జీఓలు ఇస్తూ పాత బేసిక్, డిఏలను కలిపి "కొత్త సీసాలో పాత సారా" మాదిరి వేతనాలు నిర్ణయించింది. కనీస వేతనాల సలహా మండలి వేయకుండా చైర్మన్‌ను నియమించడం విడ్డూరం. ఒక వర్కర్స్ పాలసీ అంటూ ఏమీలేదు. పెట్టుబడిదారులకు అన్నిరకాల రాయితీలిస్తూ గత ప్రభుత్వ విధానాల్ని కొనసాగిస్తున్నది. పారిశ్రామిక కార్మికుల హక్కులు కాపాడటం లేదు. నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకించడం లేదు. వలస కార్మిక చట్టం అమలు ఊసే లేదు.

ప్రజాపాలన పేరిట ప్రభుత్వం ప్రజావాణిని నిర్వహిస్తున్నది. అధికారంలోకి వచ్చిన రోజే ప్రగతి భవన్ గేట్లు కూలగొట్టింది. కానీ ప్రజాస్వామ్యం కనబడటం లేదు. సమ్మెలను నిషేధిస్తున్నది. పోరాటాల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తున్నది. ఇటీవల లగచర్ల ఫార్మా బాధితులు, దామగుండం ప్రాజెక్ట్ నిరసనకారులు, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జరిగిన పోరాటం అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ప్రజల తిరుగుబాటుతో కొన్నింటిలో వెనక్కి తగ్గడం అనివార్యమైంది. రాష్ట్రంలో పేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుంటే నేటికీ పట్టాలివ్వాలని స్పష్టంగా ఉత్తర్వులివ్వలేదు. గృహలక్ష్మి పథకంతో పాటు ఆరు గ్యారంటీలు అమలు పట్ల నేటికీ స్పష్టత లేదు. రాష్ట్రంలో రైతు, కూలీ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లేదు. వ్యవ సాయ కూలీలు, కౌలు రైతుల రక్షణ గురించి పట్టింపు లేదు. మధ్యతరగతి ప్రజల్లోనూ అసంతృప్తి పెరుగుతున్నది.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో కార్మిక రంగం పట్ల ప్రదర్శిస్తున్న వివక్షను ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబానీ, ఆదానీ, టాటా, బిర్లా లాంటి బడాపెట్టుబడిదారుల స్వప్రయోజనాలు, కాంట్రాక్టర్ల లాభాలకన్నా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారన్నది గమనంలో పెట్టుకోవాలి. ఏడాదికాలంలోనే ప్రజల్లో ఎందుకింత వ్యతిరేకత వచ్చిందనేది విషయాన్ని కూడా సమీక్షించుకోవాలి. ప్రధానంగా కార్మికవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడమే ప్రధాన కారణమని గుర్తెరగాలి. ఇకనైనా కార్మిక,కర్షక వర్గాలకు న్యాయం చేసే విధంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అదే అసలు సిసలైన 'ప్రజాపాలన' అనిపించుకుంటుంది.

చావడానికేనా...ఈ చదువులు?

'రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారా?' అంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని మందలించే స్థితికి విద్యా వ్యవస్థ చేరింది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే 'విద్యార్థులకు పోషకాహారం అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఇటీవల ప్రకటించారు. ఆయనే కాదు,రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులూ ఘటన జరిగిన ప్పుడు హడావుడి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించడం నిత్యకృత్యమైంది. ఆ తర్వాత షరామామూలే.



టి. నాగరాజు
9490098292

ఆర్థిక స్థోమత లేనివారు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చేర్పిస్తారు. అక్కడైనా వారికి కడుపునిండా తిండి, నాణ్యమైన విద్య, భవిష్యత్తుకు భరోసా అందుతుందని వారి ఆశ. కానీ, గురుకులాలు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ వల్ల తమ పిల్లలు ఆస్పత్రుల పాలయ్యారని తెలియగానే ఎక్కడో స్వగ్రామాల్లో కూలోనాలో చేసుకుని బతికే తల్లిదండ్రులు ఎంత వేదనకు గురవుతారో చెప్పనక్కర్లేదు. వారి స్థానంలో ఉండి ఒక్కసారి ఆలోచిస్తేనే కడుపు తరుక్కుపోతోంది. పేద విద్యార్థులు చదువుకుంటున్న ఈ విద్యాసంస్థల పట్ల పాలకులు తమ బాధ్యతను మరచిపోతున్నారని చెప్పడానికి ఫుడ్‌పాయిజన్ ఘటనలు నిదర్శనం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి రాష్ట్రంలో ఇలాంటివి అనేకం వెలుగుచూశాయి. ఈ ఏడాదిలోనే 38 సార్లు ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి. నలుగురు విద్యార్థులు చనిపోయారు. 938 మంది విద్యార్థులు ఆస్పత్రుల్లో చేరారు. జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, ఖమ్మం, నారాయణపేట, కరీంనగర్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, భువనగిరి జిల్లాల్లో అనేక ఘటనలు గురుకుల విద్యాసంస్థల్లో ఈ కాలంలో జరిగాయి. దీన్ని ప్రభుత్వం ఒక రాజకీయ అంశంగా కాకుండా ఉన్నత చదువుల కోసం వచ్చి పిట్టల్లాగా రాలిపోతున్న పేద విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి. అసలెందుకు ఫుడ్ పాయిజన్ అవుతుంది? విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయో? తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఉంటే ఈ ఘటనలు పునరావృతం ఎందుకవుతున్నాయి.

కొత్తమెనూ అమలుపై పర్యవేక్షణేది?

2016 నుండి మెస్‌చార్జీలను గత సర్కార్ పెంచలేదు. రెండు నెలల క్రితం మెస్‌చార్జీలను ప్రస్తుత ప్రభుత్వం పెంచింది. ఈ పెంచిన ఛార్జీల ప్రకారం మెనూ అందుతుందా, లేదా అనే పర్యవేక్షణ అధికార యంత్రాంగంలో లేదు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో కాంట్రాక్టులు తీసుకున్న వారు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయడం లేదనే విమర్శలు అనేకం. ధరలు తక్కువగా ఉన్నవి, కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లు అందిస్తున్నరనేది కూడా నిజం. పూర్తిస్థాయిలో మెనూ పాటించక పోవడం వలన తరచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న మాట కూడా వాస్తవం. కేవలం ఘటన జరగ్గానే కొందర్ని బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ చేస్తున్నది ప్రభుత్వం. ఈ అంశంపై మూలాల్లోకి వెళ్లకపోవడం విచారకరం. ఫుడ్ పాయిజన్ జరగటానికి నాణ్యమైన భోజనం అందకపోవడం ఒక్కటే కారణం కాదు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాల్లో పరిశుభ్రత లేకపోవడం, సరిపడా గదులు లేకపోవడం, అపరిశుభ్రమైన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాలు చేయడానికి కూడా నీళ్లు దొరక్క అంటువ్యాధుల బారిన పడుతున్నారు విద్యార్థులు. కొంతమంది దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నారు. మరో పక్క చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పాములు, తేళ్లకు నిలయాలుగా మారి అధ్వాన పరిస్థితిలో సంక్షేమవసతి గృహాలు నెట్టబడ్డాయి. ఇందులో వసతిపొందే విద్యార్థుల బతుకులకు మరీ భద్రత లేకుండా పోయింది. ఇన్ని సమస్యలున్నా సర్కార్ ఎందుకు దృష్టి పెట్టటం లేదని ప్రశ్నిస్తే సమాధానం ఉండదు.

అధిక సమయపాలన..మానసిక ఒత్తిడి

దీనికితోడు ఈ మధ్య గురుకులాల్లో తీసుకొచ్చిన అశాస్త్రీయమైన సమయపాలన విద్యార్థులను, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఉపాధ్యాయులు సైతం పర్యవేక్షణ చేసే అవకాశం లేకుండా చేసేలా ఉదయం నుండి సాయంత్రం వరకు తీవ్ర ఒత్తిడితో ఉన్న పనిగంటల్ని అమలు



చేయడంతో విద్యార్థులు మానసికంగా బలహీనంగా ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వీరికి చదువు భారమనే ఫీలింగ్ రాకుండా దృఢంగా ఉంచేందుకు కౌన్సిలింగ్‌లు కూడా లేదు. దీంతో కొత్తగా చేరినవారు, చదువులో ఒత్తిడిని అధిగమించనివారు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యల పరంపర ఓవైపు రాష్ట్రంలో కొనసాగుతుండగానే జగిత్యాల జిల్లా పెద్దాపూర్‌లో, కుమరం భీం జిల్లా వాంకిడిలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణించడం శోచనీయం. ఇంటర్నేషనల్ స్థాయి విద్యను అందిస్తామన్న ప్రభుత్వం వీటి నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. రాష్ట్రంలో ఈ సమస్యలు పరిష్కరించడానికి, సమీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ మంత్రిని నియమించలేదు. స్వయంగా ముఖ్యమంత్రే ఈ శాఖను చూస్తున్నారు. అంటే, విద్యారంగం మరింత ఉన్నతమైన స్థితిలో ఉంటుందని ఎవరైనా ఆశిస్తారు.కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ఫలితం శూన్యం. ఈ విద్యాశాఖ ఒక్కటే కాదు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖలకు మంత్రులు లేరు. మరి ఎవరు ఈ సంబంధిత శాఖలకు సంబంధించిన విద్యార్థులను పట్టించుకోవాలి, వీరి సమస్యల్ని ఎవరు తీర్చాలి? దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

మధ్యాహ్న భోజనం విద్యార్థుల హక్కు

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయి. వారికి పెట్టే ఒక్కపూట భోజనం కూడా సరిగ్గా అందిం చడం లేదు. పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఎవరి దయా దాక్షిణ్యాలతో అమలు చేస్తున్నది కాదు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రకటించే పథకం అంతకన్నా కాదు. అది విద్యార్థులు జీవించే హక్కులో భాగంగా వచ్చినదే. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్నభోజన పథకం తీసుకొచ్చామని చెబుతున్న పాలకులు, ఇదిఇది వారి హక్కు అని తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు. రాష్ట్రంలో 27 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 23లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో 80 శాతం వరకు విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంతో లబ్ధి పొందుతున్నారు. ఇంతమంది విద్యార్థుల ఆకలి తీర్చడానికి 52 వేల మందికి పైగా వంట కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలు, పర్యవేక్షణలో ఎన్నో సమస్యలు తలెత్తుతు న్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులైన వంటగదులు, వంట పాత్రలు, తాగునీరు లేని పాఠశాలలెన్నో ఉన్నాయి. పాఠశాలకు బియ్యం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సరఫరా చేస్తే.. పప్పు, నూనె, కూరగాయలు, గుడ్లు వంటి వాటిని ఏజెన్సీవారు కొనుక్కొంటున్నారు.

వడ్డీకి తెచ్చి వండుతున్న కార్మికులు

ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1నుంచి 5వ తరగతి చదివే ఒక్కో విద్యార్థికి రూ.5.70, 6-8వ తరగతి చదివే విద్యా ర్థులకు రూ.8.40, 9-10 తరగతులు చదివే విద్యార్థులకు రూ.10.40 కేటాయిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మొత్తం చెల్లిస్తున్నది. 6 నుంచి 8వ తరగతులు చదివే విద్యార్థులకు కేంద్రం 60 శాతం చెల్లిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చెల్లిస్తున్నది.9, 10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం చెల్లిస్తున్నది. విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు ఇవ్వాలి. ఒక్కో గుడ్డు ధర మార్కెట్‌లో రూ.7 నుంచి 8 వరకు ఉన్నది. అయితే,

> రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ ఘటనలు పెరుగుతున్నాయి. వారికి పెట్టే ఒక్కపూట భోజనం కూడా సరిగ్గా అందిం చడం లేదు. పాఠశాలల్లో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం ఎవరి దయా దాక్షిణ్యాలతో అమలు చేస్తున్నది కాదు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రకటించే పథకం అంతకన్నా కాదు. అది విద్యార్థులు జీవించే హక్కులో భాగంగా వచ్చినదే. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్నభోజన పథకం తీసుకొచ్చామని చెబుతున్న పాలకులు, ఇదిఇది వారి హక్కు అని తెలుసుకోవడంలో విఫలమవుతున్నారు.

ఇందుకుగాను ప్రభుత్వం నెల నెలా బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో వంటకార్మికులే వడ్డీకి అప్పులు తెచ్చి ఆ ఖర్చులను భరిస్తున్నారు. ధరలు పెరగడం, జీతాలు సమయానికి రాకపోవడం వంటి సమస్యలతో నాణ్యమైన భోజనం అందించలేని పరిస్థితి కూడా ఓ కారణంగా కనిపిస్తోంది. వీటికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలి. అలాగే మధ్యాహ్న భోజనాన్ని స్వచ్ఛంద సంస్థలకు, అక్షయపాత్ర లాంటి సంస్థలకు, సెంట్రలైజ్ కిచెన్‌కు ఇవ్వాలని చేస్తున్న ఆలోచనలు మానుకోవాలి. ప్రభుత్వమే నేరుగా ఈ బాధ్యతల్ని తీసుకుని నిర్వహించాలి.

ఈ ఘటనల నుండి ప్రభుత్వం ఇప్పటికైనా నివారణా చర్యలు తీసుకోవాలి. విద్యావ్యవస్థ బలోపేతానికి తగిన నిధులు కేటా యించడం, రోజువారీగా ప్రభుత్వం ఇస్తున్న మెనూ అమలయ్యేలా చూడటం, ఈ పర్యవేక్షణ కోసం అవసరమైతే ప్రత్యేకంగా అధికారులను నియమించడం చేయాలి. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలి. బలహీన వర్గాలు చదువుతున్న ఈ విద్యా సంస్థలపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే ఫుడ్ పాయిజన్ ఘటనలు భవిష్యత్తులోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనల వల్ల విద్యార్థులు చదువుకోవాలన్నా, వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలన్నా సంశయించే పరిస్థితి వస్తుంది. విద్య అంటే బరువు కాదని, భవిష్యత్తుకు భరోసా అనే చైతన్యాన్ని సమాజానికి కలిగించాలి. దీనికి కావాల్సింది పాలకుల పర్యవేక్షణ, ప్రదర్శించాల్సింది చిత్తశుద్ధి.

విద్యార్థుల అల్పాహారానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించుటకు బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బతినేని నాగప్రసాద్ రావు, నీరజ దంపతులు శుక్రవారం 20 వేల రూపాయల నగదును హెచ్ఎం చేబియం శ్రీలతకు అందజేశారు. సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించాలని బతినేని నాగప్రసాద్ రావుని కోరగా స్పందించిన ఆయన విద్యార్థులకు చేయూతని అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రురావత్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి మంచిగా చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఆకాంక్షించారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటినుంచే ఇష్టంతో కష్టపడి మంచిగా చదువుకొని మండల స్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గరికపాటి సోదరులను పరామర్శించిన తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలు గరికపాటి వెంకట్రావు, గరికపాటి ఆంజనేయ ప్రసాద్‌ల తండ్రి రాఘవయ్య గురువారం మృతి చెందారు. మండలంలోని కరుణగిరిలోని రాఘవయ్య ఇంటి వద్ద గరికపాటి సోదరులను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాఘవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి, కారుమంచి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

- ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారిపై కేసులు సరికాదు
- పెరిగే ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలి
- డిసెంబరులో సీపీఐ (ఎం) డివిజన్, జిల్లా మహాసభలు
- సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని రెండు రోజులపాటు సుందరయ్య భవనంలో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై తమ్మినేని మాట్లాడారు. పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, అలాంటి వారి మీద పోలీసులు కేసులు బనాయించటం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్న కార్మికులు అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్నారని, వీరికి 2012 సంవత్సరం నుండి కనీస వేతనాలు సవరించడం లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో కనీస వేతనాల సవరణ కోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచలేదని అన్నారు. ఇప్పటికే 20 జిల్లాల్లో 60 కేంద్రాల్లో సుమారు లక్ష మందికి పైగా ప్రజలు ప్రభుత్వ భూముల్లో గత 3 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, కొన్నిచోట్ల అధికారులు ఈ గుడిసెలను ధ్వంసం చేశారని, అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోవటానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తమ్మినేని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానాల అమలులో భాగంగా ఉపాధిహామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపజేయాలని, రైతు భరోసాను తక్షణమే రైతులందరికీ అమలు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని, ఇందుకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలని కోరారు.

ఎరువుల ధరలు తగ్గించాలి..

సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ యాసంగి సీజన్లో డీఏపీ ధరలు విపరీతంగా పెరగటంతో అన్నదాతలపై భారాలు భారీగా పడనున్నాయని అన్నారు. వాటిని ప్రభుత్వం వెంటనే తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ వాగ్దానం మేరకు పత్తి, మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర వర్తింపజేయాలని, దొడ్డు బియ్యానికి రూ.500 బోనస్ వర్తింపజేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం వల్ల సీనియర్ పాత్రికేయులు నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం అంగీకరించిన వాటితో పాటు సీనియారిటీ ఉన్న ఇతర జర్నలిస్టులకు కూడా ఆయా సొసైటీల ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. డిసెంబర్ నెలలో పార్టీ జిల్లా, డివిజన్ మహాసభలు జరుగుతున్నాయని, డిసెంబర్ 8న ఖమ్మం, మధిర డివిజన్లు, డిసెంబర్ 11న వైరా డివిజన్, 12న పాలేరు డివిజన్ల మహాసభలు, డిసెంబర్ 18, 19న సత్తుపల్లిలో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. పార్టీ శ్రేణులు వీటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, వై. విక్రం లతో పాటు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో రూరల్ విద్యార్థుల హవా

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్



డిసెంబర్ 22న మ్యాథమ్యాటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి మ్యాథమ్యాటిక్స్ టాలెంట్ టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఏదులాపురం ఉన్నత పాఠశాలకు చెందిన సంధ్య, గోళ్లపాడు-పోలేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన జే.సందేశ్ అనే విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల స్థాయిలో పెద్దతండా కేజీబీవీ పాఠశాలకు చెందిన లహరి, లిఖిత అనే విద్యార్థినీలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు డిసెంబర్ 11వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన సందేశ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, ఉపాధ్యాయులు శైలేంద్ర, నాగప్రసాద్, శ్రీదేవి అభినందించారు.

నేడు ఉత్తమ అధికారి ధనలక్ష్మి ఉద్యోగ విరమణ

నవతెలంగాణ-వైరా



ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో ఖమ్మం జిల్లాలో వివిధ స్థాయిలో పని చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గుర్రం ధనలక్ష్మి శనివారం పదవీ విరమణ చేయనున్నారు. వైరా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నాలుగేళ్లుగా హెచ్‌సిఓగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. విజయవాడకు చెందిన ధనలక్ష్మి ఉమ్మడి రాష్ట్రంలో 1983లో అశ్వారావు పేటలో ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. అనంతరం మండల పిహెచ్‌సిల ఏర్పాటుతో దమ్మపేట, మణుగూరులో పని చేస్తూ బదిలీపై 2018లో వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓగా జాయిన్ అయ్యారు. హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్, హెల్త్ సూపర్ వైజర్, పిహెచ్ఎన్ఓ సిహెచ్ఓ బాధ్యతలు నిర్వహించారు. అంతే గాక మండలంలోని విప్పలమడక గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా పని చేస్తూ అందరి మన్ననలు పొందారు. ఈ కాలంలో కోవిడ్ మహమ్మారిపై ఆమె సమరం చేసారు. క్వారంటెయిన్ కేంద్రాలకు పేషంట్లను తరలించేందుకు అవిరళ కృషి చేశారు. ఆమెను నవతెలంగాణ పలుకరించగా ఎక్కడ పనిచేసినా ఎవ్వరినీ తాను నొప్పించలేదని, తనను ఎవ్వరూ నొప్పించలేదనీ, ఏ అధికారి నుండి ఒక్క మేమో అందుకోలేదని ఆమె గర్వంగా చెప్పారు. ఈ జిల్లాలో రాజకీయ ఉద్దండులు ఉన్నారని, వారి అనుగ్రాలే తప్ప ఆగ్రహాలు ఎరుగనని చెప్పారు. శనివారం ఉదయం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో ధనలక్ష్మి ఉద్యోగ, పౌర సన్మానం పొందనున్నారు.

దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

కాలేజీలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు, కాలేజీ సిబ్బంది, దాతల సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు కాలేజీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అవకాశం కల్పించారు .ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ జూనియర్ కాలేజీ విద్యార్థులకు పూర్వ విద్యార్థులు దాతల సహకారతో మిడ్ డే మిల్స్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. దాతల దాతృత్వంతో కొనసాగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తమ సహకారాలు అందించాలన్నారు. 23 వేల రూపాయల విలువ గల సౌండ్ సిస్టంను ప్రవాస భారతీయు రాలు కరుణ శంకర్ రెడ్డి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘ అధ్యక్షురాలు ప్రమీల, నాయకులు బండారు నర సింహారావు, జంగా పుల్లారెడ్డి, శీలం అక్కిరెడ్డి, శీలం వెంక టరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, అధ్యాపకులు రామారావు, తిరుపతిరెడ్డి, రహీం, సర్వేశ్వరరావు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకులాన్ని పరిశీలించిన బీపీ నాయక్

నవతెలంగాణ - బోనకల్



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి పాఠశాల కళాశాలలో శుక్రవారం కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్ మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల కిచెన్, స్టోర్ రూమ్‌లతో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మధ్యాహ్నపు వంటను పరిశీలించి, వంట మనుషులతో మాట్లాడారు. ప్రతిరోజు పాటిస్తున్న శుభ్రత పైన ఆరా తీశారు. అనంతరం పిల్లలందరితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి డిప్యూటీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలను తనిఖీ చేసినట్లు తెలిపారు. గురుకుల విద్యార్థులతో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ పిల్లల తల్లిదండ్రులలో అభద్రతాభావం కలిగించి గందరగోళాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇది మంచి సంప్రదాయం కాదని హితువు పలికారు. విద్యార్థులకు గురుకులాలకు ఉపయోగపడే విధంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ప్రభుత్వం స్టూడెంట్ ఫ్రెండ్లీగా నడుచుకుంటే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత బాగున్నాయని, రక్షిత మంచినీటి విషయంలో కొంతమేరకు మెరుగైన సదుపాయాలు అందించాల్సి ఉందని, ఇదే విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం పిల్లలతో పలు విషయాల మీద చర్చిస్తూ అధైర్య పడకుండా మధ్యాహ్న భోజనం చేయాలని, ప్రశాంతత వాతావరణంలో చదువులు కొనసాగించాలని కోరారు.

ఈలల వేసి.... గోల పెట్టి..!

వనసమారాధనలో స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల అల్లరే అల్లరి

నవతెలంగాణ-ఖమ్మం



ఇద్దరు పిల్లలు ఎవరైనా ఒకచోట చేరితే వారు చేసే అల్లరి అంతా ఇంతకాదు... అలాంటిది ఓ సాముహంగా పిల్లలంతా ఒకచోటకు చేరితే వారు చేసే అల్లరి మాటల్లో చెప్పలేం. కార్తీక మాసం పురస్కరించుకుని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో చెరుకూరి వారి మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనలో పాఠశాల పిల్లలంతా ఓ చోటకు చేరి ఆటలు ఆడుతూ... పాటలు పాడుతూ...ఈలలు వేస్తూ గోల గోల చేశారు. అల్లరి చేయడానికి కాదేది అనర్హం అన్న చందంగా వనమంతా కలియ తిరుగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు రకాల ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్న చిన్నారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కార్యక్రమంలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే ఇవ్వాలి

- ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని, రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో పార్టీ మండల కమిటీ సమావేశం పెరుమళ్ళపల్లి మోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు.ఈ సమావేశంలో నున్నా మాట్లాడారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సంవత్సరం కాలం పూర్తయినా ఇప్పటికీ రుణమాఫీ చేయకపోవడం, రైతు భరోసా విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్ ముగింపునకు వచ్చిన రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం హేయమైన చర్య అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సభ్యులకు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లల్లో ఎటువంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లాలోని ముగ్గురు మంత్రులకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడుతూ ఎర్రజెండాల ప్రభావంతో లగచర్లలో ప్రజా విజయం సాధించినట్లు తెలిపారు. భూసేకరణ ప్రతిపాదన విరమిస్తూ తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం ఎర్రజెండాల విజయమన్నారు. లెఫ్ట్ పార్టీల చర్చల్లోనే సీఎం హామీ ఇచ్చి, శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయడం శుభ పరిణామం అన్నారు. భవిష్యత్తులో ఎర్రజెండాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ సభ్యులు నిరంతరం అధ్యయనం చేయాలని, సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు నందిగామ కృష్ణ, పొన్నెకంటి సంగయ్య, పెండ్యాల సుమతి, తోట పెద్ద వెంకట రెడ్డి, యామిని ఉపేందర్, వడ్లమూడి నాగేశ్వరరావు, చామకూరి రవి, పొన్నం వెంకటరమణ, ప్రసాద్ రావు, ధనియాకుల రామయ్య, మడిపల్లి వెంకన్న, జక్కంపూడి కృష్ణ, రంజాన్, కొండం కరుణాకర్, కే.గురవయ్య, పాపిట్ల సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు, నరేష్, శ్రీను, నాగయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహం (బి) పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వారిచే, ఉచితంగా పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

నేడు ప్రభుత్వ పాఠశాలల బంద్

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన పేరిట ఏర్పడిన రేవంత్ సర్కార్ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై పడగ విప్పి తినే ఆహారంలో కనీస నాణ్యత ప్రమాణాలు చేపట్టకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతుందని, నూతన ప్రభుత్వం ఏర్పడ్డ అనతి కాలంలోనే అనేకమంది విద్యార్థులు మరణించారని, మరెందరో విద్యార్థులు అనారోగ్య పాలయ్యారని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనం విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు క్రాంతి, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ శనివారం తెలంగాణ వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను జయప్రదం చేయాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లింపునకు ప్రభుత్వ ఉత్తర్వులు

తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ హర్షం

నవతెలంగాణ-వైరా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటీరియం రిలీఫ్ (మధ్యంతర భతి) 5% చెల్లించాలని 2-10-2023 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని, కాని ఆ జీఓ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేసే ఉద్యోగులకు ఐఆర్ 5 % అమలు చేయుట సాధ్యం కాదు కనుక ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు కూడా 5% మధ్యంతర భృతి చెల్లించాలని, పలు దఫాలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక సలహా దారులకు చేసిన విజ్ఞప్తుల మేరకు శుక్రవారం జీవో జారీ చేసారని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అండ్ వర్క్ ఇన్స్పెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బొగ్గుల వెంకట రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉద్యోగుల ఐఆర్ 5% ఉత్తర్వుల సాధనకు కృషి చేసిన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామ కిష్టారావుకు జీఓ విడుదలకు నిరంతరం కషి చేసిన కార్పొరేషన్ టీమ్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీపీఏ రద్దు నిర్ణయం ఈ ఏడాది నుండి అమలు చేయవద్దు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, టి.ప్రవీణ్

నవతెలంగాణ- ఖమ్మం

ఈ ఏడాది పదవ తరగతిలో పరీక్షలలో కొన్ని మార్పులు చేస్తూ నిర్ణయం చేసిందని, ఈ నిర్ణయం పబ్లిక్ పరీక్షలు 90 రోజుల ముందు నిర్ణయించడం వలన విద్యార్థులు తీవ్ర గందరగోళం చెందే అవకాశం ఉందని, ప్రభుత్వం పరీక్షల పద్ధతిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా వచ్చే అకాడమిక్ ఇయర్ నుండి నిర్ణయం తీసుకుంటే విద్యార్థులు ఆ రూపంలోనే ప్రిపేర్ కావడానికి అవకాశం ఉంటుందని, విద్యార్థులను పరీక్షల ముందు ఇలాంటి గందరగోళం సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, టి ప్రవీణ్ ఒక ప్రకటనలో కోరారు. మార్కులను తీసుకుని వచ్చి జీపీఏ (గ్రేడ్ పాయింట్ యావరేజ్)ను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఈ మార్పుల వలన విద్యార్థులలో మార్కులలో అసమానతలు పెరిగే అవకాశం ఉంటుందని, మార్కుల వేటలో విద్యార్థులు పోటీపడి మార్కులు, ర్యాంకుల కోసం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల చుట్టూ విద్యార్థులు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా ఈ మార్కుల వేటలో నష్టపోయే అవకాశం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రస్తుతం నడుస్తున్న విధానంలోనే పరీక్షలు నిర్వహించి వచ్చే అకాడమిక్ నుండి పరీక్ష విధానంలో మార్పులు తీసుకుని రావాలని డిమాండ్ చేశారు.

పోటు ప్రసాద్ అజరామరుడు

- ఎర్ర జెండాకు వన్నెతెచ్చిన చైతన్య స్ఫూర్తి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ- ఖమ్మం





త్యాగాలకు చిరునామాగా, పోరాటాలకు బాసటగా ఉద్యమ పదాన చిరస్థాయిగా నిలిచిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అజరామరుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎర్ర జెండా ఉన్నంత కాలం పోరాడే వారి ప్రతి గుండెల్లోనూ పోటు ప్రసాద్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆయన తెలిపారు. బుధవారం మరణించిన పోటు ప్రసాద్ సంతాప సభ శుక్రవారం ఖమ్మంలోని సిపిఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈసభలో తమ్మినేని మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి నిన్న మొన్నటి వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా వ్యవహరించిన పోటు ప్రసాద్ జీవితాన్ని పరిశీలిస్తే ఆయన ఒక సంపూర్ణ మానవుడని, అన్నింటికి మించి సంపూర్ణ కమ్యూనిస్టు అని అన్నారు. కష్ట కాలంలో కమ్యూనిస్టుకు దన్నుగా నిలిచి ఉద్యమ వ్యాప్తికి కృషి చేసిన వ్యక్తులలో పోటు ప్రసాద్ ఒకరన్నారు. కమ్యూనిస్టులు బలహీనపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లోనే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందన్నారు. ఒక పక్క బలహీనపడుతూ మరో పక్క అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ప్రసాద్ లాంటి వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. కమ్యూనిస్టుల ఎజెండా లేని దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకమే అవుతుందని ఆయన తెలిపారు. సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన గొప్ప మానవతా వాది పోటు ప్రసాద్ అని ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. కూనంనేని మాట్లాడుతూ అసలైన కమ్యూనిస్టుకు పర్యాయ పదంగా పోటు ప్రసాద్ నిలిచారని, కమ్యూనిస్టు ఎలా ఉండాలో, ఎలా పనిచేయాలో ప్రసాద్ అలా పనిచేశారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం నిస్తేజంలో ఉన్నప్పుడు ఒక స్ఫూర్తిని రగిల్చిన అమరుడు ప్రసాద్ అన్నారు. చాలా మంది కమ్యూనిస్టుగా జీవించాలని ఆశపడేలా, తాపత్రయపడేలా ప్రసాద్ జీవితం సాగిందని కూనంనేని తెలిపారు. ఇబ్బందులకు ఎదురెళ్లడమే ఆ కుటుంబానికి తెలుసని ఒక సంపన్న కుటుంబంలో జన్మించి పేదల కోసం అష్ట కష్టాలు పడిన ఒక త్యాగమయ కుటుంబం పోటు ప్రసాద్ దన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉద్యమంపై అవగాహన కలిగిన పోటు ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ సారధ్య బాధ్యతలు తీసుకున్నప్పుడు తామెంతో గర్వపడ్డామని సంతోషంతో ఇక కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతం తథ్యమనుకుంటున్న సమయంలో ఆయన మరణం అత్యంత బాధాకరమన్నారు. ప్రసాద్‌ను మననం చేసుకుంటూ అజయ్‌కుమార్ వేదికపైనే బోరున విలపించారు. పోటు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని, ఉద్యమానికి తమ నిరంతర సహకారం కొనసాగుతుందని అజయ్‌కుమార్ తెలిపారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోటు ప్రసాద్‌తో తన అనుబంధం మరువలేనిదని అన్నారు. నీటి పారుదల, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ పోటు ప్రసాద్ అత్యంత నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని, కడ వరకు సత్యశీలతతో జీవించారని తెలిపారు.

ఈ సంతాప సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. బాలమల్లేష్, కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, సిపిఐ సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలానా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టిడిపి జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎంఎల్ పార్టీ నాయకులు విజయ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కో సాబీర్పాషా, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, పలు జిల్లాల కార్యదర్శులు, కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య ప్రసాద్ అంతిమ యాత్ర

పోటు ప్రసాద్‌కు కడపటి వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి కమ్యూనిస్టు శ్రేణులు, వామపక్ష అభిమానులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు కదిలొచ్చారు. అమర్ హై పోటు ప్రసాద్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రతి హృదయం బరువెక్కింది. పోటు ప్రసాద్‌తో తమకున్న అనుబంధాన్ని లోలోపలే గుర్తు చేసుకుంటూ కళ్లు చెమరుస్తుంటే అరుణ పతాకం చేబూని అడుగులేశారు. బుధవారం మరణించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అంతిమ యాత్ర శుక్రవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రారంభమైంది. ప్రజల సందర్శనార్థం పార్థివ దేహన్ని పార్టీ కార్యాలయానికి తరలించిన నేతలు సంతాప సభ అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. పోటు ప్రసాద్ (64) సంవత్సరాల వయస్సుకు సంకేతంగా 64 అరుణపతాకాలను చేబూనిన యువ దళం ముందు నడవగా ఆ తర్వాత డప్పు దళం, పార్టీ నాయకత్వం, కుటుంబ సభ్యులు ర్యాలీగా కదిలారు. బైపాస్ రోడ్డు, ఆర్టీవో కార్యాలయం, గట్టయ్య సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, ఐటి హబ్ సెంటర్, మమత రోడ్డు మీదుగా ర్యాలీ మమత మెడికల్ కళాశాలకు చేరుకుంది. దారి పొడవునా జనం ప్రసాద్‌కు నివాళులర్పించారు. ప్రసాద్ కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన పార్థివదేహన్ని మమత మెడికల్ కళాశాలకు అప్పగించారు. మమత సంస్థలకు అంకురార్పణ చేసిన వారిలో పోటు ప్రసాద్ ఒకరని పోటు ప్రసాద్, పువ్వాడ ఉదయ్ కుమార్ బంధాన్ని జయశ్రీ గుర్తు చేసుకున్నారు. ఉదయ్, ప్రసాద్ అనుబంధాలకు గుర్తుగా ఉదయ్ చిత్ర పటం సాక్షిగా ప్రసాద్ పార్థివ దేహన్ని వైద్య విద్యార్థుల పరీక్షల కొరకు అప్పగించారు. అంతిమ యాత్రలో ప్రసాద్ కుమారుడు సాత్విక్, తల్లి సక్కుబాయి, సతీమణి నిర్మల, సోదరి, సోదరులతో పాటు పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జలగం ప్రసాద్ అనుచరుడు తాళ్ల రామకోటి మృతి

- ఏఎంసీ చైర్మెన్ పసుమర్తి చంద్రరావు నివాళి

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండలం పాత యర్రబోయినపల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలగం ప్రసాద్ అనుచరుడు తాళ్ళ చిన రామ కోటి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్లూరు ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజ చౌదరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, ఏనుగు సత్యంబాబు సందర్శించి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ దొడ్డపనేని శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ బండి శ్రీనివాస రావు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు ఆలకుంట నరసింహారావు, కిలారు రామారావు, తక్కెళ్ళపాటి దుర్గాప్రసాద్, మూకర విజయరావు, నల్లగట్ల పుల్లయ్య, తాళ్ళ వెంకటేశ్వర్లు, తాళ్ల కృష్ణ, మహిళా నాయకురాలు గూడా జ్యోతి, గ్రామ నాయకుడు పోట్రూ శ్రీనివాసరావు, బత్తుల రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా 'గార్లపాటి'

ప్రధాన కార్యదర్శిగా 'రామకృష్ణ'



నవతెలంగాణ - బోనకల్

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గార్లపాటి చిన్న రంగారావు, మండల ప్రధాన కార్యదర్శిగా రావినూతల గ్రామ నివాసి గుగులోతు రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎస్ యుటిఎఫ్ మండల మహాసభ శుక్రవారం స్థానిక సాయిబాబా కళ్యాణమండపంలో జరిగింది. ఉపాధ్యక్షులుగా సౌభాగ్య లక్ష్మి, పి.గోపాలరావు కార్యదర్శులుగా కే.నిర్మలా కుమారి, వి.రామారావు, ఏ.నాగేంద్ర, ఎం. నారాయణ, ఎస్ వెంకటేశ్వర్లు, సిహెచ్ కోటేశ్వరరావు, పాలకుర్తి రాణి కోశాధికారిగా జెల్లా కోటయ్య, ఆడిట్ కన్వీనర్‌గా పి.నరసింహారావు ఎన్నికయ్యారు.



వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు, అధికారులు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మెన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలన్నారు. రానున్న కాలంలో పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు పాలకవర్గ సభ్యులు, అధికారులు సహకరించాలన్నారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కు జిల్లా వ్యాప్తంగా మంచి పేరు తెచ్చేలా, ప్రత్యేక గుర్తింపును సాధించేలా మంత్రి పేరు నిలబెట్టేలా ప్రతి ఒక్కరు వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి నరేష్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వి నాగేశ్వరి, ఎంపీడీవో ఎం ఎర్రయ్య కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) భూక్య సరిత, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) ఎం రాధ, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్తపై భార్య కత్తితో దాడి


వేధింపులే కారణం



నవతెలంగాణ-వైరా

మండలంలోని గొల్లపూడి గ్రామంలో శుక్రవారం ఉదయం తాగుబోతు భర్త వేధింపులు భరించలేక భార్య కత్తితో దాడిచేసి గాయపరిచింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపూడి గ్రామానికి చెందిన పొరల రవి విద్యావంతుడై ఉండి కూడా తాగుడుకు బానిసయ్యాడు. గత సంవత్సరం వరకు విద్యా శాఖలో రెబ్బవరం క్లస్టర్ సీఆర్పీగా పని చేశాడు. నిత్యం మద్యం సేవించి డ్యూటీకి రావటంతో అధికారులు రవిని విధుల నుండి తొలగించారు. కాని అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. కొంత కాలమైనా తాగుడు మాన్పించేందుకు ఇటీవల అయ్యప్ప మాల వేయించారు. కొద్ది రోజుల క్రితం రవి ఇంటి పేరిట బంధువు చనిపోగా రవి అయ్యప్ప మాల తొలగించుకున్నాడు. ఆ రోజు నుండి యథావిధిగా తాగుతూ భార్య లక్ష్మిని అనుమానిస్తూ, కొడుతూ వేధిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బాగా తాగిన రవి భార్యపై దాడి చేసి కొట్టాడు. దాడిని తట్టుకోలేని లక్ష్మి వంట గదిలో ఉన్న కత్తితో భర్త రవిని పొడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు గొల్లపూడి చేరుకుని లక్ష్మిని అదుపులోకి తీసుకుని గాయపడిన రవిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి కూడా విద్యావంతురాలై వైరాలో ఒక ప్రయివేటు స్కూల్లో పని చేస్తుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్ ప్రమాదంలో గాయపడ్డ మహిళ



నవతెలంగాణ - బోనకల్

ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఓ మహిళ స్వల్పంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వైరా పట్టణానికి చెందిన దోకుపర్తి నరసింహారావు, అంజలి దంపతులు మండల పరిధిలోని ముష్టికుంట గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం బోనకల్లు వచ్చారు. బోనకల్లులో ముష్టికుంట్ల వెళ్లేందుకు ఖమ్మం ఆర్టీసీ బస్సు అంజలి ఎక్కుతుంది. ఇదే సమయంలో డ్రైవర్ అకస్మాత్తుగా బస్సుని కదిలించాడు. దీంతో అంజలి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయింది. దీంతో తలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే భర్త, ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే ఆమె వెనువెంటనే అనేకసార్లు వాంతులు చేసుకుంది. మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి ప్రాథమిక చికిత్స చేశారు. ప్రాణానికి ఎటువంటి ప్రమాదం లేదని చెప్పడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత భర్త ఆమెను ఓ ప్రయివేటు వాహనంలో ఖమ్మం తీసుకెళ్లాడు. అయితే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపినట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు 'విన్ ఫీల్డ్' విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-10 విభాగంలో లాంగ్ జంప్‌లో విన్ ఫీల్డ్ స్కూల్లో 4వ తరగతి చదువుతున్న పూనాటి అలోక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్ కుమార్, పోలవరపు శ్రీ కాంత్ తెలిపారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలో వెళ్లనుంది. 'అలోకును పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

- ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతున్న ఏకైక వ్యక్తి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- ప్రభుత్వాలు మారిన సమస్యల పరిష్కారం కావడం లేదు
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోదా వెంకట నాగమల్లేశ్వరరావు

నవతెలంగాణ-బోనకల్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, నూతన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన తర్వాత కూడా విద్యార్థుల సంఖ్య తగ్గటం బాధాకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోదా వెంకట నాగమల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభ ఆ సంఘం మండల అధ్యక్షుడు భూపతి ప్రీతం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఆ సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు జెల్లా సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో గోదా వెంకట నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగానే బలోపేతం చేసి, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందిస్తామని పదే పదే చెబుతుందన్నారు. కానీ ఉపాధ్యాయులు దీర్ఘకాలకంగా ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పరిష్కారం చేయడం లేదన్నారు. డిసెంబర్ 14, 15 తేదీలలో జిల్లా మహాసభలు సత్తుపల్లిలో జరగనున్నాయని, ఈ మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధన చేస్తున్న తల్లిదండ్రులు మాత్రం ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపించడం బాధాకరమన్నారు. ఒకవైపు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాలు పోరాటం చేస్తుంటే, యుపిఎస్ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణం అన్నారు. నేషనల్ 2020 విద్యా విధానాన్ని టీఎస్ యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ విద్యా విధానము వలన ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొంత సానుకూలకంగా ఉందన్నారు. కెసిఆర్ ఉపాధ్యాయ సంఘాలతో ఏనాడు చర్చలు జరపలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడంగానే ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపిందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చట్ట విరుద్ధమని హైకోర్టు కొట్టివేయటాన్ని టిఎస్ యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఉపాధ్యాయులపై పని భారం పెరుగుతుందని, దీనివలన



విద్యా బోధనపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నలుగురు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఉంటే కేవలం అలుగుబెల్లి నర్సిరెడ్డి మాత్రమే ఉపాధ్యాయ సమస్యలపై శాసన మండలిలో, ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేరుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో అలుగుబెల్లి నర్సిరెడ్డి అనేక దపాలు చర్చలు జరిపి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. మరోసారి నర్సిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడు పై ఉందన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన విషయంపై ప్రతి ఉపాధ్యాయుడు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక స్పృహ కలిగి ఉండాలి: ఎంఈఓ దామాల పుల్లయ్య

ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక స్పృహ కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య అన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధన ద్వారా విద్యార్థులకు భవిష్యత్తు బాట వేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యం పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సబ్జెక్ట్ ఆధారంగా విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థుల స్థాయిని గుర్తించి అందుకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని కోరారు. కార్యదర్శి నివేదికను మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ ప్రవేశపెట్టారు.

ఈ మహాసభలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, సీనియర్ నాయకులు సద్దా బాబు, కూచిపూడి లక్ష్మణరావు, రఘునాథపాలెం మండల ప్రధాన కార్యదర్శి జి.సత్రం, మధిర మండల నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరుకు సాగు రైతులకు
రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలి

- పంట టన్నుకు నాలుగు వేల రూపాయల ధర ఇవ్వాలి
- తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు
- చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో మధుకన్ షుగర్స్ జనరల్ మేనేజర్ కి వినతి

నవతెలంగాణ-నేలకొండపల్లి

చెరుకు సాగు రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని, టన్ను చెరుకుకు 4 వేల రూపాయలు ధర ఇవ్వాలని తెలంగాణ చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చ నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ చెరుకు రైతు సంఘం ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని మధుకాన్ షుగర్స్ జనరల్ మేనేజర్ కోటయ్యకు చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చెరకు పంట దిగుబడి తగ్గిపోయిందని, మరోవైపు రికవరీ శాతం కూడా తగ్గడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫ్యాక్టరీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెరకు ఫ్యాక్టరీకి తరలించిన 14 రోజుల్లో బిల్లులను పూర్తిగా రైతుల అకౌంట్ కు జమ చేయాలని, 30 టన్నులు కటింగ్ పర్మిట్ ఎత్తేయాలని కోరారు. ప్రస్తుతం పెరిగిన చెరకు సాగు పెట్టుబడుల నేపథ్యంలో ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు. ఫలితంగా ప్రతి ఏటా రైతు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వం చెరుకు రైతులకు టన్నుకు 350 రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా బోనస్ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టన్ను చెరుకుకు 4వేల రూపాయల చొప్పున కొనుగోలు చేయిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎఫ్ఆర్పి టన్ను ధర రూ.3400కి రాష్ట్ర ప్రభుత్వం రూ.600 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. యాంత్రీకరణ సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. స్పందించిన మధుకాన్ షుగర్స్ జనరల్ మేనేజర్ కోటయ్య మాట్లాడుతూ మధుకన్ షుగర్స్ యాజమాన్యం ఇప్పటికే కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించారని, యాజమాన్యంతో చర్చించి చెరుకు రైతు సంఘం ప్రతిపాదించిన డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తోటకూరి రాజశేఖర్ (రాజు), ఇంటూరి అశోక్ రాసాల కనకయ్య, యనమద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మహాసభలకు సహకరించండి

- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి
- మండలంలో విస్తృత ప్రచారం

నవతెలంగాణ-వేంసూరు

డిసెంబర్ 22న సత్తుపల్లిలో జరగనున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలకు కార్మికులు, కర్షకులు, వివిధ సంఘాల నాయకులు సహకరించి జయప్రదం చేయాలని సత్తుపల్లి సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో హమాలీలు ఆటో వివిధ సంఘాల నాయకులను కలిశారు. 28 సంవత్సరాల తర్వాత సత్తుపల్లిలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న జిల్లా మహాసభలకు ఇప్పటికే ఆహ్వాన సంఘంతో పాటు ముఖ్య అతిథులు ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు కమిటీ సభ్యులను నియమించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్రావు, మండల కమిటీ సభ్యులు మోరంపూడి వెంకటేశ్వరరావు, మల్లూరి చంద్రశేఖర్, వెలిగినేని రామారావు, రైతు సంఘం నాయకులు కొత్త సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

గణిత ప్రతిభా పాటవ పరీక్ష విజయవంతం

నవతెలంగాణ-కల్లూరు



మండల స్థాయి గణిత ప్రతిభ పాటవ పరీక్ష విజయవంతంగా ముగిసింది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష నిర్వహించగా ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 18 మంది, తెలుగు మీడియం విద్యార్థులు 12 మంది, రెసిడెన్షియల్ నుండి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 30 మార్కులకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష రాసిన వారిలో ప్రథమ స్థానం మల్లె మనిషా ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరు, ద్వితీయ స్థానం ఎం.దివ్యశ్రీ, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, తెలుగు మీడియం నుండి ఎం.లావణ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రబోయినపల్లి, ద్వితీయ స్థానం ఎం. జోష్ణ జెడ్పీఎస్ఎస్ చుంద్రుపట్ల, రెసిడెన్షియల్ పాఠశాల నుండి ప్రథమ స్థానం వై.అశ్విత, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కల్లూరు ద్వితీయ స్థానం బి. హిందు ఆశ్రమ హైస్కూల్ కల్లూరు. మండలం గణిత ఉపాధ్యాయులు అందరూ కలిసి మండల స్థాయి పోటీలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు కొర్లగూడెం ఉపాధ్యాయులు బహుమతులు అందించగా ఎంఈఓ పత్తిపాటి నివేదత విద్యార్థులకు అందజేశారు. ఈ పోటీల నిర్వహణ బాధ్యతను కన్వీనర్ కృష్ణారావు, ఎండి మౌలాలి, ఏ.అమర్లపూడి చక్రవర్తి, అలాగే కల్లూరు మండల మ్యాథ్స్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఈ పోటీలో నిర్వహించడానికి పూర్తి సహాయ సహకారాలు అందించారు. వేముల శ్రీనివాస్, అలెగ్జాండర్ బీమా, వీర రాఘవయ్య పరీక్షలను సజావుగా నిర్వహించారు.

1న రజకుల వనసమారాధన

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని చెరుకూరి వారి మామిడి తోటలో డిసెంబరు 1న రజకుల వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని రజకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సర్కారుపై యుద్ధానికి సన్నద్ధం

- కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ శీలం
- కౌలుదార్లను ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదు
- సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల రాజబాబు
- డిసెంబరు 4న చలో హైదరాబాద్‌పై సమీక్ష

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రభుత్వంపై ఉద్యమించేందుకు కౌలురైతులంతా సన్నద్ధమవుతున్నారని కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ శీలం సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య (ప్రజాసంఘాల కార్యాలయం) భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో సత్యనారాయణరెడ్డి ప్రసంగించారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యం ఉండాలన్నారు. డిసెంబరు 4న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద భారీఎత్తున కౌలురైతులతో ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో కౌలురైతులు పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సత్యనారాయణరెడ్డి కోరారు. కౌలురైతుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల రాజబాబు మాట్లాడుతూ కౌలురైతులను ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదన్నారు. కులగణనపై ఉన్నంత శ్రద్ధ కౌలురైతులపై ఎందుకు చూపడం లేదని రాజబాబు విమర్శించారు. పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు రూ. 5లక్షలు పరిహారం ఎలా



ఇస్తున్నారో అదే విధంగా కౌలురైతులకు కూడా పరిహారం అందించాలని రాజబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, ఐద్వా నాయకురాళ్లు పాకలపాటి ఝాన్సీ, చెరుకు రత్నకుమారి, చావ రమేశ్ పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట బాధితుల ధర్నా

తమకు రావాల్సిన రూ.2.20 కోట్లు ఇవ్వట్లేదని నిరసన

నవతెలంగాణ-ఖమ్మం

తమకు రావాల్సిన రెండు కోట్ల 20 లక్షల రూపాయలను రెండు సంవత్సరాలు అయినా చెల్లించకపోవడంతో బాధిత కుటుంబం వడ్డీ వ్యాపారి అయినా చెరుకూరి శ్రీధర్ ఇంటి ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో నివాసముంటున్న వడ్డీ వ్యాపారి అయినా చెరుకూరి శ్రీధర్ దంపతులకు రెండు సంవత్సరాల క్రితం తేజావతి కళ్యాణి, పరుచూరి కృష్ణమోహన్ దంపతులు వడ్డీకి రెండు కోట్ల 20 లక్షల రూపాయలు ఇచ్చారు. వడ్డీ ఇచ్చే సమయంలో నోటు మీద రాయించి చెక్కులు కూడా తీసుకున్నారు. రెండు సంవత్సరాలు అయివున్న కూడా ఇప్పటివరకు వడ్డీ ఇవ్వలేదన్నారు. తమ అప్పుగా ఇచ్చిన రెండు కోట్ల 20 లక్షల రూపాయలను కూడా ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని వాపోయారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని చెబుతున్నాడని వాపోతున్నారు. ఎస్టీ మహిళ అయినా తనను కులం పేరుతో తిడుతూ ఒక్క రూపాయి కూడా ఇవ్వను అని బూతులు తిడుతున్నాడని బాధితురాలు ఆరోపించారు. తమకు రావాల్సిన రెండు కోట్ల 20 లక్షల రూపాయలు ఇచ్చేవరకు ఇక్కడే కూర్చొని నిరసన వ్యక్తం చేస్తామని, డబ్బులు ఇవ్వని సందర్భంలో కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీ చైతన్య విద్యార్థుల 'సేఫ్ ఇండియా' కార్యక్రమం

నవతెలంగాణ-పాల్వంచ



పట్టణ పరిధి కాంట్రాక్టర్స్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం ట్రాఫిక్ అవగాహనకు సేఫ్ ఇండియా టాపిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ఎస్సై సుమన్ హాజరై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి వాహనదారులను చైతన్య పరిచే విధంగా ట్రాఫిక్ రూల్స్, హెల్మెంట్ ధరించాలని ర్యాలీ నిర్వహించి హెల్మెట్ ధరించని వారికి పుష్పాలు ఇచ్చి వారి బాధ్యతని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమ్య, డీన్ మధు, సి.ఇంచార్జ్ నాగబాబు, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా సివిల్ సప్లై అధికారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని నరసాపురం గ్రామంలో గల సూదిరెడ్డి నాగిరెడ్డి ఆది లక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా సివిల్ సప్లై అధికారి రుక్మిణి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం నిల్వలను, భోజన శాల, విద్యార్థులకు ఉపయోగిస్తున్న మంచినీటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సివిల్ సప్లై ఇన్స్‌ఫెక్టర్ జి.రాజులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ రత్నకుమారి, చిలకమర్తి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ కెజియ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించండి

నవతెలంగాణ-టేకులపల్లి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలలోని ఎస్‌జిటిలకు కూడా ఓటు హక్కును కల్పించాలని టీటీఎఫ్ టేకులపల్లి మండల నాయకులు బి.పుల్సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులతో, సమానమైన అర్హతలు కలిగి, ఉన్న ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు లేకపోవడం వలన, ప్రాథమిక పాఠశాలల సమస్యలు, మండలిలో చర్చించే అవకాశం లేకుండాపోయిందని తెలిపారు. క్రింద స్థాయిలో విద్య ప్రమాణాలు, విద్య బోధన నాణ్యమైన విద్య పిల్లలకు అందిస్తున్న, ప్రాథమిక పాఠశాలల సమస్యలు కనీసం చర్చకు తీసుకోరాలేకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ విధానం లేకపోవడం వల్లన్నే ప్రాథమికొన్నత పాఠశాలలు కనుమరుగయినాయి కాబట్టి వచ్చే మండలి ఎన్నికలలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటు హక్కును ప్రాథమిక పాఠశాలల ఎస్‌జిటిలకు కల్పించాలని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూళనకై ఒక్కరోజు శిక్షణ

నవతెలంగాణ-టేకులపల్లి



జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 2నుండి 15కు వరకు జరిగే కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం పై వైద్య సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్‌లో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్యా, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, కౌసల్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్దీపకం'ను సద్వినియోగించుకోండి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



జిపిఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఐటిడి ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ ప్రత్యేకంగా తయారు చేసిన 'ఉద్దీపకము' పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య అన్నారు. శుక్రవారం ముసలిమడుగు జిపిఎస్ పాఠశాల విద్యార్థులకు ప్రాజెక్టు అధికారిచే ప్రత్యేకంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల కొరకు రూపొందించబడిన "ఉద్దీపకము" పాఠ్యపుస్తకాలను సున్నం సమ్మయ్య చేతుల మీదుగా అందజేశారు. గిరిజన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమైన ఉద్దీపకము పుస్తకాలు తయారుచేసిన ఐటిడిఎ పిఓను అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్ణశాల జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంచార్జ్ ప్రభాకర్, జిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



రూ.30 లక్షల రోటరీ నిధులతో రెడ్డిపాలెం ఊరచెరువు అభివృద్ధి

- రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో గల ఊర చెరువు అభివృద్ధి చేసేందుకు రూ.30 లక్షల రోటరీ నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళి కను రూపొందించినట్టు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బూర్గంపాడు తహశీల్దార్ ముజాహిద్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నాగినేనిప్రోలురెడ్డి పాలెం ఊర చెరువును శుక్రవారం పరిశీలించి, జాయింట్ సర్వే చేశారు. 30 లక్షల రూపాయల పూర్తి రోటరీ నిధులతో నాగినేని ప్రోలురెడ్డిపాలెం గ్రామంలోని ఊరచెరువును అభివృద్ధి పరిచేందుకు వివిధ రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్బుల నుండి, రోటరీ ఫౌండేషన్ నుండి నిధులు సమకూర్చుకోవడం జరిగిందని బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువుకు మూడు వైపులా కట్టను పెంచి ప్రస్తుతం సాగు చేసుకుంటున్న రైతులకు ఆయకట్టు పెంచడం, మినీ ట్యాంక్ బండ్‌ను తలపిస్తూ సుందరీ కరణ చేయడం ద్వారా "ఊర చెరువు"ను అభివృద్ధి పరుచదలచుకున్నామని అన్నారు. అభివృద్ధి పనులకు అంతరాయం కల గకుండా ప్రభుత్వ సహకారం అందించాలని, రోటరీ ఫౌండేషన్ నుండి నిధులు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఊరచెరువు 13 ఎకరాల30 కుంటల ల్యాండ్ పూర్తిగా గవర్నమెంట్ ల్యాండ్ రెవిన్యూ డిపార్ట్మెంట్ గాని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ గాని అభ్యంతరం లేదని తహశీల్దార్ ముజాహిద్ ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి గ్రామ సభ ద్వారా తీర్మానం చేసి పనులు మొదలు పెట్టుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం అయింది

చండ్రుగొండ : కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని బిఆర్ఎస్ మండల నాయకులు, ఉద్యమకారుల సంఘం స్పష్టం చేసింది. శుక్రవారం చండ్రుగొండ మండలం నుండి బిఆర్ఎస్ మండల కమిటి, ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో జరిగే దీక్షదీవసు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకత్వం, కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ ఏర్పాటు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కమిటి, ఉద్యమకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఓ వ్యక్తి అదృశ్యంపై దుమ్ముగూడెం పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై వెంకటప్పయ్య తెలిపిన వివరాల ప్రకారం... ముసలిమడుగు గ్రామానికి చెందిన బాడిస సోమయ్య(53) మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో గత సంవత్సర కాలంగా ఇంటి నుండి బయటకు వెళ్తూ మరల తిరిగి ఇంటికి వచ్చేవాడు. అదే క్రమంలో ఈనెల 23వ తేదీన ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి నేటికీ తిరిగి రాలేదు. సుమారు నాలుగున్నర అడుగులు ఎత్తు, నలుపు రంగులో ఉండే సోమయ్య ఇంటి నుండి బయటకు వెళ్లే సమయంలో నీలం రంగు ఆఫ్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు నిక్కరు ధరిచి ఉన్నాడు. సోమయ్య సోదరి కుర్సం ఆదెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోమయ్య ఆచూకీ తెలిసినవారు ఆయన సోదరి ఫోన్ 7702184624 నెంబర్‌కు లేదా దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు.

మన బలం మనం నమ్మిన సిద్ధాంతాలే

- అమలుకాని హామీలిచ్చిన కాంగ్రెస్
- ప్రభుత్వంపై ప్రతిపక్ష హోదాలో పోరాటానికి సిద్ధం
- పార్టీ కష్టాలలో ఉన్నప్పుడు నిలబడే వాడే నిజమైన కమ్యూనిస్టు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- పార్టీ మండల నూతన కార్యదర్శిగా రమేష్

నవతెలంగాణ-సుజాతనగర్



కమ్యూనిస్టుల బలం వారు నమ్మిన సిద్ధాంతాలే అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం మండల మూడో మహాసభ వేపల గడ్డ గ్రామంలో వీర్ల రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. మొదట ప్రధాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని అన్నారు. కష్టాలలో పార్టీ ఉన్నప్పుడు నిలబడే వాడే నిజమైన కమ్యూనిస్టు అని అన్నారు. స్త్రీ, పురుషులను ఆర్థిక అసమానతలను ఒకే విధంగా చూడటం ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు దేశాలలో తప్ప ఎక్కడ లేదని అన్నారు. బీజేపీ లాంటి మతోన్మాద పార్టీలను వెనుకకు నెట్టే ఆత్మవిశ్వాసం కమ్యూనిస్టులకు వచ్చిందని ప్రభుత్వ సంపదలను కార్పొరేట్ కంపెనీలైన అదాని, అంబానీలకి దోచిపెడుతూ అహంకారం, నియంత పాలన కొనసాగిస్తూ స్వతంత్ర దర్యాప్తు సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షం లేకుండా చేస్తున్నదని అన్నారు. చేతకాని, అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చినంక ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. చట్టాలకు వ్యతిరేకంగా మూసీ ప్రక్షాళన హైడ్రా పేరుతో ఇళ్ళ కూల్చివేతలు, దామగుండం అడవులలో 3వేల ఎకరాలలో 12 లక్షల చెట్లను తొలగించటం ప్రజా పాలనకు వ్యతిరేకమని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలలో అసంతృప్తి మొదలైందని అన్నారు. రాబోయే కాలంలో ప్రభుత్వంపై ప్రతిపక్ష హోదాలో పోరాటానికి సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, లిక్కీ బాలరాజు, కున్సోత్ ధర్మ, కాట్రాల తిరుపతిరావు, బచ్చలకూర శ్రీను, బానోత్ కుమారి, మద్దెల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా వీర్ల రమేష్



వేపల గడ్డ గ్రామంలో జరిగిన మండల మహాసభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా వీర్ల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు 22 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో మండల పరిధిలో జూనియర్ కాలేజ్, 30 పడకుల ఆసుపత్రికి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. గతంలో సిపిఎం పోరాట ఫలితంగా రాఘవపురం, సీతంపేట, సింగభూపాలెం గ్రామాలలో 300 మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు పార్టీకి ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే కాలంలో పేదల పక్షాన పోరాడుతానని తెలిపారు.

అత్యంత పేదలకే 'డబల్ బెడ్ రూమ్' అందాలి

- కలెక్టర్ జితేష్ వీ.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



పేదలలో అత్యంత నిరుపేదలకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ మంజూరు అవ్వాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక, సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ, జిల్లాలో నెలకొన్న భూ సమస్యలపై ఆర్డీవోలు, జిల్లా అధికారులు, జిల్లాలోని తహసీల్దారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, అశ్వారావుపేట, చర్ల మండలాల్లో డేటా ఎంట్రీ పురోగతిపై అసహనం వ్యక్తం చేశారు. కరకగూడెం, చర్ల మండలాలు ఆరు మూల ప్రాంతాల్లో ఉండటం, విద్యుత్ అంతరాయం, నెట్వర్క్ సమస్య, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కొరత ఉన్నందువలన బూర్గంపాడు మండలం డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కరకగూడెం, చర్ల మండలం డేటా ఎంట్రీ ప్రక్రియను చేపట్టాలని, భద్రాచలం ఆర్డీవోని పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. జిల్లాలో పూర్తి అయిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు లబ్ధిదారులు ఎంపికకు తహసీల్దారులు అందరూ క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలలో పర్యటించి పేదలలో అత్యంత పేద వాళ్లకు మాత్రమే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలతో జీవనం సాగిస్తున్న ఒంటరి మహిళలు, వితంతువులు, గుడిసెలలో జీవనం సాగిస్తున్న వారిని గుర్తించాలన్నారు. తహసీల్దారులందరూ ఈరోజు తమ పరిధిలోడికి వచ్చిన దరఖాస్తులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి, పేదవారిని గుర్తించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. తహసీల్దారులు గుర్తించిన పేదవారిని ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో విచారించి తుది జాబితా సిద్ధం చేయాలని కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు, ఉద్యోగస్తులు ఎటువంటి పైరవీలు లేదా అవకతవకలకు పాల్పడిన ఉపేక్షించేది లేదు అని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా గిరిజనేతరులకి విభజన పేరుతో పట్టా మార్పు లేదా భూమి అమ్మకానికి అధికారులు సహాయం చేస్తే వారిని సస్పెండ్ చేయడంతో పాటు వారి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

'జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి'

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి వ్యాప్తంగా నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు సెంట్రల్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఐఎఫ్‌టియు అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డి. నాసర్ పాషా సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం సాయంత్రం పివి కాలనీ సింగరేణి నర్సరీలో పనిచేస్తున్న నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులతో పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్న అనంతరం వారితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులు ఏ. ఇందిర, ఆర్. రేణుక, బి.లక్ష్మి, ఎం.దేవి, ఈ.రాజేశ్వరి, పీ.వెంకటమ్మ, ఎస్‌కె. షాహీన్, బి.కుమారి, ఆర్.సాంబయ్య, కవిత, త్రివేణి, మణెమ్మ, యాదమణి, మల్లమ్మ, రాజకుమారి, శ్రీదేవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిసి ప్రదం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో 18 నుండి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చు అన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యా అర్హత సర్టిఫికెట్లతోపాటు ఆధార్, కుల ధృవీకరణ జిరాక్స్ పత్రాలు, 4 పాస్ ఫోటో సైజ్ ఫోటోలు తమ వెంట తీసుకురావాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. మణుగూరు డివిజన్ సింగరేణి కాలరీస్ కంపెనీలో రైల్వే లైన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికులు మాట్లాడారు. సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ లేబర్ యూనియన్ ఐఎన్‌టియుసి మణుగూరు ప్రెసిడెంట్ మాట్లాడుతూ కార్మికులకు ఐ పవర్ కమిటీ వేతనాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ కె. వీర్రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సాంబ, నాయకులు వి.శంకర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రకు పేటిక బహూకరణ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మనిషి జీవం విడిచి వెళ్ళిన రోజు అంతిమ యాత్రలో కూడా దూర ప్రాంతాల నుండి వచ్చే బాధువులు కోసం మృతదేహాన్ని ఉంచేందుకు సామాన్య ప్రజలు ఎంతో కష్టపడుతూ పల్లెల నుండి పట్టణాలకు వెళ్లి ఫ్రీజర్ బాక్స్(సేవపేటిక) కోసం అనేక సమస్యలు ఎదుర్కోవడంలో మండల పరిధిలోని యర్రగుంట గ్రామానికి మల్లెల నరసింహారావు వారి తండ్రి మల్లెల వెంకటప్పయ్య జ్ఞాపకార్థకంగా గ్రామానికి బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో అనేక దేవాలయాలకు ఆర్థికంగా సహాయం చేయడం, గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంతిమ యాత్ర అయిన హాయిగా సాగాలని శవ పేటిక బహుకరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేముల నరేష్‌బాబు, నారాయణ, రాజా, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అప్పులు చేసి విద్యార్థులకు అన్నం వండి పెడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిఐటియు భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ తోటమల్ల రమాకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నకరికంటి నాగరాజు మాట్లాడుతూ నెలల తరబడి మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు విడుదల చేయకపోతే విద్యార్థులకు భోజనాలు ఎలా వొండి పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు మెనూని సక్రమంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేస్తారే తప్ప కార్మికుల సమస్యలు పట్టవా అని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రతతో పాటు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పిస్తూ నెలకి 26వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికులను ఉద్దేశించి ఎంఈఓ రామ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అజయ్ కుమార్ మధ్యాహ్న భోజన కార్మిక నాయకులు పిలక శివకుమారి, బేబీ, పాప, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి (గుండాల) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎంఈఓ కార్యాలయం ప్రాంగణంలో దశల వారీగా ఆందోళనలు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడతామని గుండాల మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నజ్మా, పొంబోయిన లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, రాణి, జయ, కౌసల్య, రాములమ్మ, గద్మ, స్వరూప, సరస్వతి, లచ్చమ్మ, లీలా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సిఐటియు నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులతో కలసి మండల ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సిఐటియు నాయకురాలు మంగమ్మ, శ్యామల, శాంతమ్మ, భద్రకళ, రమణ, నరసమ్మ, వజ్జ మంగమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 16, 17 తేదీలలో 48 గంటల దీక్షలను చేస్తున్నామని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. గురువారం ఎంఈఓ స్వర్ణ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. 16, 17 తేదీలలో విధులకు హాజరుకామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏం.అరుణ, ఎన్. శైలజ, సిహెచ్.విజయ, బి.నాగమ్మ, పి.లలిత, నాగరత్నం, రమణ, గౌసియా బేగం, మణెమ్మ, సారమ్మ సరిత, శాంతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అధికారుల కృషి అమోఘం

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన సంక్షేమశాఖ జిపిఎస్ పాఠశాలలో చదువుతున్న బాలబాలికల విద్యా బలోపేతం కావడానికి ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చేస్తున్న వివిధ రకాల ప్రణాళికలు పిల్లలకు ఎంతో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ జిపిఎస్ పాఠశాలలో ఐటీడీఏ ద్వారా రూపొందించిన ఉద్దీపకం ఇంగ్లీష్ గణితం విద్యార్థుల వర్కుబుక్కును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల సదుపాయాలు కల్పించిందని దానిని విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ ఉద్దీపకం పుస్తకం వలన గిరిజన విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన దీపం వెలుగు నింపడానికి ఈ పుస్తకం పుట్టుకొచ్చిందని ఈ పుస్తకం రూపకల్పనకు గణిత ఉపాధ్యాయులు ముగ్గురు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు నలుగురు, పి ఎమ్ఆర్‌సిపిసిఎంఓ రమణయ్య, సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణలో కార్యాచరణ రూపొందించి తయారు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓ




అశోక్ కుమార్, ఎంఈఓ రమా, ఎస్‌సిఆర్ పి శ్రీదేవి, హెచ్ఎం భాష్య, వర్క్ బుక్స్ రూపకల్పన, తయారు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేనోవేషన్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-టేకులపల్లి



టేకులపల్లి హైటెక్ కాలనీలో రేనోవేషన్ చేసిన చిల్డ్రన్స్ పార్క్, సిఇఆర్ క్లబ్, షటిల్ కోర్టులను ఇల్లందు సింగరేణి ఏరియా జియం జాన్ ఆనంద్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన, ఫ్యామిలీ డే వేడుకల సందర్భంగా జాన్ ఆనంద్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు, ఎంత ప్రాధాన్యత ఉందో ఉద్యోగుల సంక్షేమానికి అంతే ప్రాధాన్యత ఇస్తుందని, ఇటువంటి వేడుకలు నిర్వహించడం వలన, ఉద్యోగులకు, యాజమాన్యం మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు. అనంతరం ఫ్యామిలీ డే సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన, ఉద్యోగుల కుటుంబాల మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న జిఎం జాన్ ఆనంద్‌ను సిఇఆర్ క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవి మోహన్‌రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ శివశంకర్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు రాజారామ్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ప్రాతినిధ్య సంఘ బ్రాంచ్ కార్యదర్శి భూక్య నాగేశ్వరరావు, సిఇఆర్ క్లబ్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



రైతు పండుగను విజయవంతం చేయండి

- పీఏసీఎస్ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ రైసింగ్ నినాదంతో మహబూబ్ నగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 30 న నిర్వహిస్తున్న రైతు పండుగ ముగింపు సభకు రైతులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అశ్వారావుపేట పీఏసీఎస్ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతు పండుగ సభ విజయవంతం కోరుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఇప్పటికే ఋణ మాఫీ చేసిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సన్న రకాలకు బోనస్ అందిస్తుంది అన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న భహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నారని, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట సీఈవో విజయ్ బాబు, రైతులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | నవంబర్30, 2024 | www.navatelangana.com

హాకీ క్రీడాకారుడిని అభినందించిన ఐటీడీఏ పీఓ

నవతెలంగాణ-భద్రాచలంరూరల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం మారుమూల గ్రామమైన రేగళ్ల తండాకు చెందిన సాయి కిరణ్ ఈనెల ఒకటో తేదీ నుండి నాలుగో తేదీ వరకు మంచిర్యాల జిల్లా గాంధారిలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనడం సంతోషకరమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో జార్ఖండ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరిగే జాతీయస్థాయి హాకి పోటీల్లో పాల్గొనే సాయి కిరణ్‌ను అభినందిస్తూ పదివేల రూపాయల విలువగల హాకీ కిట్టును ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలం గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులోనే కాదు ఆటల్లో కూడా అద్వితీయమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నారని రాష్ట్రస్థాయి క్రీడలలో అద్భుతమైన ప్రతిభ చూపి జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనడం చాలా గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో కూడా మంచిగా ప్రతిభ కనబరిచి శిక్షణ అందించిన కోచులకు ఉపాధ్యాయులకు, మీ గ్రామానికి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాలరావు, ఏ ఎస్ ఓ నాగేశ్వరరావు, ఈఎంఆర్ఎస్‌పిఈటి మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లకావత్ వెంకటేశ్వర్లుకి అభినందనల వెల్లువ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన లకావత్ వెంకటేశ్వర్లుని శుక్రవారం స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి పార్క్ ప్రాంగణంలో గ్రీన్ భద్రాద్రి లయన్స్ క్లబ్ రెడ్ క్రాస్ రోటరీ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో భారీ ఎత్తున అభినదన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకాల దుర్గాప్రసాద్, గోళ్ళ భూపతిరావులు మాట్లాడుతూ లకావత్ వెంకటేశ్వర్లు గతంలో దిశ కమిటీ సభ్యులుగా తదుపరి ఆత్మ కమిటీ చైర్మెన్‌గా ప్రస్తుతం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా అంచెలంచెలుగా ఎదుగుతున్నారన్నారు. ఎల్వి మున్ముందు మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యశోద రాంబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామలింగేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు బాలాజీ, కార్యదర్శి సాగర్, కోశాధికారి శ్రీనివాస్, ప్రభాకర్ గుప్తా, హరిశ్చంద్రనాయక్, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్తిరాజు, పరిమి సోమశేఖర్, పల్లింటి దేశప్ప, సోమరౌతు శ్రీనివాస్, గాదె మాధవరెడ్డి, ఎస్‌కె. అజీమ్, చారుగుళ్ళ శ్రీనివాస్, పామరాజు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని దర్శించుకున్న తహసీల్దార్ దంపతులు

- నిత్యాన్నదానానికి రూ. 5,116లు వితరణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని నర్సాపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్ర (చిన్నఅరుణాచలం) అరుణాచలేశ్వర స్వామి వారిని తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు శివ నాగ స్వామి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో గల సహస్ర లింగంతో పాటు జ్యోతిర్లింగాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రతిరోజు నిర్వహిస్తున్న నిత్యన్నదానానికి రూ. 5,116 లను ఆలయ వ్యవస్థాపకులు శివ నాగ స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా అరుణాచలేశ్వర స్వామి వారి ఆశీస్సులను ఆశీర్వాదాలను అందజేశారు.


కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల తనిఖీలు

- కావడిగుండ్లలో భోజన శాల లేక విద్యార్థుల ఇబ్బందులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు విషతుల్యం ఆహారంతో అస్వస్థతకు గురైన సంఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో మండల స్థాయి అధికారులు తనిఖీలు అశ్వారావుపేట మండలంలోను సాగుతున్నాయి. గురువారం అశ్వారావుపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే, బీసీ బాలికల గురుకులం పాఠశాలలో మండల స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించగా ఈ పాఠశాలలో విద్యార్థులకు బెడ్స్ కొరత వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మండలంలోని మారుమూల ప్రాంతంలో గల కావడిగుండ్ల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీఈఓ సోయం ప్రసాదరావు, సెర్ప్ ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి తనిఖీలు నిర్వహించారు.
1 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు 134 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో భోజనశాల లేక భోజనం చేసేందుకు ఆరుబయట ఆరుగులో నేలపైనే భోజనం చేయాల్సి వస్తుంది. ఎండాకాలం, వర్షాకాలం భోజనం సమయంలో వీరి ఇబ్బందులు చెప్పలేనివి కావు. వంట శాలకు భోజనం చేసే ప్రదేశానికి మధ్య ఆట స్థలం ఉండటంతో భోజనం కంచాలతో అక్కడికి ఇక్కడికి పరుగులు తీస్తున్నారు.
వంటగది, పరిసరాలు, విద్యార్థులు వసతి గదులు, బెడ్స్ సౌకర్య వంతంగానే ఉన్నప్పటి భోజనశాల లేమి అక్కడి విద్యార్థులను బాధిస్తుంది.
కాంట్రాక్టర్ కూరగాయలు సక్రమంగా సరఫరా చేయడంలేదని, దీంతో స్థానికంగా మేమే కూరగాయలు కొనుగోలు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నా మని ప్రధానోపాధ్యాయుడు వి.రాంబాబు తెలిపారు. ఆయన వెంట వార్డెన్ నరసింహారావు, బోధనా, బోధనేతర సిబ్బంది ఉన్నారు.



జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

- అభినందనలు తెలిపిన కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జాతీయ రాష్ట్రస్థాయి పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 బాలురుల విభాగంలో శ్రీవిద్య స్కూలుకు చెందిన పి నోయల్ విన్సెంట్ జాతీయస్థాయి పోటీల్లో ఫెన్సింగ్ విభాగంలో తెలంగాణ రాష్టానికి బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా జూడో, నెట్ బాల్, బ్యాట్మెంటన్, హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలలో పథకాలు సాధించడం జరిగినది. అండర్ 14 బాలికల విభాగంలో శ్రీవిద్య స్కూల్‌కు చెందిన గరిడేపల్లి భావన కీర్తిక, నవభారత్ పబ్లిక్ స్కూల్ పాల్వంచకు చెందిన విద్యార్థులు రోడా గ్రీస్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, జూడో విభాగాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఎస్‌జీఎఫ్ విద్యార్థులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. క్రీడ నైపుణ్యతను తెలుపుతూ, క్రీడల పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని డివైఎస్ఓ, నూతన ఒలంపిక్ కమిటీకి తెలియజేశారు. పిల్లల ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివైఎస్ఓ పరంధామ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నరేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శిగా లిక్కి బాలరాజు ఎన్నిక

నవతెలంగాణ-కొత్తగూడెం



సీపీఐ(ఎం) కొత్తగూడెం టౌన్ కార్యదర్శిగా లిక్కి బాలరాజు ఎన్నికయ్యారు. గురువారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో జరిగిన టౌన్ మహాసభలో లిక్కి బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి వర్గ సభ్యులుగా భూక్యా రమేష్, డి.వీరన్న, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కొత్తగూడెంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుతున్నామని తెలియజేసారు. ఇండ్ల స్థలాలు, హాస్పిటల్ నెలకొన్న సమస్యల పరిష్కారం, ఇండ్ల స్థలాల క్రమ బద్దీకరణ పట్టాలు, బై పాస్ రోడ్డు తదితర సమస్యలపై తీర్మానాలు చేశారు.

బంగారు తెలంగాణ తీరు మార్చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా దీక్షా దివస్

నవతెలంగాణ-కొత్తగూడెం



పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రలో బంగారు తెలంగాణ పాలన రుచి చూసిన ప్రజలకు బంగారు తెలంగాణ తీరు మర్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహనికి పూల మాల వేసి నివాళిలు అర్పించిన నాయాకులు అనంతరం అమర వీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పించారు. సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సభలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావులు మాట్లాడారు. దీక్షా దివాస్ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, విజయవతం చేసిన పార్టీ శ్రేణులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారుఆ. తెలంగాణ రాష్ట్ర సాధనకు మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2009నవంబర్ 29వతేదీన ఆమరణ దీక్షకు దిగిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా ఇదే రోజున దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తొలుత కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్ నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, మునిసిపల్ ఛైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి, దిండిగాల రాజేందర్, రామకృష్ణ, వనమా రాఘవేందర్, వేల్పుల దామోదర్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చదువుతోపాటు క్రీడలు అవసరం

- లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ లయన్ మన్నెం జవహర్‌రెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు అవసరం....నిత్యం సాధన చేయ్యలని, పథకాలు సాధించడంలో ముందుండాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ లయన్ మన్నెం జవహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని చుంచుపల్లి మండలం, బాబుక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా సామాగ్రిని మన్నెం జవహర్‌రెడ్డి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరుగు నీరజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మైదానంలో ప్రతిరోజు ఒక గంట క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉన్నవారే చదువుతోపాటు, ఆరోగ్యంగా ఉండి అన్ని రంగాల్లో రానిస్తారన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ నియామకాల్లో, ఉన్నత చదువుల్లో క్రీడా రిజర్వేషన్లు కూడా వినియోగించుకోవాలని, దేశ విదేశాల్లో క్రీడారంగంలో అత్యున్నత స్థాయికి వెళ్ళిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. క్రీడా సామాగ్రి వితరణ దాత నల్గొండ లయన్స్ డిస్టిక్ చైర్ పర్సన్ లయన్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 100 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా సామాగ్రిని అందించడం జరుగుతుందని, నిత్యం పీఈటీల పర్యవేక్షణలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే విధంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నీరజ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ షేక్ దస్తగిరి, కార్యదర్శి లగడపాటి రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు మొరిశెట్టి మోహనరావు, శ్రీధర రావు, బిక్కులాల్, కోటేశ్వర రావు, బుచ్చయ్య, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నండూరి స్పూర్తితో...లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడుదాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రసాద్‌రావు 23 వ వర్ధంతి

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మికోద్య నిర్మాత సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అమరజీవి నండూరి ప్రసాద్ రావు స్పూర్తితో బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయటమే నండూరి ప్రసాద్ రావుకి నివాళి అర్పించినట్లు అవుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎజె.రమేష్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. నండూరి ప్రసాద్‌రావు 23వ వర్ధంతి సభను సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత నండూరి చిత్రపటానికి మంద నరసింహారావు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్యత కోసం నండూరి ప్రసాదరావు విశేషమైన కృషి చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న గొప్ప దేశభక్తుడని కొనియాడారు. సిఐటియుని ఏర్పాటు చేయడంలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా సంఘటిత అసంఘటిత రంగాల్లో అనేక కార్మిక సంఘాలను నండూరి నిర్మాణం చేశారని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కుల పై తీవ్రమైన దాడి చేస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులన్నీ రద్దు చేయాలని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులను రక్షించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను సమరశీల పోరాటాల ద్వారా ప్రకటించాలని పిలుపునిచ్చారు. పని గంటల పెంపు, కనీస వేతనాల కోత, ఉమ్మడి బేరసారాల హక్కు, పిఎఫ్, పెన్షన్ తదితర చట్టబద్ధమైన హక్కులన్నింటిని కేంద్రం రద్దు చేయాలని ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వర్ధంతి సభలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ, సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు గాజుల రాజారావు, జిల్లా ఆఫీస్ బేరర్స్ బొల్లి వెంకటరాజు, పిట్టల అర్జున్, ఈసం వెంకటమ్మ, దొడ్డ రవికుమార్, డి.వీరన్న, గద్దల శ్రీను, సిఐటియు, నాయకులు గడల నరసింహారావు, కూరపాటి సమ్మయ్య, వై.వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీర భద్రం తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి 'తాళ్ళూరి' చేయూత

- దూరం నుండి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ
- దూర భారంతో విద్యార్థినులు చదువులకు దూరం కాకూడదు
- ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ

నవతెలంగాణ-బూర్గంపాడు



ఆడపిల్లను పుట్టనిద్దాం.... పెరగనిద్దాం... చదవనిద్దాం... అనే నినాదాలు మాటలకే పరిమితం కాకుండా వాస్తవ రూపం దాచేందుకు కృషి చేసే వారిలో అతి కొద్ది మందే ఉంటారనటంలో ఎటు వంటి అతిశయోక్తి లేదు. దూర భారంతో చదువుకునే బాలికలు విద్యకు దూరం కాకూ డదన్న లక్ష్యంతో విద్యార్థినీల చదువులు సాఫీగా సాగేం దుకు తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న చేయూత పై 'నవతెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం....
వరదలు వచ్చినా..విపత్తు వచ్చినా.. నేనున్నా నంటూ.. పెద్దన్న సహాయం అందించే బూర్గంపాడు మండలం లోని ఇరవెండి గ్రామానికి చెంది న తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి తాళ్ళూరి పంచాక్ష రయ్య మరోసారి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. తాళ్ళూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు తానా మాజీ అధ్యక్షుడు, తాళ్ళూరి నీలిమా జయ శేఖర్ దంపతుల సౌజన్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని,భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం జిల్లాల వ్యాప్తంగా తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 సైకిళ్ళను పంపిణీ చేసి.. సేవలో తనకెవరు సాటి రారని మరోసారి నిరూపించారు.



అనేక రకాలుగా విద్య వైద్యం సాం స్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తాళ్ళూరి పంచాక్షరయ్య కుటుంబ సభ్యుల సహకా రంతో అందిస్తున్న సేవ లలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మూడు మైళ్ళు దూరంలో పాఠశాల లకు వెళ్తున్న విద్యార్థినీలు ప్రత్యేకంగా గుర్తిం చి తొలి విడతగా సుమారు 300 మంది విద్యార్థి నిలకు సుమారు 20 లక్షల పదివేలు విలువచేసే సైకిళ్ళను అందజేశారు. బూర్గంపాడు మండలం లోని ఇరవెండి బాలిక లకు, పాల్వంచ మండలం యానంబైలు పాఠ శాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు, అశ్వా పురం మండలంలోని మొండికుంట, రామచంద్ర పురం పాఠశాలలలో చదువుకుంటున్న విద్యార్థి నిలతో పాటు, దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక, నరసాపురం గ్రామాల విద్యార్థులకు కూడా ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలోని మారుమూల గ్రామా లలో విద్యనాభ్యసిస్తున్న విద్యార్థి నిలకు సైకిళ్ళ ను పంపిణీ చేసి తాళ్ళూరి చారిటబుల్ ట్రస్టు సేవలకు సరిహద్దులు లేవని రుజువు చేశారు. రెండు నెలల కితం వరదలతో సర్వం కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ వరద బాధితు లకు బురి రుణ సహాయం అందిం చిన తాళ్ళూరి పంచాక్షరయ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అనేక రకాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పంచాక్షరయ్య కుమారులు తాళ్ళూరి జయశంకర్, రాజశ్రీలు అమెరికాలో స్థిరపడ్డప్పటికీ మాతృదేశంపై ఉన్న మమకారంతో ఈ ప్రాంత ఆడపి ల్లలు విద్య లో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని తమ తండ్రి ఆశయ సాధనకు సహాయ సహకారాలు అందిస్తూ సేవ గుణంలో తండ్రి బాటలో పయని స్తున్నారని అనటంలో ఏమాత్రం సందేహం లేదు.



దూర భారంతో బాలికలు చదువులకు దూరం కాకూడదు

ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ

ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి నిలు దూర భారంతో చదువులకుదూరం కాకూడదని లక్ష్యంతో తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 సైకిళ్ళు పంపిణీ చేయడం జరిగింది.



పంచాక్షరయ్యకు విద్యపై ఉన్న మక్కువతో అందరికీ విద్య అందాలనే లక్ష్యంతో అనేక ఏళ్లగా విద్యాభివృద్ధికి ఎన్నో రూపాలలో కృషి చేస్తున్నారు. ఏజెన్సీ గ్రామాలలో పాఠశా లలకు బెంచీలు, పుస్తకాలు వంటివి ఎన్నో సంద ర్భాలలో వితరణ చేసిన చారిటబుల్ ట్రస్ట్ ఆరు నెలల క్రితం భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృ ద్ధికి ఆర్థిక సాయం అందించా రు. మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాలకు నడిచి వెళ్తూ ఇబ్బంది పడుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని మొదటి విడతగా ఈ సైకిళ్ళు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాము. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మరింత మంది విద్యార్థులకు సైకిళ్ళను పంపిణీ చేసేందుకు ప్రణాళికను ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నాము. నిస్వార్ధంగా సేవ చేసేందుకు ప్రాంతాలు సరిహ ద్దులతో సంబంధంలేదని నమ్మే పంచాక్షరయ్య పక్క రాష్ట్రంలో విపత్తుల సంభవించినప్పటికీ తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ తాళ్ళూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలను విస్తరింప చేస్తున్నాము.

పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

- భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతరామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

నవతెలంగాణ-చర్ల

పిఎల్‌జిఏ 24వ వార్షికోత్సవాలను డిసెంబర్ 2 నుండి డిసెంబర్ 8 వరకు విప్లవ సమరోత్సహంతో నిర్వహించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ శుక్రవారం ఒక లేఖలో పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ల వ్యాప్తంగా విప్లవ సమరోత్సవాలతో జరుపుకుందాం, 2047 కల్లా దోపిడి కార్పోరేట్ల హిందూ (ఆర్య బ్రాహ్మణ) దేశం స్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ -బిజెపి ప్రభుత్వం భారత పీడిత ప్రజలపై జరుపుతున్న యుద్ధం విప్లవ ప్రతిఘాతక "ఆపరేషన్ కంగార్"ను ప్రజా ఉద్యమాలను, గెరిల్లా పోరాటాన్ని తీవ్రతరం చేసి తిప్పికొడుదామని, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయ సాధన కోసం మన దేశంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్య(పిఎల్‌జిఏ) ఏర్పడి 2024 డిసెంబర్ 2 నాటికి 24 సంవత్సరాలు నిండుతాయని తెలిపారు. కావున డివిజన్ వ్యాప్తంగా పట్టణ, మైదాన, గ్రామాల్లో వాడ వాడన విప్లవ సమరోత్సహంతో జరుపుకుందామని ఆయన లేఖలో కోరారు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో విప్లవ ప్రతిఘాతక సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడిని అందులో భాగమైన "ఆపరేషన్‌కగార్" దాడిని ఓడించడానికి పోరాడుతూ గత సంవత్సర కాలంలో దాదాపుగా 270 మంది



కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారు. అమరుల త్యాగాలను ఎత్తిపడుదామని పేర్కొన్నారు. తుదకంట అమరుల ఆశయాలను కొనసాగిద్దాం. ప్రియమైన ప్రజలారా ! 1950 వ దశకంలో బాబ సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం చెల్లదని దీన స్థానంలో దోపిడి అసమానతలతో, పితృస్వామ్యం, పీడనలతో కూడిన కాలం చెల్లిన మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశ పెట్టి హిందూ (ఆర్య బ్రాహ్మణ) దేశాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో వంద సంవత్సరాల క్రిందట (1925లో) స్థాపించారు. ఈ కళను సాకారం చేసుకోవడానికి వందల శాఖలను (అనుబంధ సంఘాలు) ఏర్పాటు చేసుకున్నారు. అందులో భాగమే రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి బీజేపీని ఏర్పాటు చేసుకొని అధికారాన్ని చేజిక్కించుకొని గత పదేళ్లకు పైగా మత మైనార్టీలపై, దళితులపై, ఆదివాసీలపై, వెనకబడిన వర్గాలపై, మహిళలపై, ప్రజాస్వామికవాదులపై, విప్లవ కారులపై హత్యలకు, అత్యాచారాలకు పాల్పడింది. అయిన తమ కళ సాకారం కాకపోవడంతో కార్పోరేట్లతో మమేకమయి భారత దేశాన్ని 2047 కల్లా దోపిడి కార్పోరేట్ హిందూ (ఆర్య బ్రాహ్మణ) దేశంగా మార్చడానికి అడ్డంకిగా లేదా శతృవుగా భావిస్తున్న మత మైనార్టీలను దళితులను, ఆదివాసీలను, వెనకబడిన వర్గాలను మహిళలను ప్రజాస్వామికవాదులను వీరందరికి మద్దతునిస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికే " ఆపరేషన్ కగార్ " (అంతిమ యుద్ధం) పేరుతో భారత పౌరులతో నరేంద్ర మోడీ ప్రభుత్వం యుద్ధం చేస్తుంది. మరీ ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో విలువైన ఖనిజాలున్నాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ ఖనిజాలను ఇవ్వదల్చుకున్నది. కానీ ఆదివాసులు ఇవ్వమంటు శాంతియుత చట్టబద్ధ పోరాటం చేస్తూ దేశ సంపదను కాపాడుతున్నారు. కాబట్టి ఆర్ఎస్ఎస్- బీజేపీ మోడీ ప్రభుత్వానికి కోపమొచ్చింది. భారత రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్ నుఉల్లంగించి బార్డర్లో ఉండాల్సిన సిఆర్పిఎఫ్ ,ఐటీబీపీ, బిఎస్ఎస్ లాంటి బలగాలను మొహరించి డి ఆర్ జి లాంటి గుండాలతో, రాకెట్ లాంచర్లు, యుద్ధ ట్యాంక్ లతో రాత్రనక, పగలనక ఆదివాసీల పంట పోలలపై, అడవులపై, గ్రామాలపై బాంబుల వర్షం కురుపిస్తూ అడవుల నష్టం, పంట నష్టం, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, జంతు నష్టం చేస్తూ వారి కృరత్వాన్ని చాటుకుంటున్నారు. ఒక మాటలో చెప్పలంటే సర్వం విధ్వంసం చేస్తున్నారని తెలిపారు. కాబట్టి భారత పౌరులందరు ఏకమై ఎక్కడికక్కడ ఆర్ఎస్ఎస్- బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం "ఆపరేషన్ కగార్" పేరుతో చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి, గెరిల్లా పోరాటాన్ని తీవ్రతరం చేసి కగార్ యుద్ధాన్ని తిప్పికొట్టాలని బికే -ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ పిలుపునిస్తోందని ఆ లేఖలో ఆజాద్ కోరారు.



సానికొమ్ము శంకర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రముఖ పారిశ్రామిక సంస్థ ఐటీసీ పీఎస్పీడీలో బి.ఆర్.టి.యు యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం సరోజా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు వృద్ధాశ్రమంలో జరుపుకోవడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఈ వృద్ధాశ్రమంకు తన వంతు సహకారం అందచేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షేక్ అజీమ్, వెంకటేశ్వర్లు, గోపి, బాల్రెడ్డి గోపాల్, సతీష్, పోటు నరసింహారావు, రాజశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, వేణు, దుర్గేష్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత ప్రతిభా పాటవ పరీక్షలు

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిఎంఎఫ్ భద్రాద్రి ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పాటవ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం హైస్కూల్ ఆవరణలో జరిగిన పరీక్షలో పలువురు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఈ పరీక్షలో ఇంగ్లీష్ విభాగంలో దమ్మపేట హైస్కూల్ విద్యార్థిని ఎస్కె నాసియా 30 మార్కులకు గాను 27 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

నేడు గండుగులపల్లిలో రైతు పండుగ సంబరాలు

నవతెలంగాణ-దమ్మపేట

నేడు మండల పరిధిలోని గండుగులపల్లి రైతువేదిక వద్ద జరుగు రైతుపండుగ సంబరాలకు రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రైతులకు ఏకకాలంగా రూ.2లక్షల రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి రూ.500ల బోనస్, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.7625 కోట్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ద్వారా రూ.10,444కోట్లు రైతులకు అందించిన శుభ సందర్భంలో మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పండుగ సంబరాలను మహబూబ్‌నగర్ శనివారం ప్రారంభించనున్నారు. ఇట్టి కార్యక్రమాన్ని రైతులందరితో పాలుపంచుకోవడానికి గాను మండలంలోని గండుగులపల్లి రైతువేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. కావున రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పూసుకుంటలో పర్యటించిన అధికారుల బృందం

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలోని గవర్నర్ దత్తత గ్రామం అయిన పూసుకుంటను మండల అధికారులతో కలిసి ఐటీడీఏ బృందం శుక్రవారం సందర్శించింది. అధికారుల బృందం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేయాలో ఇతర సమస్యలు, సౌకర్యాలు తదితర అంశాలపై అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నివశిస్తున్న వారికి ఎటువంటి సదుపాయాలు కావాలి, వ్యవసాయానికి సంబంధించి పరికరాలు ఎలాంటివి కావాలనే విషయాలపై ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చందా నరేష్, పీహెచ్ఓ ఉదయ్, భాస్కర్‌రావు, జెడీఎం హరికృష్ణ, ట్రైకార్ సెక్షన్ అసిస్టెంట్ రామ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ సుబ్బరాజు, ఐటిడిఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పూసుగుప్ప రోడ్ లో వెలసిన మావోయిస్టు బ్యానర్లు

నవతెలంగాణ-చెర్ల



మండల పరిధిలోని పూసుగుప్ప రోడ్లో గురువారం రాత్రి చర్ల శబరి ఏరియా కమిటీ మావోయిస్టు పార్టీ పేరిట బ్యానర్ దర్శనం ఇచ్చింది. బాటసారులు తెలిపిన వివరాల ప్రకారం వద్దిపేట, పూసుగుప్ప నడుమ రోటెంత వాగు సమీపంలో ఎర్రటి రంగులో ఉన్న గుడ్డపై తెల్లటి అక్షరాలు రాసిన బ్యానరు వెలసినట్లు తెలిపారు. ఆ బ్యానర్ పై పిఎల్‌జిఏ 24వ వార్షికోత్సవాలను గ్రామ గ్రామాన విప్లవోత్సవాలతో జరుపుకోవాలని, ఆపరేషన్ కంగారును వ్యతిరేకించాలని, జల్ జంగిల్ జమీన్ కోసం వీరోచితంగా పోరాడాలని, గెరిల్లా పోరాటం విస్తృతం చేయాలని, యువత ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం లో చేరాలని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే ఆధ్యాత్మిక పర్యటన

- సతీసమేతంగా పలు దేవాలయాలను సందర్శించిన తెల్లం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రతిరోజు ప్రతిక్షణం తీరిక లేకుండా ప్రజాక్షేత్రంలో బిజీబిజీగా గడుపుతున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తన వివాహ దినోత్సవ సందర్భంగా శుక్రవారం పట్టణంలో సతీసమేతంగా పలు దేవాలయాలను సందర్శించారు. వివాహ దినోత్సవ వేడుకలను కేవలం అభిమానులతో చేసుకోవడానికి పరిమితం కాకుండా పట్టణంలోని దుర్గమ్మ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉమా రామలింగేశ్వర ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా పట్టణంలోని సాయిబాబా మందిరాన్ని సందర్శించిన తెల్లం బాబా వారి ముందు శాస్త్ర నామ గోత్రనామ పూజలు నిర్వహించారు. ఆయన అభిమానులు పట్టణంలో పలు కాలనీలలో కేకులు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండే దుమ్ముగూడెం చర్ల మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు.



కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన డీఈవో వెంకటేశ్వర చారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాలను, వండిన ఆహార పదార్ధాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ నిర్వహణతో పాటు, విద్యా ప్రమాణాల విషయంలో రాజీ లేకుండా పని చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, జిసిడిఓ అన్నమణి, పాఠశాల ప్రత్యేక అధికారి శోభారాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిషోర్‌కి ప్రశంసా పత్రం అందజేసిన ఎస్పీ

నవతెలంగాణ-పినపాక



ఇటీవల కాలంలో జరిగినటువంటి లోక్ అదాలత్ కేసుల్లో అత్యధిక కేసులు రాజీ చేసినందుకు ఏడూళ్ల బయ్యారం పిఎస్ కోర్టు కానిస్టేబుల్ కిషోర్ కు ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కిషోర్‌ని మణుగూరు డీఎస్పి రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్ లు అభినందించారు. అనంతరం కానిస్టేబుల్ కిషోర్ మాట్లాడుతూ తనకు వచ్చిన అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



సమగ్ర కుటుంబ సర్వే మూడు రోజుల్లో పూర్తి

• కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు

నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే, అబ్జేషన్ మరో మూడు రోజుల్లో పూర్తి అవుతుందని కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు స్పష్టం చేశాడు. శుక్రవారం చంద్రుగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డేటా ఎంట్రీ పూర్తి అవుతుందని, సర్వే మొత్తం సజావుగా జరిగిందన్నారు. గానుగపాడులోని నల్లచెరువు రికార్డులను పరిశీలించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నష్టపరిహారం అందించటం జరుగుతుందన్నారు. జిల్లాల్లో చంద్రుగొండ మండలం నాలుగో స్థానంలో సర్వేలో ఉందన్నారు. జిల్లాలో సర్వే అబ్జేషన్ 25శాతం పూర్తి అయిందన్నారు. అనంతరం కార్యాలయంలోని భూ రికార్డులను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశాడు. తహసీల్దార్ సంధ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• ఎంఈవో ఆఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు



మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులు జీతాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్ లో ఉన్న గుడ్ల బిల్లులు ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాలకు వేస్తున్నట్టు గుడ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి పాండు రంగాచార్యులుకు వినతి పత్రం సమర్పించారు. వారు స్పందిస్తూ గుడ్ల బిల్లులు మెనూ ఛార్జీలకు సంబంధించి ప్రభుత్వానికి వినతులు పంపుతామని పెంచే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్తాన, సీఐటీయూ జిల్లా నేతలు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ మాట్లాడారు. ప్రతి స్కూలుకు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని అవసరమైన గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కుమారి మధ్యాహ్న భోజన కార్మి కులు బుర్రి పద్మరాణి, జయ, కౌసల్య, రాములమ్మ స్వరూప, సరస్వతి, లచ్చమ్మ, లీలా, సుజాత పాల్గొన్నారు.

పర్యాటక టూరిజం పార్కు ఏర్పాటుకు రూ.80 లక్షలు నిధులు మంజూరు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు పర్యాటక టూరిజం పార్కు ఏర్పాటుకు 80 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి పరిచేందుకు భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారని అన్నారు. ఆలయాన్ని సందర్శించుకున్న భక్తులకు ఆహ్లాదాన్ని పంచేందుకు టూరిజం పార్కు ఏర్పాటు కొరకు నిధులు మంజూరు చేసిన భట్టి విక్రమార్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక విప్లవ సాహిత్యం యువతరానికి స్ఫూర్తి

• కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్

• ప్రతిఘటన మాసపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ- ఖమ్మం



మహనీయులు మార్క్స్ పూలే అంబేద్కర్‌ల స్ఫూర్తితో సామాజిక విప్లవ సాహిత్యాన్ని నేటి యువతరం అధ్యయనం చేయాలని కేవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పి క్యాంప్‌లోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ ప్రచురించిన ప్రతిఘటన మాస పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నేటి సమకాలీన పరిస్థితులు, రాజ్యాంగ రక్షణ, దళితులు, బలహీన వర్గాల చట్టాలు వంటి కీలక అంశాలతో ప్రతిఘటన మాసపత్రిక ప్రచురించబడిందన్నారు. నేటి యువతరం పుస్తక పఠనశక్తిని మరింత పెంచుకోవాలన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ మాట్లాడుతూ కేవీపీఎస్ నిర్మించిన ఉద్యమాలు సామాజిక చైతన్యానికి బాటలు వేస్తాయన్నారు. దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని ప్రతిఘటన పత్రిక సిద్ధం చేస్తుందన్నారు. కేవీపీఎస్ కార్యకర్తలు సామాజిక తరగతులకు చెందిన యువతరం ఈ పత్రికను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, నకరికంటి చిరంజీవి, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి సదానందం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, హిమాం, పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా కూరపాటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం



ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ జన్మదిన వేడుకలను ఖమ్మంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అన్నం సేవా ఫౌండేషన్‌లో మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కూరపాటి ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్‌లో అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను కట్ చేశారు. అభిమానులు, హాస్పిటల్ సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ ఇర్షాద్, కోటి, సాయి, సునీత, ఊహ, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పటంలో 'సంక్రాంతి'

• అమెరికా ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైన రవికుమార్

• దేశం నుంచి ఏడుగురు ఎంపిక.. అందులో ఒక్కరే ఇంగ్లీషు టీచర్

• విద్యా, సంస్కృతి పరమైన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ

• ప్రపంచవ్యాప్తంగా హాజరైన 60 దేశాల ప్రతినిధులు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అమెరికా ప్రభుత్వ పురస్కారానికి ఖమ్మం జిల్లాకు చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సంక్రాంతి రవి ఎంపికయ్యారు. ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అండ్ అచీవ్మెంట్ ప్రోగ్రాంకు భారతదేశం నుంచి ఏడుగురు ఎంపిక కాగా వీరిలో రవి ఒక్కరు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 11వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు అమెరికాలోని ఓహెయో రాష్ట్రం కెంట్ స్టేట్ అండ్ యూనివర్సిటీలో 50 రోజులపాటు నిర్వహించే కార్యక్రమానికి రవి మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 60 దేశాల నుండి ఉపాధ్యాయులను ఇందుకోసం ఎంపిక చేశారు. అక్కడి ప్రభుత్వ విభాగాలైన ఇంటర్నేషనల్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌చేంజ్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్ కల్చరల్ అఫైర్స్ ఆయా యూనివర్సిటీలో నిర్వహిస్తాయి. దీనిలో భాగంగా విద్యా సంస్కృతి పరమైన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు అక్కడి స్థానిక పాఠశాలలను సందర్శించి బోధనా పరిశీలన చేసే అవకాశం ఆయనకు లభించింది. కెంట్ స్టేట్ యూనివర్సిటీలో జరిగిన ఈ శిక్షణకు 20 దేశాల నుండి హాజరైన 21 మంది ఇంగ్లీష్, గణిత ఉపాధ్యాయులు ఐదు అంశాల్లో పరిశీలన అనుభవం పొందారు. జనరల్ పెడగోగి లో భాగంగా నూతన బోధనా పద్ధతులు, ఇంగ్లీషు బోధనలో నవీన విధానాలు, రోజువారీ బోధనలో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి బోధించడం వంటి అంశాలపై 45 రోజుల పాటు జరిగిన చర్చల్లో రవి పాల్గొన్నారు. మనదేశంలో ఆయా విభాగాల స్థితిగతుల గురించి వివరించారు. యూరప్, అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాల నుంచి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు అనుభవాలను వివరించారు. పర్యావరణ విద్య, బాలిక విద్య, మహిళా సాధికారత వంటి అంశాలపై జరిగిన చర్చల్లో రవి భాగస్వామ్యం ఉంది.





మన లాగే ఇతర దేశ మహిళల స్థితిగతులు..

మన దేశంలోని మహిళా స్థితిగతులకు ఇతర దేశాల మహిళా స్థితిగతులకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని రవి పేర్కొన్నారు. అగ్రరాజ్యం అమెరికాలో సైతం అనేక రంగాల్లో మహిళల పట్ల వివక్షత కొనసాగుతోందన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఉన్న మహిళా ప్రొఫెసర్ జీతభత్యాలు, అదే పనిలో ఉన్న పురుషుల కంటే తక్కువగా ఉండడం గమనార్హం. విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను మేళవించి బోధించడంపై ప్రత్యక్షంగా తెలుసుకున్నామని అన్నారు. గూగుల్ క్లాస్ రూమ్ ను ఉపయోగించి బోధించడంపై అవగాహన వచ్చిందన్నారు. ఆంగ్ల భాష బోధనను ఆసక్తికరంగా మార్చడానికి బొమ్మలు, బుక్ రీడింగ్ బోధనా ప్రక్రియ ఎలా ఉపయోగించుకోవాలో తెలుసు కున్నామని తెలిపారు. పర్యటనలో భాగంగా అమెరికా దేశంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. మన దేశంలోని పండుగలు, కుటుంబ విలువలు, ఆహారపు అలవాట్లు లాంటి విషయాలను అక్కడ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అక్కడి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన బాగుంటుందని, ఉపాధ్యాయులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పునశ్చరణ పరీక్షలు నిర్వహిస్తారు. బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా బోధనోపకరణాలను ఎక్కువగా ఉపయోగిస్తుం టారని చెప్పారు. ఉన్నత పాఠశాలలో కెరియర్ స్పెషల్స్ అనే పేరుతో 11 రకాల వృత్తి విద్యా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేథస్సు లాంటి కోర్సులు కూడా నైన్త్ గ్రేడ్ నుండి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇవే కాక టీచింగ్ ప్రొఫెషనల్ కోర్స్, మార్కెటింగ్ కోర్స్, బిజినెస్ అండ్ స్పోర్ట్స్ లాంటి కోర్సులతో పాటు ఫ్యూచర్ హెల్త్ ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు, త్రీడీ ముద్రిత వస్తువులు కూడా పాఠశాలలోనే తయారు చేస్తున్నారు. ఒక వస్తువు రూపకల్పన నుంచి సమస్తం పాఠశాలల్లోనే జరగడం కనిపించిందన్నారు. అక్కడ విద్యార్థులందరికీ గూగుల్ క్రోమ్ బుక్ తప్పనిసరి ఉపకరణంగా ఉన్నది. దీని ద్వారానే విద్యాభ్యాసం, అభ్యసన కత్యాలు, మూల్యాంకనం కూడా జరుగుతున్నవి. అక్కడ విద్యార్థుల చేతిరాత మాత్రం ఆకర్షణీయంగా లేదు. క్రోమ్ బుక్ వాడకం ఎక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని అక్కడ ఉపాధ్యాయులు వివరించారని తెలిపారు. ప్రతి పాఠశాలలో అదనపు ఉపాధ్యాయులు సైతం అందుబాటులో ఉండడం గొప్ప విషయం. పాఠశాలల నిర్వహణ కోసం కావాల్సిన ఆర్థిక వనరులు అత్యధిక శాతం స్థానిక కమ్యూనిటీలే సమకూరుస్తాయట.

30 ఏళ్ల తరువాత మిత్రులతో...

పర్యటనలో భాగంగా నాలుగు రోజుల సెలవు దినాలను తన చిన్ననాటి మిత్రులు నగేష్ చంద్ర, వేణు మేడ, సత్య వర్ధన్ వెంపటి, సురేష్ బస్వలను సైతం రవి కలిశారు. 30 సంవత్సరాల తర్వాత మిత్రులను కలుసుకోవడం అత్యంత సంతోషకరంగా ఉందని రవి తెలిపారు. శాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజిల్స్, లాస్ వెగాస్, హాలీవుడ్ లాంటి నగరాలు, నయాగరా జలపాతం సందర్శించానని తెలిపారు.

సంక్రాంతి రవి గురించి క్లుప్తంగా..

సంక్రాంతి రవి వైరా మండలం లాలాపురంలో పుల్లయ్య, రామ తులసి దంపతులకు జన్మించారు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో చదివారు. తర్వాత వైరా లోని మధు విద్యాలయం, ఖమ్మం ఎస్ఎస్ఆర్జే కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేసిన ఆయన 2005లో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఆయన భార్య అనిత సైతం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావడం గమనార్హం. ప్రస్తుతం కొణిజర్ల మండలం పల్లిపాడులో ఇంగ్లీష్ టీచర్ (ఎస్ఏ)గా పని చేస్తున్నారు.

రెండు రోజుల పాటు ప్రజా విజయోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

డిసెంబర్ 1, 2న రెండు రోజుల పాటు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా డిసెంబర్ 1న పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట చౌరస్తా వద్ద గల టిసివి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో, డిసెంబర్ 2న మధిరలోని రెడ్డి ఫంక్షన్ హాలులో అంతడుపుల నాగరాజు సారథ్యంలో సాయంత్రం 6 గంటల నుండి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం నర్సాపురం గ్రామంలో గల సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మ్యాథ్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులతో మాథ్స్ టాలెంట్ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా గణిత ఉపాధ్యాయులు కృష్ణ, బొర్రయ్య, స్వామి వ్యవహరించారు. ఈ ప్రతిభా పరీక్షలో ఇంగ్లీష్ మీడియం నుండి విజేతలుగా నర్సాపురంలోని ఎస్ఎస్ఏఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో జి.నిశాల్, బి. డింపుల్ నిలిచారు. తెలుగు మీడియం విభాగంలో ఇదే పాఠశాల నుండి బి చాందినీ, వై. శ్రావ్యలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజేతలకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అనిల్ కుమార్ బహుమతులను అందజేశారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన దమ్మలపాటి

నవతెలంగాణ-ఇల్లందు



మున్సిపల్ భవన ఆవరణలో డ్వాక్రా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు అన్ని విభాగాల్లో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. మున్సిపల్ భవన ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేసినవారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, ఎకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, టిపిఓ సతీష్, మున్సిపల్ కౌన్సిలర్లు అంకెపాక నవీన్ కుమార్, కుమ్మరి రవీందర్, సయ్యద్ ఆజం, మెప్మా సభ్యులు నాగమణి, డ్వాక్రా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూనెం రమేష్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ న్యూడెమోక్రసీ నిరసన ప్రదర్శన

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు

నవతెలంగాణ-ఇల్లందు

సీపీఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ కామ్రేడ్ పూనెం రమేష్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ న్యూడెమోక్రసీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, రాష్ట్ర నాయకులు గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోల లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లాపురం గ్రామంలో అనారోగ్యంతో ఉన్న పూనెం రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారని ఇప్పటి వరకు రమేష్ ఆచూకీని పోలీసులు ప్రకటించక పోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రమేష్ ని కోర్టులో హాజరు పరిచే వరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, కొక్కు సారంగపాణి, గౌని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఇల్లందు

శరత్ మాక్స్ విజన్ వారి సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన కంటి పరీక్షలు విజయవంతమైనట్లు సీపీఎం పార్టీ నేతలు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్ కుమార్ లు తెలిపారు. డిసెంబర్ 20, 21 తేదీలలో ఇల్లందులో జరిగే సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభ లను పురస్కరించుకొని ఏలూరి భవన్ లో కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు.

కేబుల్ ఆపరేటర్ రమేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఇల్లందు



ఇటీవల సబ్ జైల్ బస్తీకి చెందిన కేబుల్ ఆపరేటర్ రమేష్(పుష్ప రాజ్) అనారోగ్యంతో మరణించిన విషయం విధితమే. వారి కుటుంబానికి పట్టణ కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.12.500 ఆర్థిక సహాయం అందించారు. సహాయం అందించిన ప్రతి ఒక్క ఆపరేటర్‌కు, ఎమ్మెఎస్ఓలకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ఫయాజ్, రాజేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొడాలి

నవతెలంగాణ-దుమ్ముగూడె

మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు కొడాలి శ్రీనివాస్ నాయకులకు సూచించారు . శుక్రవారం ఆయన మండలం లో కొనసాగుతున్న పార్టీ సభ్యత్వ ప్రక్రియను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొమరం దామోదర రావు, కోనేరు రాము, పార్టీ సీనియర్ నాయకులు, పాతూరి ప్రసాద్, శ్రీనివాస్ రావు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మద్ది సంగిరెడ్డి వర్ధంతి

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

గోళ్ళపాడు గ్రామానికి చెందిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,స్వతంత్ర సమరయోధుడు మద్ది సంగిరెడ్డి 40వ వర్ధంతిని శనివారం నిర్వహించినట్లు సీపీఎం సీనియర్ నాయకుడు, సంగిరెడ్డి కుమారుడు మద్ది వెంకటరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ వర్ధంతికి మండలంలోని సీపీఎం ముఖ్య నాయకులు హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంగిరెడ్డి అభిమానులు, సీపీఎం శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.



కేసీఆర్‌ది దొంగదీక్ష

- ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియానే తెలంగాణ ఇచ్చారు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

'కేసీఆర్ వల్లనే తెలంగాణ వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారు. కానీ కేసీఆర్ చేపట్టింది దొంగ దీక్ష. ఆ దీక్ష వల్ల తెలంగాణ రాలే.. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకున్న సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు" అని రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం పర్యటించారు. డిచ్‌పల్లి, ధర్పల్లిలో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు ధర్పల్లిలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. తెలంగాణ కోసం కోట్లాది మంది ప్రజలు ఉద్యమించారని, వేల మంది యువకులు బలిదానాలు చేసుకున్నట్టు తెలిపారు. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య ఇలా ఎందరో ప్రాణ త్యాగాలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు తమ పదవులను తృణప్రాయంగా వదిలి సోనియాకు తెలంగాణ ఆకాంక్షపై వివరించామని, దీంతోనే సోనియమ్మ చలించి తెలంగాణ ఇచ్చారని తెలిపారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని నేడు బావ, బామ్మర్దులు పిచ్చి కుక్కల్లా ప్రతిరోజూ తిట్ల పురాణం మొదలు పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

చివరి గింజ వరకు ధాన్యాన్ని కొంటాం : వ్యవసాయ కమిషన్ సభ్యులు కేబీఎన్ రెడ్డి

- రైతులు మోసపోకుండా చర్యలు తీసుకుంటాం



నవతెలంగాణ-వంగూరు

రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి వరకు పూర్తిగా మద్దతు ధరతో కొంటామని వ్యవసాయ కమిషన్ సభ్యులు కేబీఎన్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతిలో మోసపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ-గ్రేడ్ రూ.2,320 మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తూ కొనుగోలు చేస్తోందన్నారు. అందువల్ల రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు ముందుకు రావాలని సూచించారు. ఐకేపీ ఆధ్వర్యంలో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ కొనుగోళ్ల చేస్తామన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా కూడా త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ సురేంద్రరెడ్డి, వేమారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు సాయిబాబు, రాఘవేందర్, సీఈవో విష్ణుమూర్తి, గిరి, సురేష్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

మాడిపోయిన అన్నం పెడితే ఎట్లా తింటారు..? ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- మెస్ చార్జీలు పెంచినా భోజనం నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం
- గురుకుల హాస్టల్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-మునుగోడు

మాడిపోయిన అన్నం పెడితే విద్యార్థులు ఎలా తింటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మెస్ చార్జీలు పెంచినప్పటికీ నాణ్యతలేని కూరలు, సాంబారు ఎందుకు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. భోజన సమయంలో అన్నం, కూరలను పరిశీలించి అన్నం మాడిపోవడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలు, పెరుగు ఎక్కడి నుంచి వస్తున్నాయని, పెరుగు ఇంత పుల్లగా ఎలా ఉంటుందని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, పెంచిన తర్వాత కూడా భోజనం నాసిరకంగా ఉంటే ఊరుకోమని హెచ్చరించారు. హాస్టల్లో స్వయంగా విద్యార్థినులకు అన్నం, కూరలు వడ్డించి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగారు. మరోమారు హాస్టల్‌కి వస్తానని, భోజనం నాణ్యతతో లేకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో విజయ్ భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, జిట్టగోని యాదయ్య, పాల్వ జితేందర్ రెడ్డి, మేకల ప్రమోద్ రెడ్డి, ఎండి అన్వర్, నాయకులు ఆరేళ్ల సైదులు, మార్నేని గ్రాగోరి, సాగర్, జంగిలి నాగరాజు, జిట్టగోని సైదులు, పాపయ్య దుబ్బ ప్రభాకర్ ఉన్నారు.

పేదలకు కష్టమొస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులే..

దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న వామపక్షాల ప్రాధాన్యత

- ఓట్ల కోసం మతరాజకీయాలతో ఎంతకైనా తెగిస్తున్న బీజేపీ
- రాష్ట్రంలో ఫ్రీ బస్సు తప్ప ఏమీ అమలు కాలే..
- కమ్యూనిస్టుల ఉద్యమ ప్రారంభంతోనే లగచర్ల భూసేకరణ రద్దు..
- సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా పదో మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఎక్కడ పేదలకు కష్టమొచ్చినా.. ఎక్కడ పీడితవర్గాలకు ఆపదొచ్చినా.. వారికి అండగా మొదట నిలిచేది కమ్యూనిస్టులే. ప్రజల మధ్య వైషమ్యాలు రగుల్చుతూ ఓట్ల కోసం మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆగడాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుందీ ఎర్రజెండాలే. ప్రజాసామ్యంగా ఉంటామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకుంటుందీ వామపక్షాలే. పేదల సంక్షేమం, వారి హక్కుల రక్షణ కోసం నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ఉద్యమించేది ఎర్రజెండా పార్టీలే. అందులోనూ ముందు వరుసలో సీపీఐ(ఎం) ఉంటుంది' అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి వివరించారు. సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా పదో మహాసభ కరీంనగర్ పట్టణంలో శుక్రవారం ప్రారంభమైంది. రెండ్రోజులపాటు సాగే ఈ మహాసభలో తొలి రోజు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ముకుందలాల్ మిశ్రాభవన్ (కామ్రేడ్ సీతారాం ఏచూరినగర్) వరకు భారీ ప్రజాప్రదర్శన జరిగింది. అనంతరం కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య వేదికగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో టి.జ్యోతి ప్రసంగించారు.

కష్టజీవులు, శ్రామికుల పని ప్రదేశాల్లో ఎక్కడా మత విశ్వాసాలు ఉండవని, అందరూ కలిసే పని చేసుకుంటారని జ్యోతి తెలిపారు. అలాంటి పేదల్లో కూడా విద్వేషాలు రెచ్చగొట్టేలా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఇందుకు ఉత్తర భారతదేశంలోని 'గంగాజల కావడియాత్ర'నే అద్దం పడుతోందన్నారు. దేశ సమగ్రత అనే అంశాన్ని జోడించి ఉపా చట్టం కింద రాజద్రోహం కేసులు పెడుతూ తమను ప్రశ్నించిన న్యూస్‌క్లిక్ ఎడిటర్‌ను, పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ సాయిబాబాను జైల్లో పెట్టిందని గుర్తు చేశారు. అయితే, గుజరాత్ అల్లర్లలో బిల్కిస్‌భాను కేసులో హత్య, లైంగికదాడిన చేసి జైల్లో ఉన్న దోషులకు క్షమాభిక్ష పేరుతో బయటకు తీసుకొచ్చి ఊరేగించారని అన్నారు.



ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు తీసుకొచ్చిన మహిళా రెజ్లర్లు తమపై లైంగిక దాడికి పాల్పడుతున్న బీజేపీ నేతను శిక్షించాలని విరోచితంగా పోరాడితే చివరకు ఆ నేతకే వత్తాసుపలికిన తీరు అందరికీ తెలిసిందేనన్నారు. రాజ్యాంగ, లౌకిక హక్కులపైనా, రాష్ట్రాల అధికారాలపైనా కేంద్రం దాడులు చేస్తోందన్నారు. ఇలా ఎన్నో ఘటనల్లో దోషుల పక్షాన నిలబడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న తీరు బీజేపీ రాక్షస పాలనకు అద్దం పడుతోందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్షాల ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందని, కమ్యూనిస్టు ఉద్యమం బలపడితేనే బీజేపీలాంటి రాక్షస పార్టీకి చరమగీతం పాడగలుగుతామని అన్నారు.

మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి.భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, ఎస్.సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, జి.రాజేశం, నరేష్ పటేల్, మక్కపల్లి పూజ, శీలం అశోక్, సీనియర్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల్లో ఫ్రీ బస్సు ఒక్కటే అమలు

రాష్ట్రంలో గత ప్రభుత్వ నిరంకుశ పాలనను కాదనుకుని, ప్రజాస్వామ్య పాలన అందిస్తారని ఆశించి ఆరు గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం గట్టారని జ్యోతి అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా మహిళలకు ఫ్రీ బస్సు ఒక్కటే అమలు చేస్తోందని, రూ.500కే సిలిండర్, 200యూనిట్లలోపు ఫ్రీ కరెంటు, రూ.2లక్షల్లోపు రైతు రుణాల మాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజన బిడ్డలపై లాఠీ ఝుళిపించి అక్కడ నిర్బంధకాండను ప్రయోగించిందన్నారు. అక్కడి ప్రజానీకానికి తాము ఉన్నామంటూ మొదటగా వెళ్లింది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టుల రాకను అడ్డుకునేందుకు రాష్ట్ర సర్కారు శతవిధాలా ప్రయత్నించిందన్నారు. అయినా ఆ భూసేకరణను ఆపితేగానీ ఉద్యమం ఆపబోమంటూ తేల్చిచెప్పడంతో ప్రభుత్వం ఫార్మాసిటీ భూముల సేకరణను రద్దు చేసుకుందని తెలిపారు. ఈ ఘటనే కమ్యూనిస్టుల బలానికి అద్దం పడుతోందన్నారు.

గుజరాత్ గులాములు.. ఢిల్లీ కీలుబొమ్మలు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఆనవాళ్లే లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై ప్రతిఘటనకు పూనుకోవటం ద్వారా రేవంత్ సర్కార్ చర్యలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం 'దీక్షా దివస్' పేరిట రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సంబురాలు నిర్వహించారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కేటీఆర్... తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... కాంగ్రెస్ పార్టీపైనా, రేవంత్ సర్కార్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తూర్పారబట్టారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు సంబంధించిన వివిధ ఘట్టాలను ప్రస్తావిస్తూ భావోద్వేగంతో ప్రసంగించారు. లగచర్లలో భూ సేకరణను ప్రభుత్వం నిలిపేయటం బీఆర్ఎస్ విజయంగా ఆయన అభివర్ణించారు.

తెలంగాణ కోసం ఆనాడైనా, ఏనాడైనా కొట్లాడేది తమ పార్టీయేనని అన్నారు. రాష్ట్రం నుంచి కాంగ్రెస్ తరపున ఎనిమిది మంది, బీజేపీ తరపున మరో ఎనిమిది మంది ఎంపీలున్నా... తెలంగాణ కోసం పార్లమెంటులో ఏనాడూ కొట్లాడలేదని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అదానీ, ప్రధాని... ఇక్కడ అడుగు పెట్టే సాహసం చేయలేకపోయారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు తెలంగాణ మీద పట్టుకోసం ఆ రెండు పార్టీలు రాబందుల్లా వస్తున్నాయని హెచ్చరించారు. అంతేతప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టే వాళ్లే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మామూలుగా తీసుకోకూడదని అన్నారు. రాష్ట్రంలోని కవులు, కళాకారులు, మేధావులంతా తెలంగాణపై జరుగుతున్న దాడిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాల వారిలోనూ ఆత్మగౌరవ స్ఫూర్తిని రగిలించాలని పిలుపునిచ్చారు.

లగచర్ల భూ సేకరణకు సంబంధించి ప్రభుత్వం వెనక్కి పోవటమనేది బీఆర్ఎస్ విజయంగా కేటీఆర్ అభివర్ణించారు. అక్కడ బ్రిటీషర్ల కంటే ఎక్కువగా రేవంత్ సర్కార్ వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల పోలీసులు బందిపోట్లలాగా వ్యవహరించారని వ్యాఖ్యానించారు. అయినా ప్రజలు, బీఆర్ఎస్ పోరాట పటిమ ముందు ప్రభుత్వం తలవంచక తప్పలేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన రేవంత్‌ను తక్కువగా అంచనా వేయొద్దనీ, మరో రూపంలో భూములు లాక్కొనేందుకు వస్తారని హెచ్చరించారు. అందువల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

కాకతీయలో హాస్టల్ విద్యార్థి మృతి

అనారోగ్యానికి గురికాగా.. టాబ్లెట్స్ ఇచ్చిన వార్డెన్

- ఒకటో అంతస్తులో కుప్పకూలిన విద్యార్థి
- యాజమాన్యం తీరుపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కాకతీయ విద్యాసంస్థల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థి శివజాస్విత్‌రెడ్డి మృతిచెందాడు. అనారోగ్యానికి గురికావడంతో సిబ్బంది టాబ్లెట్స్ ఇచ్చి సరిపెట్టగా.. శుక్రవారం స్కూల్ 3వ అంతస్తు నుంచి కిందకు నడుచుకుంటూ వస్తుండగా ఒకటో అంతస్తులో కుప్పకూలాడు. వెంటనే పక్కనే ఉన్న ప్రతిభ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ కొడుకు మృతిచెందాడని కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శివ జాస్విత్‌రెడ్డి నిజామాబాద్ నగరంలో కాకతీయ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అనారోగ్యంతో వాంతులు కాగా, బాలునికి వార్డెన్ టాబ్లెట్ ఇచ్చారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఉదయం వస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు రావడంతో.. మూడో ఫ్లోర్‌లో ఉన్న శివ జాస్విత్ నడుచుకుంటూ వస్తుండగా.. ఒకడో ఫ్లోర్‌కు రాగానే కుప్ప కూలాడు. వెంటనే తండ్రి బాలున్ని ఎత్తుకొని పక్కనే ఉన్న ప్రతిభ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా బాలుడు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కుటుంబీకుల, బంధువుల ఆందోళన



పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం రాకుండా వార్డెన్‌ను పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడు వాంతులు చేసుకుంటే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా టాబ్లెట్లు మాత్రమే ఇచ్చానని, ఆ తర్వాత ఏమైందో తమకు తెలియదని వార్డెన్ చెప్పినట్టు తెలిపారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి చనిపోతే కనీసం చూసేందుకు కూడా యాజమాన్యం రాలేదన్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 4వ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, నగర సీఐ శ్రీనివాస్ రాజ్ ఘటనా స్థలానికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు. శివ జాస్విత్ రెడ్డి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగర సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్ఐ శ్రీకాంత్‌కు ఫిర్యాదు అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కాకతీయ విద్యాసంస్థల నిర్లక్ష్యం :ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్

కాకతీయ విద్యాసంస్థల నిర్లక్ష్యానికి ఓ విద్యార్థి బలయ్యాడని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆస్పత్రికి చేరుకొని కుటుంబీకులతో మాట్లాడారు. స్కూల్‌కు కూత వేటులో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నా కాకతీయ యాజమాన్యం సమయానికి స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మృతికి కారణమైందని విగ్నేష్ అన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

వామపక్షాల పోరాట ఫలితమే...

- తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ కోసం ఆగస్టు ఒకటిన జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మొత్తం 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయడానికి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితం, కృషి కారణమని తెలిపింది. ఇది లగచర్ల ప్రాంత ప్రజల విజయమని పేర్కొంది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూసేకరణ ప్రజాభిప్రాయం సందర్భంగా లగచర్ల వెళ్లిన అధికారులు, రైతుల మధ్య జరిగిన తోపులాట, ఘర్షణ ఫలితంగా ప్రభుత్వం ఆ ప్రాంతంలో నిర్బంధం విధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న 10 వామపక్ష పార్టీల రాష్ట్ర బృందం లగచర్ల, సమీప గ్రామాలను సందర్శించి, ప్రజలను ప్రత్యక్షంగా అనేక విషయాలను అడిగి తెలుసుకుందని పేర్కొన్నారు. ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అక్కడ పరిస్థితులను వివరిస్తూ వినతి పత్రం సమర్పించామని వివరించారు. ముఖ్యమంత్రి స్పందించి తక్షణమే ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్టుగానే ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని గతంలోనే విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలనీ, పోలీస్ క్యాంపులను ఎత్తేయాలనీ, వరికోత యంత్రాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. వ్యవసాయానికి ఉపయోగ పడే భూముల్లో పరిశ్రమల నిర్మాణాన్ని విరమించుకోవాలనే డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లను కూడా తక్షణమే పరిష్కరిం చాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దపులి దాడిలో మహిళ మృతి

- కాగజ్‌నగర్ డివిజన్‌లో నాలుగేండ్లలో ముగ్గురిని చంపిన పులులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో శుక్రవారం పెద్దపులి దాడిలో ఓ మహిళ మృతిచెందింది. పత్తి ఏరేందుకు చేనుకు వెళ్లిన ఆమెపై పెద్దపులి వెనుక నుంచి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణం కోల్పోయింది. వివరాలిలా ఉన్నాయి. కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి(22), ఇతర కూలీలతో కలిసి ఈజ్‌గాం బెంగాలీ క్యాంప్ నెంబర్-6 నుంచి 11కు వెళ్లే దారిలో పత్తి ఏరేందుకు వెళ్లింది. పత్తి ఏరుతుండగా.. చేనులో అప్పటికే మాటు వేసి ఉన్న పెద్దపులి ఒక్కసారిగా లక్ష్మిపై దాడి చేసింది. మెడ భాగంలో పంజాతో దాడి చేయగా కేకలు వేసింది. ఈ కేకలు విన్న తోటి కూలీలు పెద్దపులిని చూసి భయపడి పరుగులు తీశారు. కొద్దిసేపటికి గ్రామస్తులు, పక్క చేల వారు రావడంతో అందరూ కలిసి చేనులోకి వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మి తీవ్ర గాయాలతో ఉంది. వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు, అటవీ అధికారి నీరజ్ టోబ్రేవాల్ వచ్చి బాధిత కుటుంబానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో అటవీ డివిజన్ కార్యాలయం ముందు భారీ బందోబస్తు చేపట్టారు.

ఇప్పటి వరకు ముగ్గురు మృతి

2020 నుంచి ఇప్పటి వరకు కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల బారిన పడి ముగ్గురు మృతిచెందారు. నాలుగేండ్ల కిందట ఇదే రోజున పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల పులి దాడిలో మృతిచెందింది. దీనికి ముందు అదే ఏడాది నవంబర్ 11వ తేదీన దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విఘ్నేష్ పులి బారిన పడి ప్రాణం కోల్పోయాడు. ప్రస్తుతం లక్ష్మి మృతితో కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులుల బారిన పడి ప్రాణం కోల్పోయిన వారి సంఖ్య మూడుకు చేరుకుంది.

సాగర్ డ్యాంపై ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంపై శుక్రవారం ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. అత్యవసర పరిస్థితుల్లో, ఉగ్రవాదులు ప్రాజెక్టులపై దాడులను నిర్వహిస్తే ఎలా ఎదుర్కోవాలని అంశంపై ప్రధాన ప్రాజెక్టుల వద్ద, దేవాలయాలు, అత్యంత సున్నితమైన ప్రదేశాల వద్ద ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ నిర్వహిస్తుంటాయి. ఈ సందర్భంగా సాగర్ ప్రధాన డ్యాంపై, డ్యామ్ గ్యాలరీస్ వద్ద, ప్రధాన డ్యామ్‌కు ఇరువైపులా, 420 గ్యాలరీ వద్ద, ప్రధాన జల విద్యుత్ కేంద్రం పరిసరాలలో ఆక్టోపస్ దళాలు పలు విధాలుగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఈ మాక్ డ్రిల్‌లో స్థానిక పోలీసులు, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భద్రత దళాలు పాల్గొన్నాయి.

టర్కీ - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టర్కీ - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకాంక్షించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఇండియాలోని టర్కీ రాయబారి ఫిరాట్ మంత్రితో మర్యాదపూ ర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. 34 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, 28 నర్సింగ్ కళాశాలలు, పారామెడికల్ కాలేజీలు వైద్యవిద్యనందిస్తున్నాయని చెప్పారు. పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 74 ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వరి దిగుబడి

66.7 లక్షల ఎకరాల్లో సాగు

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు : నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో ఎన్నడూ ఏ రాష్ట్రంలో పండని విధంగా ఈ వానాకాలంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. 66.7లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని, ఇది జీవిత కాల రికార్డు అని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల "రైతు పండుగ"లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. స్టాళ్లను పరిశీలించారు. అనంతరం అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా వరిసాగు చేసి రాష్ట్రం మొదటి స్థానం సాధించిందన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొంటుందని తెలిపారు. రైతు పండుగ ఏర్పాట్లు, స్టాళ్ల చాలా అద్భుతంగా ఉన్నాయని, ఇందుకు కారణం వ్యవసాయ శాఖ మంత్రి అనుభవం, వారి దక్షత అని కొనియాడారు. రాష్ట్ర పరిస్థితులు ఎలా ఉన్నా ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాతి, వ్యవసాయ పక్షపాతిగా ముందుకెళ్తుందని చెప్పారు. నూతన సాంకేతిక పద్ధతులు, పరిజ్ఞానంతో సాగును ముందుకు తీసుకెళ్తామన్నారు. గత పాలకులు రుణమాఫీ చేస్తామని చెప్పి మొదటి ఐదు సంవత్సరాల్లో వడ్డీ మాత్రమే మాఫీ చేశారని, తర్వాత అరకొర రుణమాఫీ చేసి చేతులెత్తేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం 18 వేల కోట్లతో 21 లక్షల మంది రైతుల రుణమాఫీ చేసిందని, మిగిలిన కొంత మంది రైతుల రుణమాఫీపై సీఎం ఒక ప్రకటన చేస్తారని తెలిపారు.

రైతులకు అండగా ఉండేందుకే ఈ సదస్సు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఏది మంచిదో రైతులే చెప్పాలని, మీ సలహాలు సూచనలు వినడానికే ఈ రైతు సదస్సును ఏర్పాటు చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల అభిప్రాయం మేరకు వారికి మేలు చేసే పథకాలనే కొనసాగిస్తామన్నారు. రైతులు పామాయిల్ సాగు చేయాలని, నాలుగేండ్లు ప్రభుత్వమే పెట్టుబడి భరిస్తుందని చెప్పారు. ఈ నాలుగు సంవత్సరాలు అంతర పంటలు సాగు చేసి అత్యధిక లాభాలు పొందొచ్చని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పామాయిల్ మిల్లులు ఏర్పాటు చేస్తామని, పామాయిల్ పంటను రైతు ఇంటి వద్దనే కొంటామని అన్నారు. వలస జిల్లాగా పేరు పడిన మహబూబ్‌నగర్ జిల్లాకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చాలా ముఖ్యమైనదని, దీనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పూర్తి చేయించాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. ఎండాకాలం పంట కోతలు మార్చి లోపలే ప్రారంభిస్తేనే నూకలు తక్కువ అవుతాయని, లేకుంటే బియ్యంలో నూకల శాతం అధికంగా ఉంటుందని అన్నారు. అందువల్ల ఎండాకాలం పంటకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో త్వరగా నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి.మధుసుధన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, డా.వంశీకృష్ణ, పర్ణిక రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర రైతు సంఘాల అధ్యక్షులు కోదండరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, కమిషనర్ గోపి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



భర్తకు భార్యా, భార్యకు భర్త... చివరి వరకు ఈ బంధమే తోడుండేది. అయితే చాలా మంది భర్తలు తమ భార్యలను చులకనగా చూస్తారు. ఆమె పక్కన ఉన్నప్పుడు నన్ను వదిలి ఎక్కడకు పోతుందిలే అనే భావనతో ఉంటారు. అదే ఆమె ఒక్కసారి వదిలి వెళ్లిపోతే అప్పుడు ఆమె విలువేంటో తెలుస్తుంది. సాధారణంగా మగవారు భార్య తప్ప ప్రపంచం మొత్తం మనదే అనుకుంటారు. కానీ మహిళలు భర్తే తమ ప్రపంచంగా బతుకుతారు. ఇది భర్తలకు అర్థం కాదు. 'ఆమె నన్ను ఏమీ చేయలేదు, ఏమన్నా అలా పడుంటుంది' అనే ఆలోచనే ఉంటుంది. అందుకే ఆమంటే అంత చులకన. ఇలాంటి భర్తను ఆమె మాత్రం ఎన్ని రోజులని భరిస్తుంది. ఓపిక నశిస్తే ఏం చేస్తుందో తెలియజేసే కథనమే ఈ వారం ఐద్వా అదాలత్...

ఆమె ఓపిక నశిస్తే..?

రాధికకు సుమారు 32 ఏండ్లు ఉంటాయి. 18 ఏండ్ల కిందట సందీప్‌తో పెండ్లి జరిగింది. వీరికి ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి. రాధిక వాళ్ల పెద్దమ్మకు ముగ్గురు మగపిల్లలు. ఆడపిల్లలు లేకపోవడంతో రాధికను దత్తత తీసుకుంది. అప్పటి నుండి వాళ్ల దగ్గరే పెరిగింది. పెండ్లి కూడా వాళ్లే చేశారు. అయితే ఆమెను పెద్దగా చదివించలేదు. సమాజం అంటే ఏమిటో తెలియకుండా, ఆ ఇల్లే ప్రపంచంగా పెరిగింది.

పెండ్లి చేసినప్పుడు 20 తులాల బంగారం, ఐదు లక్షల కట్నం, కిలో వెండి ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు. సందీప్ బీఎడ్ చేసి టీచర్‌గా ఉద్యోగం కోసం చాలా ప్రయత్నించాడు. కానీ రాలేదు. అతనికి ఓ తమ్ముడు, ఇద్దరు అక్కలున్నారు. సందీప్‌కి ఉద్యోగం రాకపోవడంతో రాధిక అన్నలు అతనికి పదిహేను లక్షలు ఇచ్చి బంగారం షాపు పెట్టించారు. అది బాగా నడిచింది. సందీప్‌తో పాటు వాళ్ళ తమ్ముడు కూడా షాపులో ఉండేవాడు. లాభాలు కూడా బాగా వచ్చాయి. అతని దగ్గర ఉన్న డబ్బుతో పాటు మరో పది లక్షలు అప్పు చేసి రెండు షాపులు కొన్నాడు. ఆర్థికంగా బాగానే ఉన్నారు.

కానీ రాధికను పెద్దగా పట్టించుకోడు. పెండ్లి అయిన దగ్గర నుండి 'నీకు చదువు రాదు, ఏమీరాదు. దేనికీ పనికి రావు' అంటూ అందరి ముందు అవమానించేవాడు. ఆమెను ఓ మనిషిగానే చూడడు. ఎప్పుడూ తిట్టడం, కొట్టడం. రాధికకు సరదాగా బయటకు వెళ్లాలని ఉండేది. పెండ్లయి ఇన్నేండ్లు అవుతున్నా ఒక్కసారి కూడా ఆమెను బయటకు తీసుకెళ్లలేదు. పైగా చాలా బాధపెట్టేవాడు. ఆ బాధలు భరించలేక పుట్టింటికి వెళదామన్నా వెళ్లలేకపోయేది. పెంచిన పెద్దమ్మ వాళ్లు తనకోసం ఎన్నో చేశారు. భర్తను వదిలి వెళితే ఏమనుకుంటారో అని భయం.

కొన్నేండ్లకు సందీప్ తాగుడు, పేకాట, ఐపీఎల్ బెట్టింగ్స్ అంటూ తిరుగుతూ షాపును నిర్లక్ష్యం చేశాడు. దాంతో నష్టాలు వచ్చాయి. అప్పులు పెరిగిపోయాయి. దాంతో రాధిక బంగారం మొత్తం తీసుకెళ్లి అప్పులు తీర్చాడు. అయినా ఆమె ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆమె పెద్దమ్మ వాళ్లే మళ్లీ కొంత సాయం చేసి వెండి వస్తువులు ఇప్పించి వాటితో వ్యాపారం చేసుకోమన్నారు. కానీ సందీప్ అది కూడా సరిగ్గా చేయలేకపోయాడు. అప్పులు ఇంకా

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

పెరిగిపోయాయి. అతను ఇంత చేసినా రాధిక ఎంతో సహనంగా ఉండేది. అయినా ఆమెను ఏదో ఒకటని బాధపెడుతూనే ఉన్నాడు.

సందీప్ అప్పుల్లో కొంత అతని తమ్ముడు తీర్చాడు. దానికి బదులుగా షాపు, కారు తీసుకున్నాడు. ఇవేవీ రాధికకు చెప్పలేదు. ఒకవేళ ఆమె ఏమైనా అడిగినా 'నీకెందుకు చెప్పాలి' అంటాడు.

అప్పుల వాళ్లు ఇంటికి వచ్చి రాధికను బెదిరిస్తున్నారు. సందీప్ ఇవేవీ పట్టించుకోకుండా మద్యానికి బానిసయ్యాడు. రాధిక ఉద్యోగం చేస్తానంటే 'చదువు రాదు, ఏమీ చేయలేవు, నిన్ను పెండ్లి చేసుకోవడం వల్లే నా జీవితం ఇలా తయారయ్యింది' అంటూ తిట్టేవాడు. అతని అక్కలు కూడా రాధికనే నానా మాటలు అనేవారు. శారీరకంగా, మానసికంగా హింసించేవారు. పెద్దమ్మ వాళ్ల దగ్గర డబ్బులు తెచ్చి పిల్లల ఫీజులు కట్టేది. ఇలా ఇంట్లో పరిస్థితి దారుణంగా తయారయ్యింది. తినడానికి తిండి కూడా లేదు.

రాధిక తన మెడలోని తాళిపెట్టి ఇంట్లోకి సరుకులు తెచ్చింది. సందీప్ మాత్రం భార్యా పిల్లలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. రాధిక మూడు నాలుగు సార్లు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఇరు కుటుంబాల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. అప్పుడు అందరూ రాధికనే తప్పు పట్టారు. దాంతో సందీప్ మరింత రెచ్చిపోయాడు. నోటికి వచ్చినట్టు మాట్లాడేవాడు. పిల్లలు కూడా ఆ మాటలు భరించలేకపోయేవారు. ఎప్పుడూ అసభ్య వీడియోలు చూసేవాడు. వాటి ప్రభావం పిల్లలపై పడుతుందని రాధిక అంటే పెద్ద గొడవ చేసి పంచాయితీ పెట్టించాడు. వీటన్నింటి ప్రభావం రాధిక ఆరోగ్యంపై పడింది. అయినా ఆమెను పట్టించుకోలేదు. పైగా తనను దగ్గరకు రానీయడం లేదంటూ ఊరంత చెప్పుకుంటూ తిరిగేవాడు.

ఈ విషయం గురించి సందీప్ అక్కలు కూడా ఆమెను నిలదీశారు. ఒకపక్క రాధిక నడవలేని స్థితిలో ఉంది. దీని గురించి మాత్రం ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరకు తన 14 ఏండ్ల పాప 'అమ్మా నువ్వు నాన్నతో ఎందుకు ఉండటం లేదు. నాన్నకు కావల్సింది అదే కదా! ఆయనకు కావల్సింది చేస్తే సరిపోతుంది కదా!' అన్నది. ఆ మాటలకు రాధిక గుండె పగిలిపోయింది. 'నా బతుకు ఎందుకు ఇలా అయిపోయింది. భార్యగా కాదు కదా నన్ను ఓ మనిషిగా కూడా చూడడం లేదు. ఇక నేను ఇతనితో బతకలేను' అని నిర్ణయించుకుంది. పిల్లల్ని తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది. ప్రస్తుతం ఇల్లు అద్దెకు తీసుకొని పిల్లలతో ఉంటుంది. ఐద్వా లీగల్‌సెల్ గురించి తెలుసుకొని తనకు విడాకులు ఇప్పించమంటూ వచ్చింది. మేము ఫోన్ చేసి సందీప్‌ను పిలిపించాము. రాధిక చెప్పిన విషయాల గురించి అడిగితే అంతా నిజమే అని ఒప్పుకున్నాడు.

'నా వల్ల ఆమె ఇంత బాధపడుతుందని అనుకోలేదు. నా కుటుంబం లేకుండా నేను బతకలేను. నా తప్పులు సరి చేసుకుంటాను. ఆమెను నాతో పాటు ఊరికి తీసుకెళతాను పంపించండి' అన్నాడు. మరి అప్పుల సంగతేంటి అంటే, 50 లక్షల అప్పులు ఉన్నాయి. నేను వాటిని సెటిల్ చేశాను. అప్పులు తీర్చడానికి 10, 15 ఏండ్ల సమయం తీసుకున్నాను. దానికి అందరూ ఒప్పుకున్నారు. ఉద్యోగం కూడా చేస్తాను. నేను తప్ప ఆమెకు ఇంకో ఆప్షన్ లేదు అనుకున్నాను. మా పెండ్లి జరిగిన ఇన్నేండ్లకు ఆమె ఇలా మొదటి సారి ఇల్లు విడిచి వచ్చేసింది.
తను వెళ్లిపోయిన తర్వాతనే తన విలువేంటో తెలిసింది. మీ వల్ల ఆమెను మళ్లీ కలిసే అవకాశం వచ్చింది. ఇక మీదట ఆమెకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను' అన్నాడు.

రాధిక మాత్రం 'అతను నన్ను ఓ మనిషిగానే చూడలేదు. తాగొచ్చి ఇష్టం వచ్చినట్టు తిడతాడు, కొడతాడు. భార్యా, పిల్లలంటే ప్రేమ, బాధ్యత వంటివి ఏమీ లేవు. అలాంటి వ్యక్తితో ఇక నేను బతకలేను. అతనిపై నాకు నమ్మకం లేదు. ఏదో ఒక పని చేసుకొని నా పిల్లల్ని బతికించుకుంటాను. ఆ ధైర్యం నాకు ఉంది. చదువుకున్న వాళ్లు మాత్రమే ఒంటరిగా బతకగలరా! నేను కూడా బతకగలనని నిరూపించుకుంటాను. దయచేసి నాకు అతనితో విడాకులు ఇప్పించండీ' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

మేము ఇద్దరికీ ఆరు నెలల సమయం ఇచ్చాము. సందీప్‌తో 'నిజంగా మీ భార్యపై ప్రేమ వుంటే బాధ్యతగా ఉండండి. ఆమెకు మీపై నమ్మకం వస్తే అప్పుడు ఆమే మీతో వస్తుంది. ఇష్టం లేకుండా ఇప్పుడు బలవంతంగా మీతో పంపించలేము' అన్నాము. రాధికతో 'ఆరు నెలలు సమయం ఉంది కాబట్టి బాగా ఆలోచించుకోండి. కోర్టులో విడాకులు కూడా అంత తొందరగా రావు. అతను మారతానంటున్నాడు. అతనిపై మీకు నమ్మకం వచ్చిన తర్వాతనే అతనితో వెళ్లొచ్చు. లేదంటే మీ బతుకు మీరు బతకండి. మీకు మా సహకారం ఉంటుంది' అని చెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి
9948794051

ఈజీగా తీయొచ్చు..



వెల్లుల్లి గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. వెల్లుల్లి లేకుండా వంటలను ఊహించుకోలేం. వేపుళ్లకు, చట్నీలకు మరింత రుచిని జోడించేది ఇవే. వీటితో కేవలం రుచి మాత్రమే కాదు ఆరోగ్యం కూడా. వెల్లుల్లి తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ఈ విషయం పక్కన పెడితే.. వెల్లుల్లి తొక్క తీయడం చాలా కష్టం. ఈ విషయం ప్రతిరోజూ వంట చేసేవారికి అర్థమవుతుంది. . ఒకవేళ వెల్లుల్లి తొక్క తీసేటప్పుడు దాని జిగురు గోళ్లకు కూడా అంటుకుంటుంది. ఒకటి, రెండు అయితే తీయవచ్చు కానీ.. పచ్చళ్లు పెట్టేటప్పుడు మాత్రం చాలా ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని టిప్స్ ఉపయోగించి వెల్లుల్లి తొక్కలను ఈజీగా తీయవచ్చు. ఆ టిప్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

- వెల్లుల్లి తొక్కలు ఈజీగా రావడానికి మైక్రోవేవ్ చక్కగా సహాయ పడుతుంది. మీకు ఎన్ని వెల్లుల్లి రెబ్బలు కావాలో వాటిని మైక్రోవేవ్‌లో వేడి చేయాలి. ఆ తర్వాత బయటకు తీసి.. వేళ్లతో తీస్తే తొక్క వచ్చేస్తుంది.
- ఒక వెల్లుల్లి పాయ తీసుకుని దాని చేతితో గట్టిగా ప్రెస్ చేయండి. ఆ తర్వాత మూత ఉన్న ఒక బాక్స్ తీసుకుని అందులో వెల్లుల్లి పాయల్ని వేసి గట్టిగా షేక్ చేయండి. ఇలా చేసినా వెల్లుల్లి రెబ్బలు వచ్చేస్తాయి.
- వెల్లుల్లి రెబ్బ తీసుకుని చాకుతో ప్రెస్ చేయండి. ఆ తర్వాత చేతితో ప్రెస్ చేసి తీసేస్తే.. తొక్క ఈజీగా వచ్చేస్తుంది.
- వెల్లుల్లి మీద ఉండే పొట్టు ఈజీగా రావాలంటే వాటికి ఆయిల్ రాసి.. ఎండలో ఆరబెట్టండి. ఆ తర్వాత తీస్తే.. పొట్టు ఈజీగా వస్తుంది.

భగ్గుమన్న పార్లమెంట్

(మొదటిపేజి తరువాయి)

ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. కేంద్రం సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో పది నిమిషాలకే సభను మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభాల్ హింసపై ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. మరోవైపు నేషనల్ ఏఆర్‌టీ అండ్ సరోగసీ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను నియమించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు. పది నిమిషాల్లో సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే కొనసాగింది. సభను చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రారంభించగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 17 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. దీంతో ప్రతిపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. 13 నిమిషాల్లోనే సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఢిల్లీలో శాంతి భద్రతలపై ఆప్ ఆందోళన

ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో ఆప్ ఎంపీలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా తదితరులు ప్లకార్డులు చేతబూని మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తటస్థంగా వ్యవహరించాలి



న్యూఢిల్లీ : హింస, ప్రాణ నష్టం, అరెస్టులు, మతోన్మాద ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిగా తటస్థంగా వుంటూ శాంతి సామరస్యతలను కాపాడాల్సిందిగా ఉత్తరప్రదేశ్ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం కోర్టు శుక్రవారం కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. 16వ శతాబ్దంలో ఆలయాన్ని ధ్వంసం చేసి దానిపై మసీదును నిర్మించారనే వాదనలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, తమ ముందున్న కార్యకలాపాలను నిలిపివేయాల్సిందిగా సివిల్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో వుంచాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, మసీదును నిర్వహించే సంభాల్ షాహి జామా మసీద్ కమిటీపై సుప్రీం కోర్టు పలు చట్టపరమైన చర్యలు తీసుకుంది. సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని లేదా అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని కోరుతూ నవంబరు 19న సివిల్ కోర్టు పరోక్షంగా ఇచ్చిన ఆదేశాలను తోసిపుచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధనలోని 9వ ఆదేశాల కింద కమిటీ పిటిషన్ దాఖలు చేయవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటిషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణా కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6తో ప్రారంభమయ్యే వారంలో కమిటీ పిటిషన్‌ను విచారణకు చేర్చాలని సీజేఐ ఆదేశించారు.

జీడీపీ ధమాల్



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ ఉరుకులు పెడుతోందన్న బీజేపీ పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలు, రిపోర్టులు వాస్తవ రూపంలో కార్యరూపం దాల్చడం లేదు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి మందగించడమే ఇందుకు నిదర్శనం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృద్ధి ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేండ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్‌బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఓ) శుక్రవారం జీడీపీ రిపోర్ట్‌ను వెల్లడించింది. మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జీడీపీ ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమయ్యింది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జీడీపీ 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. ఆర్‌బీఐ అంచనాలు మించి జీడీపీ పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిన్నిటీ పరిశీలనలోకి తీసుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ బయటికి కనబడుతున్నంత బలంగా ఏమీ లేదని.. మందగమనం చాయలు స్పష్టమవుతున్నాయి. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరకులు, సేవల మొత్తం విలువను జీడీపీగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జీడీపీ పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం.

రెండంకెల నుంచి మైనస్‌లోకి..

గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం 3.5 శాతం వృద్ధితో మెరుగైన ప్రగతిని కనబర్చింది. ఈ రంగం ఇంతక్రితం త్రైమాసికంలో 2 శాతంగా, గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 1.7 శాతంగా నమోదయ్యింది. గనుల రంగం గతేడాది రెండంకెల పెరుగుదలను సాధించగా.. ఈ ఏడాది ప్రతికూల వృద్ధిలోకి జారుకుంది. ఈ రంగం క్రితం క్యూ2లో మైనస్ 0.1 శాతంతో ప్రతికూల వృద్ధిని చవి చూసింది. ఏడాదిక్రితం ఈ రంగంలో 11.1 శాతం పెరుగుదల ఉంది. అదే సమయంలో తయారీ రంగం 14.3 శాతం వృద్ధిని సాధించగా.. గడిచిన క్యూ2లో ఏకంగా 2.2 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం వృద్ధి 10.5 శాతం నుంచి 3.3 శాతానికి క్షీణించింది. క్రితం క్యూ2లో నిర్మాణ రంగం 7.7 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 13.6 శాతం పెరుగుదలను సాధించింది. ఇదే సమయంలో వాణిజ్యం, హోటళ్లు, రవాణ రంగాల జీడీపీ 4.5 శాతంగా ఉండగా.. గడిచిన క్యూ2లో 5.7 శాతానికి పెరిగింది. ఫైనాన్సియల్, రియల్ ఎస్టేట్, నైపుణ్యాల సర్వీసులు ఏడాదికేడాదితో పోల్చితే 6.2 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగాయి. ఊహించినదానికంటే బలహీనమైన వృద్ధి చోటు చేసుకోవడంతో భారత ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను పెంచనుందని నిపుణులు పేర్కొంటున్నారు.. ముఖ్యంగా, తయారీ, మైనింగ్ లాంటి కీలక రంగాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతోందన్నారు.

కీలక రంగాల నేల చూపులు

దేశ ఆర్థికవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో కీలక రంగాల వృద్ధి 3.1 శాతానికి పరిమితమయ్యింది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు ఏకంగా 12.7 శాతం శాతం వృద్ధిని సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఈ రంగాలు 4.1 శాతం వృద్ధికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 8.8 శాతం శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

సీపీఎస్, యూపీఎస్ వద్దు..ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

(మొదటిపేజి తరువాయి)

భార్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పాఠశాలల మూసివేతను ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేసి, కార్పొరేట్లకు లాభాలను అందించే జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ చందాతో కూడిన పింఛన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేయాలని, ఇరవై ఏండ్లుగా చేస్తున్న పోరాటానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పింఛను పథకాన్ని (యూపీఎస్) ప్రతిపాదించిందని అన్నారు. అయితే పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించడం మినహా మరే పథకాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు, ఉపాధ్యాయులు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, పోరాటంతోనే ఓపీఎస్ సాధించుకోగలమని స్పష్టం చేశారు.

వామపక్ష ఎంపీల సంఘీభావం

ఉపాధ్యాయుల ధర్నాకు సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు శివదాసన్, సీపీఐ(ఎంఎల్) లోక్‌సభ ఎంపీలు సుధామ ప్రసాద్, రాజారాం సింగ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌ఈపీ ప్రజల కోసం లేదని ,కార్పొరేట్ల కోసం మాత్రమే ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా



సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ అనుకూల విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) అధ్యక్షుడు సుభాష్ లాంబ, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.పి సాను, మయూఖ్ బిశ్వాస్, విద్యావేత్తలు మధుప్రసాద్, నందితా నారాయణ్‌లు ప్రసంగిం చారు. తెలంగాణ రాష్ట్రం నుంచి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కా శ్రీనివాస చారి, సృజన్ కుమార్, ఎల్లయ్య, కిరణ్ కుమార్, టి కుమార్, రమేష్, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంపై సమాచారం లేదు

(మొదటిపేజి తరువాయి)

ఎలాంటి సమాచారం అమెరికాలోని భారతీయ ఎంబసీకి అందలేదని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రశ్నించగా, అక్కడి హిందువులు, ఇతర మైనారిటీలు ఎదుర్కొంటున్న బెదిరింపుల గురించి బంగ్లాదేశ్ ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వం మాట్లాడుతోందని, తీవ్రంగా నిరసన కూడా తెలియచేశామని చెప్పారు. ఈ విషయంలో మన వైఖరి చాలా స్పష్టంగా వుందన్నారు. మైనారిటీలందరినీ కాపాడాల్సిన బాధ్యత అక్కడి తాత్కాలిక ప్రభుత్వంపై వుందన్నారు. తీవ్రవాద భావజాలం కలిగిన సంఘటనలు, హింస, కవ్వింపు చర్యలు పెరగడం పట్ల ఆందోళన చెందుతున్నామ న్నారు. ఈ పరిణామాలను కేవలం మీడియా అత్యుత్సాహంగా కొట్టిపారేయలేమని అన్నారు. సామాజిక సేవలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సంస్థ ఇస్కాన్ అని పేర్కొన్నారు. మైనారిటీల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా బంగ్లాదేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. చిన్మయ్ దాస్ అరెస్టు గురించి స్పందిస్తూ, వ్యక్తులకు సంబంధించిన వరకు చూసినట్లైతే, చట్టపరమైన ప్రక్రియలు కొనసాగుతు న్నాయన్నారు. అంతా కూడా స్వేచ్ఛగా, సక్రమంగా పారదర్శకంగా జరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం

(మొదటిపేజి తరువాయి)

ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఏ దశలోనూ లబ్ధిదారుకు ఇబ్బంది కలగవద్దన్నారు. అదే సమయంలో శాఖాపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. పథకం సమర్థమంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలన్నారు. ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా తెలంగాణ తల్లి విగ్రహం

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

హైదరాబాద్‌లోని సెక్రటరియేట్‌లో డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్న సంగతి తెలిసిందే. అందుకు సంబంధించిన తెలంగాణ తల్లి విగ్రహం రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో ఓ విగ్రహ రూపకర్త వద్ద రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర తయారవుతున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిశీలించారు. శిల్పిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వెంటన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

ఈ ఫలితాలు పెద్ద కుదుపే

(మొదటిపేజి తరువాయి)

ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. 'ఇండియా' కూటమి పార్టీలు రెండు రాష్ట్రాల్లో మాత్రమే ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారుతుంది"

ఈ ఏడాది పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు


వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత

గ్రేడింగ్ విధానంలో మార్పులేదు : విద్యాశాఖ సవరణ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 20 ఇంటర్నల్ మార్కులుంటాయని వివరించింది. 80 మార్కులకే వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని వివరించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం సవరణ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. వంద మార్కులకు వార్షిక పరీక్షలుంటాయని ప్రకటించిన మరుసటి రోజే వెనక్కి తగ్గడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. వంద మార్కులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. గ్రేడింగ్ విధానం అమల్లో ఎలాంటి మార్పు లేదని వివరించారు. పదో తరగతి పరీక్షల్లో చేసిన మార్పుల పట్ల ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం గమనార్హం. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే విధానం అమల్లోకి రానుంది. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు మాత్రం 12 పేజీల చొప్పున వేర్వేరుగా బుక్‌లెట్‌లను ఇస్తారు.







అభివాదం చేస్తున్న తమ్మినేని, జూలకంటి, మల్లు నాగార్జున రెడ్డి, మల్లు లక్ష్మి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, శేఖర్ రావు తదితరులు

అదానీతో దోస్తీ వద్దు..

రూ.1200 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేయండి

అన్ని వర్గాలకు అండగా ఎర్రజెండా

- ఫార్మా కంపెనీ రద్దు నిర్ణయం పట్ల హర్షం
- హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి: సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా 3వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

అదానీతో దోస్తీ వద్దని, ఫార్మా కంపెనీ కోసం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా మూడో మహాసభ సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ కుటుంబ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, అందుకే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారంటీ స్కీములు ఇవ్వడంతో పాటు ఏడో గ్యారంటీ కూడా ఇస్తున్నాం.. అదే స్వేచ్ఛ అని ప్రకటించి ప్రగతిభవన్ చుట్టూ కంచెను తొలగించిందని చెప్పారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడిని ఖండించామన్నారు. ఫార్మా కంపెనీ కోసం భూములు అమ్మం అని ఆ గ్రామస్తులు తిరగబడితే వారిపై కేసులు నమోదు చేశారన్నారు. ఈ క్రమంలో వామపక్ష పార్టీల నేతలు ఆ గ్రామాన్ని సందర్శించి ఇంటింటికీ తిరిగి వాస్తవాలను తెలుసుకున్నామని చెప్పారు. ప్రతిఏటా రెండు పంటలు పండే పచ్చని పొలాలు ఉన్నాయని గ్రామస్తులు చూపించారని తెలిపారు. ఆ పర్యటనంతరం ముఖ్యమంత్రిని కలిసి వాస్తవాలను వివరించిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనక్కు తగ్గి ఫార్మా కంపెనీ పెట్టడం లేదని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే క్రమంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నా.. పేదల భూములు తీసుకోవద్దని కోరారు. వృథాగా ఉన్న భూములు, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి ఆధీనంలో ఉన్న వందల ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి ఆ భూములు కనిపించకపోతే సీపీఐ(ఎం)గా ఎర్రజెండాలు పాతి చూపిస్తామన్నారు. ప్రపంచంలో అన్ని వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోని ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క గ్యారెంటీ పూర్తిస్థాయిలో అమలు జరగలేదన్నారు. ఉచిత బస్సు పథకం పూర్తిస్థాయిలో అమలైనప్పటికీ తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రూ.1200 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేయండి

రాష్ట్రంలో సిల్క్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అదానీ ఇస్తానన్న 100 కోట్ల రూపాయలను తిరస్కరిస్తున్నట్టు పకటించడం పట్ల సీపీఐ(ఎం) హర్షం వ్యక్తం చేస్తోందని తమ్మినేని అన్నారు. అదే క్రమంలో రూ.1200 కోట్లతో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు చేసుకున్న ఒప్పందం సంగతి ఏంటని ప్రశ్నించారు. 100 కోట్లను తిరస్కరించినట్లే ఫార్మా కంపెనీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. లగచర్లలో పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.



మోడీ మాటలు విడ్డూరం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అదానీ రూ.1750 కోట్లు లంచం ఇచ్చినట్టు అమెరికాలో అభియోగాలు రాగా, చట్టాల ప్రకారం ఆయన దోషి అని ప్రపంచం కోడై కూస్తుంటే ప్రధాని మోడీ మాత్రం దేశం హర్షించే వ్యక్తి అదానీ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికా చట్టాల ప్రకారం దోషిగా ఉన్న అదానీతో దోస్తీ వద్దని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఎక్కడి నుంచి అయినా డబ్బులు వస్తాయని, ప్రభుత్వానికి మచ్చ తెచ్చుకోవద్దని తమ్మినేని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి నాగార్జున రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పారెపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, కోట గోపి, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ ప్రకటనలతో ఆసియాన్ దేశాల్లో భయాందోళనలు

పెట్టుబడులపై, అభివృద్ధిపై ప్రభావం చూపుతుందంటున్న విశ్లేషకులు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో ఎగుమతుల ఆధారిత ఆగ్నేయాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దిగుమతి చేసుకున్న వస్తువులపై టారిఫ్‌లను పెంచుతామంటూ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ కారణంగా ప్రాంతీయ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ పోటీ పడాల్సి వుంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈసారి ట్రంప్ తన రెండో పదవీ కాలంలో ఆగ్నేయాసియా దేశాలతో తన కార్యకలాపాలను పెంచుతారని భావిస్తున్నారు. ట్రంప్ తిరిగి వైట్‌హౌస్‌కు వచ్చినందున ఎదురయ్యే కొత్త భౌగోళిక, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనడానికి ఆసియాన్ కూడా తన దౌత్య సంబంధాలను ఉపయోగిస్తుందని కూడా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అమెరికాకు ఆసియాన్ ఎగుమతులు బలమైన ప్రతికూలతలను ఎదుర్కొంటున్నందున టారిఫ్‌లను పెంచుతామన్న ప్రతిపాదన కచ్చితంగా చెడ్డ వార్తే, అందులో ఎలాంటి సందేహం లేదని సింగపూర్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థకు చెందిన ఓ ఇ సన్ వ్యాఖ్యానించారు. 'అమెరికాను మహత్తంగా తీర్చిదిద్దాలి' అన్న ట్రంప్ డిమాండ్, ఆయన నినాదానికి అనుగుణంగా బహుశా ఆగ్నేయాసియా దేశాల్లోని పెద్ద పెద్ద తయారీ సంస్థలు అమెరికాలో ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసే యోచన చేయాల్సి వుంటుందని అన్నారు. మరింత రక్షణవాదంతో కూడిన అమెరికా విధానాల వల్ల ఆసియాన్ ఎగుమతులు దెబ్బ తినగలవని మే బ్యాంక్ తన నోట్‌లో పేర్కొంది. ఆగ్నేయాసియాకు పెట్టుబడుల రాక కూడా తగ్గుతుందని, ప్రతి ద్రవ్యోల్బణ షాక్ తగులుతుందని పేర్కొంది.

ఎక్కువ మందికి పకోడీలు.. కొద్ది మందికే హల్వా

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ పాలనలో అదానీలకు హల్వాలు, పేద ప్రజలకు పకోడీలు అని కాంగ్రెస్ నాయకులు జై రాం రమేష్ విమర్శించారు. భారత్‌లో వేతన అసమానతలు అత్యంత తీవ్రంగా ఉన్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) విడుదల చేసిన నివేదికను ప్రస్తావిస్తూ ఆయన ఈ విమర్శలు చేశారు. నివేదిక ప్రకారం దేశంలో టాప్ 10 శాతంలో ఉన్న ఆదాయాన్ని సంపాదించే వారు దిగువన ఉన్న 10 శాతం కంటే 6.8 రెట్లు ఎక్కువగా సంపాదిస్తున్నారని జైరాం రమేష్ తెలిపారు. 'దేశంలో వేతన అసమానత పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మయన్మార్‌లతో సహా మన పొరుగు దేశాలు కంటే తీవ్రంగా ఉంది' అని ఎక్స్‌లో జైరాం రమేష్ పోస్టు చేశారు. 'ఇది మన నాన్-బయోలాజికల్ ప్రధాని సృష్టించిన పకోడా-నామిక్స్ యొక్క ప్రత్యక్ష పరిణామమని గుర్తుంచుకోండి. ఎక్కువ మందికి పకోడీలు, ఎంపిక చేసుకున్న కొద్ది మందికి హల్వాలు' అని జైరాం రమేష్ విమర్శించారు.





మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ

అంబేద్కర్‌ను పొగుడుతూనే రాజ్యాంగ ధ్వంసానికి యత్నం

దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తోంది : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ.. రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, హిందూ దేశంగా మార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా 13వ మహాసభలో ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీ ప్రమాదాన్ని ప్రజలు పసి గట్టాల్సిన అవసరముందని చెప్పారు. దేశంలో బీజేపీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తూట్లు పొడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదను అదానీ, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. అంబేద్కర్‌ను ఒకపక్క పొగుడుతూనే మరోవైపు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒకలా.. ఇతర రాష్ట్రాల్లో మరోలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్‌లో సీసీఐని తెరిపించాలని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పత్తి అధికంగా పండించే ఆదిలాబాద్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చడం, ఫార్మాసిటీ కోసం రైతుల భూములు లాక్కుంటూ కేసులు నమోదు చేస్తోందని అన్నారు. మహాసభలో మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆశాలత, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, భీంరావు, నాయకులు జమున, విష్ణు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే నిర్బంధాలా..?

- యేడాది పాలనలో ప్రజలకు మార్పులు.. బడాబాబులకు మూటలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి పక్షమో చెప్పాలి
- బీఆర్ఎస్ ప్రజాస్వామ్యంపై మాట్లాడడం హాస్యాస్పదం
- బీజేపీ మతం పేరుతో విధ్వంసం
- ప్రభుత్వాలను నిలదీసేది ఎర్ర జెండానే.. : సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా 20వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య, వేదికపై జి. నాగయ్య, పోతినేని సుదర్శన్ తదితరులు

నవతెలంగాణ-నర్సంపేట

"ప్రజాపాలన.. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే రైతుల నిర్బంధాలు.. మహిళలపై చిత్ర హింసలు.. రోజుల తరబడి జైల్లో పెట్టడమా..? కాంగ్రెస్ యేడాది పాలనలో ప్రజలకు మార్పులు.. బడాబాబులకు మూటలు చేరాయి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షమా.. యజమాన్యాలు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల పక్షమో చెప్పాలి అని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై వెంటనే శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా 20వ మహాసభ శుక్రవారం నర్సంపేటలో ప్రారంభమైంది. అంగడీ రోడ్డు సెంటర్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో వీరయ్య ప్రసంగించారు.

భారత దేశం చుట్టూ ఉన్న దేశాల్లో ఎర్ర జెండా రెపరెపలాడుతోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వాలను నిలదీసేది ఎర్ర జెండానే అని అన్నారు. పేదలు, కార్మికులు ఐక్యంగా పోరాడితే భవిష్యత్ అంతా ఎర్ర జెండాదే అని చెప్పారు. వీర తెలంగాణ పోరు గడ్డ.. పోరాటాలు పురుడు పోసిన ఓరుగల్లు గడ్డపై ఎర్ర జెండా రెపరెపలాడాలని, ప్రజా ఉద్యమాలకు ప్రజలు సన్నద్ధం కావాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసిందని ప్రజాపాలన సంబురాలు చేసుకోవాలని పాలకులు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ధాన్యంపై బోనస్ రూ.500 ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి రాగానే కేవలం సన్న రకం ధాన్యానికే ఇస్తామని చెప్పి మెలికపెట్టారన్నారు. రైతులు అడ్డికి పావుశేరులా వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రగతి భవనంలోకి సామాన్యుడు రాలేకపోయాడని, ఇక తాము ముండ్ల కంచెలను తొలగించి ప్రజాసామ్య పునరుద్ధరణ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారన్నారు. నాడు ప్రగతి భవనంలో కేసీఆర్ ఉన్నా ప్రజలు పోలేకపోయారని, నేడు ప్రజలు వెళ్లడానికి అవకాశం ఉన్నా అక్కడ సీఎం లేకుండా పోయారని అన్నారు. హైదరాబాద్ మహానగరమే కాదు రాష్ట్రం మొత్తం పోలీసు నిర్బంధాలు విధిస్తున్నారన్నారు. నాడు కేసీఆర్ మల్లన్న సాగర్ రైతులను అరెస్టు చేసి జైళ్లు, నిర్బంధాలు పెట్టి రాచరిక పాలన సాగించారని గుర్తు చేశారు. నేడు లగచర్లలో ఫార్మాసిటీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. రైతుల వ్యతిరేకతతో వెనక్కి తగ్గి పారిశ్రామిక కారిడార్ పేరిట భూములను లాక్కోవాలని చూస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఏకంగా సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఇందుకు విరుద్ధంగా రేవంత్ సర్కార్ 20జిల్లాల్లో 60 కేంద్రాలలో పేదల గుడిసెలను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుకు గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా ఉన్న ఆ కాస్తా 5జీవోలను బుట్టదాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ నిజస్వరూపం అర్థం చేసుకోవడానికి పదేండ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పది మాసాలు కూడా పట్టలేదని రేవంత్ రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేండ్లలో కేసీఆర్ అవలంబించిన రాజరిక, అప్రజాస్వామిక పద్ధతిని ప్రజలు మరిచిపోలేరన్నారు. ప్రజలు తిరస్కరించి ఓడించినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని, కనీసం పశ్చాత్తాపం చెందడం లేదని అన్నారు.

తెలంగాణలో బీజేపీ మతతత్వ చిచ్చు చెల్లదు

మహారాష్ట్రలో గెలవడాన్ని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో అధికారంలోకి రావాలని ప్రధాని మోడీ బీజేపీ నాయకులకు హితబోధ చేయడం సిగ్గుచేటు అని వీరయ్య అన్నారు. అప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణలో బీజేపీ అధికారంలో రావడం కోసం ప్రజల్లో మతచిచ్చు రేకెత్తించే ప్రయత్నంలో ఉందన్నారు. అడ్డదారిలో అధికారంలోకి రావడానికి అర్రులు చాస్తోందన్నారు. విషబీజాలు నాటడానికి మత చిచ్చుపెడుతుందని ఇటీవల మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన దుర్మార్గపు విధ్వంసమే నిదర్శమన్నారు. కానీ, తెలంగాణలో బీజేపీ ఎత్తుగడలు పారవని, ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జి.నాగయ్య సీనియర్ నాయకలు జి.రాములు, జిల్లా కార్యదర్శి సీహెచ్‌రంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల సమన్వయ లోపంతోనే పులి దాడి

రక్షణ కల్పించడంలో అధికారులు విఫలం / టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారుల సమన్వయ లోపం వల్లే పెద్దపులులను పట్టుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పులి దాడిలో ముగ్గురు ప్రాణం కోల్పోయారని, ఇంకా ఎంత మంది చనిపోవాలని ప్రశ్నించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో టీఏజీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో కవ్వాల్ ఇతర ఫారెస్ట్‌లో ఎక్కడా పులి జాడ లేదన్నారు. మహారాష్ట్ర తిప్పేశ్వర్, తడోబా నుంచి వస్తున్న పులులను ఆపడంలో, ప్రజలకు రక్షణ కల్పించడంలో ఫారెస్ట్ అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. అందువల్లే అమాయక ప్రజలు పులుల దాడిలో ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఈ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులిని వెంటనే బంధించి తడోబా పులుల సంరక్షణ ప్రాంతానికి తరలించాలని కోరారు. అదేవిధంగా ఏనుగు దాడిలో ఇద్దరు మరణించినా ఫారెస్ట్ అధికారుల నుంచి ఎటు వంటి స్పందనా లేకపోవడం బాధాకర మన్నారు. జంతువుల ప్రాణాలకు ఇచ్చిన విలువ మనుషుల ప్రాణాలకు



ఇవ్వడం లేదని వాపోయారు. పెద్దపులి దాడిలో మరణించిన మొర్లె లక్ష్మీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1980 ఫారెస్ట్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం రూ.45లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, 5ఎకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు చేతికి వస్తున్న సమయంలో పులి దాడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని, మరొక ప్రాణం పోక ముందే చర్యలు చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, నాయకులు ఆత్రం తనుష్, కిష్టన్న, బైరి సోమేశ్, మేస్రం నర్మద, నాగోరావ్, తొడసం మోతీరామ్ పాల్గొన్నారు.



మహారాష్ట్రలో బస్సు బోల్తా 12 మంది మృతి

గోండియా : మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్ఆర్‌టిసి)కి చెంది బస్సు బోల్తా పడిన ప్రమాదంలో 12 మంది మరణించగా, 30 మంది గాయపడ్డారు. గోండియా జిల్లాలోని దవ్వ గ్రామంలో ఉదయం 11:30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో 40 మంది ప్రయాణీకులు ఉన్నారు. మీతిమీరిన వేగంతో వెళ్తుతున్న బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి కారణంగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రజీత్ నాయర్ తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్ విచారణ 6న

- విద్యార్థి నాయకులు గుల్ఫిషా ఫాతిమా, ఖాలీద్ సైఫీలవి కూడా..



న్యూఢిల్లీ : చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం(ఉపా) కేసులో.. విద్యార్థి నాయకులైన ఉమర్ ఖాలీద్‌తో పాటు గుల్ఫిషా ఫాతిమా, ఖాలీద్ సైఫీల బెయిల్ పిటిషన్‌పై వచ్చే నెల 6న విచారణ జరగనున్నది. న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలిందర్ కౌర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం దీనిని చేపట్టనున్నది. 2020లో ఢిల్లీ అల్లర్లకు సంబంధించి ఉపా కింద ఈ ముగ్గురూ కేసులను ఎదుర్కొంటున్నారు. అయితే, తాము సుదీర్ఘ కాలం జైలులో ఉన్నామనీ, దానిని పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు ఈ పిటిషన్‌ను వేశారు. వాస్తవానికి ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ధర్మాసనం అక్టోబర్ 7న చేపట్టాల్సి ఉన్నది. కానీ, బెంచ్ సమావేశం విఫలం కావటంతో అది సాధ్యపడలేదు. ఆ తర్వాత పిటిషన్ విచారణ నవంబర్ 25కు జాబితా చేయబడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14తో ఉమర్ ఖాలీద్ నాలుగేండ్లు జైలులో గడిపినట్టయ్యింది. బెయిల్ కోసం దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పలుమార్లు ఉమర్ ఖాలీద్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది మే 28న దిగువ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. నాలుగేండ్లలో సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ 14 సార్లు ఆలస్యమైంది. ఆ తర్వాత ఆయన ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమర్ ఖాలీద్ తరపు న్యాయవాది కపిల్ సిబల్.. దిగువ న్యాయస్థానంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సుప్రీంకోర్టు నుంచి పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు.



ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సామాజిక భద్రత, పెన్షన్ కల్పించాలి: జంతర్ మంతర్ వద్ద ఏడబ్ల్యూఎఫ్ఐ 'ఆశా సంఘర్ష్ ర్యాలీ'
- జాతీయ స్థాయిలో పోరాటాలు ఉధృతం : కె. హేమలత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సీఐటీయూ అనుబంధ ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేలాది మంది ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు 'ఆశా సంఘర్ష్ ర్యాలీ' నిర్వహించారు. సామాజిక భద్రత కల్పించాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మార్చ్‌లో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత మాట్లాడుతూ కార్పొరేట్, మతతత్వ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను మార్చేందుకు ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మోడీ సర్కార్ కార్మికుల హక్కులను హననం చేస్తోందని, అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని విమర్శించారు. కార్మికుల సామాజిక భద్రతను గాలికి వదిలేసిన మోడీ సర్కార్ మెడలు వంచాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను ఆమె అభినందించారు. జాతీయ స్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ చార్టర్ ఆఫ్ డిమాండ్లు, సమస్యలను వివరించారు. సంఘం ఇప్పటివరకు చేసిన పోరాటాలు, విజయాలను తెలిపారు.

సీపీఐ(ఎం) ఎంపీల సంఘీభావం

ఆశా వర్కర్ల మార్చ్‌కు సీపీఐ(ఎం) ఎంపీలు సంఘీభావం తెలిపారు. సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీలు బికాష్ రంజన్ భట్టాచార్య, వి. శివదాసన్ సంఘీభావం తెలిపి సభను ఉద్దేశించి ప్రసంగించారు. పార్లమెంటులో ఆశాల సమస్యలను లేవనెత్తుతామని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో విజ్జూ కృష్ణన్ (ఏఐకేఎస్) సంఘీభావం, మద్దతు తెలిపారు. సోదర సంఘాలు మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం నేత జై భగవాన్, అంగన్‌వాడీ సంఘం నేత ఎఆర్ సింధు ఆశా వర్కర్ల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల ఉద్యమాన్ని, ఐక్యతను క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సహా నాయకులు ప్రసంగిస్తూ..ఆశాల పోరాటాలకు సంఘీభావం , మద్దతు తెలిపారు. ఈ ర్యాలీలో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు నోని లిక్సన్ (అసోం), ప్రసన్న కుమారి (కేరళ), మధుజా సేన్ రాయ్ (పశ్చిమ బెంగాల్), హసుమతి పర్మార్ (గుజరాత్), ఆనంది మణిక.. (మహారాష్ట్ర), కబితా సోలంకి (మధ్యప్రదేశ్), దిల్షాద (కాశ్మీర్), సంగీత (ఉత్తరప్రదేశ్), శివ దుబే (ఉత్తరాఖండ్), సీమా (పంజాబ్), లీలావతి (రాజస్థాన్) మాట్లాడారు. అధ్యక్ష వర్గంలో సునీత (హర్యానా), మమతా రభా (అసోం), ప్రభావతి ఎంబి (కేరళ), పుష్పా పాటిల్ (మహారాష్ట్ర), పూజా కనోజియా (మధ్యప్రదేశ్), కళావతి (ఉత్తరాఖండ్), మంగమ్మ (తెలంగాణ) ఉన్నారు.

> **వేతనాలు పెంచకపోతే సమ్మెకు సిద్ధం**
>
> ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ కార్యదర్శి సురేఖ మార్చ్‌ను ముగిస్తూ కార్యాచరణను ప్రకటించారు. తదుపరి బడ్జెట్‌లో వేతనాలు, ప్రోత్సాహకాలను పెంచకపోతే స్వతంత్రంగా, ఉమ్మడిగా సమ్మెతో సహా మిలిటెంట్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కార్మిక-కర్షక ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్రాల్లో పోరాటాన్ని ఉధృతం చేయాలని ర్యాలీ పిలుపునిచ్చింది. మోడీ ప్రభుత్వంపై మార్చ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అందరికీ ఆరోగ్యం కోసం, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు అందరూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని నిర్ణయించింది. కార్యక్రమం ప్రారంభంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోరాటాల సందర్భంగా రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు పాటలతో హాజరైన వారిని ఉత్సాహపరిచాయి.

జిల్లాల్లో పూర్తికావొస్తున్న సర్వే

- జీహెచ్ఎంసీలో కొనసాగుతున్న ప్రక్రియ
- వేగంగా కంప్యూటరీకరణ ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన సర్వే జీహెచ్ఎంసీ మినహా దాదాపు అన్ని జిల్లాలలో 99 శాతానికి పై చిలుకు పూర్తయిందనీ, 19 జిల్లాల్లో వంద శాతం అయిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం ఈ మేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మరో వైపు కంప్యూటరీకరణ ప్రక్రియ కూడా అంతే వేగంగా కొనసాగుతున్నది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు సర్వే ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి అంతే వేగంతో కంప్యూటరీకరణ చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 49,79,473 నివాసాల సమాచారం కంప్యూటరీకరణ పూర్తయింది.

పింక్ బాల్ సన్నద్ధత!

- నేటి నుంచి రెండు రోజుల వార్మప్ మ్యాచ్
- ఆసీస్ పీఎం ఎలెవన్‌తో భారత్ ఢీ

ఉదయం 9.10 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-కాన్‌బెర్రా

పెర్త్ టెస్టులో సూపర్ విజయాన్ని ఆస్వాదిస్తున్న టీమ్ ఇండియా.. కంగారూ గడ్డపై మరో కఠిన సవాల్‌కు సిద్ధమవుతోంది. అడిలైడ్ వేదికగా డే నైట్ పింక్ బాల్ టెస్టు డిసెంబర్ 6 నుంచి ఆరంభం కానుంది. ఇప్పటి వరకు నాలుగు పింక్ బాల్ టెస్టుల్లో ఆడిన టీమ్ ఇండియా మూడింట విజయాలు సాధించింది. చివరగా అడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టులో భారత్ దారుణ ఓటమి చవిచూసింది. దీంతో ఈసారి గులాబీ సవాల్‌కు మెరుగ్గా సన్నద్ధమయ్యేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఎలెవన్‌తో రెండు రోజుల వార్మప్‌తో మ్యాచ్ ప్రాక్టీస్ చేయనుంది. కాన్‌బెర్రా మనుకా ఓవల్‌లో శనివారం, ఆదివారం పింక్ బాల్ వార్మప్ జరుగనుంది. అడిలైడ్ డే నైట్‌లో జరుగనుండగా.. వార్మప్ మ్యాచ్ మాత్రం పూర్తిగా డేలోనే జరుగుతుంది.

శుభ్‌మన్‌పై ఫోకస్

బొటనవేలి గాయంతో పెర్త్ టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ వార్మప్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. శుక్రవారం నెట్ సెషన్‌లో గిల్ మంచిగా కనిపించాడు. పది నిమిషాల పాటు త్రోడౌన్స్ ఎదుర్కొన్న గిల్.. ఆ తర్వాత ఫుల్ లెంగ్త్ బాల్స్‌ను ఆడాడు. బ్యాటింగ్ కోచ్ నుంచి డిఫెన్స్ సూచనలు తీసుకున్నాడు. బొటనవేలి గాయం గిల్‌ను ఇబ్బంది పెట్టినట్టు కనిపించలేదు. దీంతో గిల్ నేడు వార్మప్ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రోహిత్ శర్మ పెర్త్‌లోనే నెట్స్‌లో పింక్ బాల్‌పై సాధన చేశాడు. కాన్‌బెర్రాలోనూ అదే సాధన కొనసాగించాడు. విరాట్ కోహ్లి నెట్స్‌లో డ్రైవ్స్ ఆడగా.. ఎక్కువగా ఎడ్జ్ తీసుకున్నాయి. దీంతో ప్రాక్టీస్‌లో అసహనంగా కనిపించాడు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ పింక్ బాల్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడ్డాడు. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ప్రసిద్ కృష్ణలు సైతం పింక్ బాల్ వార్మప్‌లో ఆడనున్నారు.

స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఇటు బ్యాట్‌తో, అటు బంతితో వార్మప్‌లో అవకాశం అందుకునే వీలుంది. కెఎల్ రాహుల్ నెట్స్‌లో శ్రద్ధగా సాధన చేశాడు. రోహిత్ శర్మ రాకతో జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో రాహుల్ స్థానంపై అనిశ్చితి నెలకొంది. నం.3 స్థానంలో ఆడిన దేవదత్ పడిక్కల్ బెంచ్‌కు పరిమితం కానుండగా.. ఆ స్థానంలో రాహుల్ వస్తాడా? లేదంటే యశస్వి, రాహుల్ జోడీ జోరు కొనసాగించేందుకు రోహిత్ శర్మనే మూడో స్థానంలో ఆడతాడా? అనేది చూడాలి.



వర్షం అంతరాయం?

రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం పొంచి ఉంది. తొలి రోజు ఆట సాధ్యపడే వాతావరణం కనిపించటం లేదు. ఎడతెగని వర్షం సూచనలతో శనివారం రోజు ఆట సాగుతుందో? లేదా అనే అనుమానం నెలకొంది. రెండో రోజు మాత్రం ఎటువంటి వర్షం సూచనలు లేవు. ఆసీస్ పీఎం ఎలెవన్‌కు ఎడ్వర్డ్స్ సారథ్యం వహిస్తున్నారు. మ్యాచ్ ఉదయం 9.10 గంటలకు ఆరంభం కానుంది.

రాణించిన రవితేజ

బిహార్‌పై హైదరాబాద్ గెలుపు



రాజ్‌కోట్ : పేసర్ రవితేజ (4/26) నాలుగు వికెట్ల ప్రదర్శనతో మెరవటంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బిహార్‌పై హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బిహార్ 20 ఓవర్లలో 118/9 పరుగులే చేసింది. ఛేదనలో రోహిత్ రాయుడు (56 నాటౌట్, 33 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (51 నాటౌట్, 31 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీలతో చెలరేగటంతో 12.3 ఓవర్లలోనే హైదరాబాద్ 119/1 పరుగులు చేసింది. మరో 45 బంతులు ఉండగానే ఘన విజయం సాధించింది. రవితేజ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్-ఏలో హైదరాబాద్‌కు నాలుగు మ్యాచుల్లో ఇది రెండో విజయం.

సెమీస్‌లో సింధు

- లక్ష్యసేన్, అశ్విని-తనీశ జోడీ సైతం
- సయ్యద్ మోడీ ఇండియా ఓపెన్



లక్నో (ఉత్తరప్రదేశ్) : భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు సెమీఫైనల్లో ప్రవేశించింది. సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ మహిళల సింగిల్స్‌లో సింధు జోరు కొనసాగించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో చైనా అమ్మాయి వాంగ్‌పై 21-15, 21-17తో వరుస గేముల్లో గెలుపొందిన సింధు సెమీస్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్యసేన్ సైతం సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సహచర షట్లర్ లువాంగ్‌పై 21-8, 21-19తో ఏకపక్ష విజయం సాధించాడు.

మరో క్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21-13, 21-8తో డాంగ్‌పై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ 21-12, 17-21, 21-16తో ప్రియ, శృతి జోడీపై మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందింది. మరో క్వార్టర్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి 21-8, 21-15తో వరుస గేముల్లో మలేషియా జోడీపై అలవోక విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు 21-16, 21-13తో మలేషియా జంటపై గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

సమంతకు పితృ వియోగం



సమంత

కథానాయిక సమంత కుటుంబంలో విషాదం నెలకొంది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని ఇన్‌స్టా గ్రామ్ వేదికగా సమంత అందరితో షేర్ చేసుకున్నారు. తండ్రి మరణంతో తీవ్ర విచారంలో ఉన్న ఆమె హృదయం ముక్కలైన ఎమోజీని షేర్ చేస్తూ, 'నాన్నా.. మళ్ళీ మనం కలిసేంత వరకూ..' అని పేర్కొన్నారు.

సమంత తాజాగా నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్' ప్రమోషన్‌లో భాగంగా ఆమె తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని తెలిపారు.

'చిన్న తనంలో నేను గుర్తింపు కోసం ఎక్కువగా పోరాటం చేస్తుండేదాన్ని. నేను ఏమీ తెలియని అమాయకురాలినని నా తండ్రి భావించేవారు. నన్నొక చిన్నపిల్లలా చూసేవారు. నటిగా రాణించిన తర్వాత నా తల్లిదండ్రులు నన్ను చూసి ఎంతో గర్వపడ్డారు. నా పని విషయంలో ఎంతో సంతృప్తి చెందారు. నా జీవితంలో మా అమ్మానాన్నలు కీలక పాత్ర పోషించారు' అని సమంత చెప్పారు. తండ్రి మరణం నేపథ్యంలో సమంతకు ధైర్యం చెబుతూ పలువురు సినీ ప్రముఖులతోపాటు ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు.

సంక్రాంతి కానుకగా రిలీజ్



అజిత్

అజిత్‌కుమార్, మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'విడాముయర్చి'. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతుంది. ఈ సినిమా రీసెంట్‌గానే షూటింగ్‌తోపాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను కంప్లీజ్ చేసుకుంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

టీజర్‌ను గమనిస్తే, సినిమాలో హీరో అజిత్ కుమార్ డిఫరెంట్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ప్రపంచమంతా నిన్ను నమ్మకపోయినా ఫర్వాలేదు. నిన్ను నువ్వు నమ్ముకో.. అనే కాన్సెప్ట్‌తో సినిమా యాక్షన్ బేస్డ్ మూవీగా తెరకెక్కింది. అజిత్ దేని కోసమో అన్వేషిస్తున్నారు. చివరకు తనకు కావాల్సిన దాని కోసం విలన్స్ భరతం పడుతున్నారు. తాను సాధించాల్సిన లక్ష్యం కోసం ఏం చేయటానికైనా, ఎంత దూరం వెళ్లటానికైనా, ఎవరినైనా ఎదిరించేలా ఇప్పటి వరకు కనిపించని ఓ వైవిధ్యమైన పాత్రలో ఆయన మెప్పించబోతున్నారు.

ఆద్యంతం ఆకట్టుకునే ఎంటర్‌టైన్మెంట్ చిత్రాలతో పాటు విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడిగా పేరున్న మగిళ్ తిరుమేని దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజిత్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీ 'మంగాత' (తెలుగులో గ్యాంబ్లర్)లో అజిత్ కుమార్, త్రిష, అర్జున్ త్రయం తమదైన నటనతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు మరోసారి వీరు ముగ్గురు ఆడియెన్స్‌ను మెప్పించనున్నారు. అలాగే ఇందులో ఆరవ్, రెజీనా కసాండ్ర, నిఖిల్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. వారి పాత్రలను కూడా టీజర్‌లో రివీల్ చేశారు.

ఛాలెంజింగ్‌గా అనిపించింది..



గాయత్రి దేవి

నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో ఎస్.ఆర్.టి.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించిన వెబ్ సిరీస్ 'వికటకవి'. ఈ వెబ్ సిరీస్ ఈనెల 28 నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ పీరియాడిక్ డిటెక్టివ్ వెబ్ సిరీస్‌లో తన వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి కాస్ట్యూమ్ డిజైనర్ జోశ్యుల గాయత్రి దేవి మీడియాతో సంభాషించారు.

'నేను పుట్టింది విజయనగరం. పెరిగిందంతా చెన్నై. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. మూడేళ్ళు సాఫ్ట్‌వేర్‌గా జాబ్ చేసి మానేశా. ఆ సమయంలోనే ఫ్యాషన్ డిజైనింగ్‌లో జాయిన్ అయ్యాను. 'పలాస' మూవీకి నేను డిజైనింగ్ మాత్రమే చేసిచ్చాను. అయితే ఆహా చేసిన 'కుడిఎడమైతే' వెబ్ సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. తర్వాత 'పారాహుషార్', 'కళాపురం', 'సర్వం శక్తిమయం' వంటి సినిమాలు, వెబ్ సిరీస్‌కు వర్క్‌చేశాను. అలాగే పీపుల్ మీడియా బ్యానర్ సంస్థ నిర్మించిన సిరీస్ 'హరికథ'కు కూడా వర్క్ చేశాను. ఈ 'వికటకవి' సిరీస్ తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. అది కూడా పీరియాడిక్ కథాంశం కావటంతో చాలా రీసెర్చ్ చేశాను. 1940 సమయంలో అప్పటి ప్రజల వేషధారణ, సంస్కృతి, సాంప్రదాయాల గురించి తెలుసుకున్నాను. టెక్నీషియన్స్‌గా ఇదొక డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిచ్చింది. కథకు తగ్గ మూడ్ ప్రకారం ఫ్యాబ్రిక్స్‌ను మార్చాల్సి రావడంతో నాకు పెద్ద ఛాలెంజింగ్ అనిపించింది. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో 'మర్మయోగి', అలాగే 'మానసచోర'కు ప్రస్తుతం వర్క్ చేస్తున్నాను'.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్



మోక్షజ్ఞ

నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో గ్రాండ్‌గా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తన నటనతో అలరించడానికి నటన, ఫైట్లు, డ్యాన్స్‌లలో మోక్షజ్ఞ ట్రైనింగ్ తీసుకున్నారు.

ఎం. తేజస్విని నందమూరి ప్రెజెంటర్‌గా, లెజెండ్ ప్రొడక్షన్స్‌తో కలిసి ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నారు. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేసిన ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పౌరాణిక, ఇతిహాసం నుంచి ప్రేరణ పొందిన ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు. నందమూరి నట వారసుడిగా మోక్షజ్ఞ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తరుణంలో ఈ సినిమాపై అటు అభిమానుల్లోను, ఇటు ప్రేక్షకుల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది.

జనవరిలో షూటింగ్ షురూ..



సందీప్ కిషన్, జాసన్ సంజయ్

హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో సందీప్‌కిషన్ కథానాయకుడిగా లైకా సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. తాజాగా ఈ మూవీ మోషన్ పోస్టర్‌ను చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది.

ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ హెడ్ జికెఎం తమిళ్ కుమరన్ మాట్లాడుతూ 'మా సంస్థ ప్రారంభం నుంచి మంచి కథకులను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. అందులో భాగంగానే జాసన్ సంజయ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం. ఆయన తెరకెక్కించబోతున్న కథ, ఆయన నెరేషన్ విన్నప్పుడు డిఫరెంట్‌గా అనిపించింది. అన్నింటికంటే ముఖ్యంగా పాన్-ఇండియా దృష్టిని ఆకర్షించే ప్రధానమైన పాయింట్ ఉంది. మనం ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతకాలి అనటాన్ని మనం చాలా సందర్భాల్లో వినే ఉంటాం. కానీ దాని కోసం మనం ఏం వెచ్చిస్తామనేదే ప్రధాన పాయింట్‌గా సినిమా ఉంటుంది. సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్నారు. ఈ సరికొత్త కాంబో ప్రేక్షకులకు సరికొత్త అనుభవాన్నిస్తుందని మేం భావిస్తున్నాం. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా షూటింగ్ జనవరి నుంచి స్టార్ట్ చేయబోతున్నాం' అని తెలిపారు.

వచ్చే నెలలోనే పెళ్ళి..



కీర్తి సురేష్

కథానాయిక కీర్తి సురేష్ పెళ్ళి ముహూర్తం ఖరారైంది. వచ్చేనెలలోనే ఆమె వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. శుక్రవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో ముచ్చటించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'వచ్చే నెలలో ఆంటోనిని పెళ్ళి చేసుకోబోతున్నా. గోవాలో మా వెడ్డింగ్‌ని ప్లాన్ చేశాం. అలాగే నేను బాలీవుడ్‌లోకి అడుగు పెడుతూ నటించిన చిత్రం 'బేబీ జాన్'. ఈ సినిమా కూడా వచ్చేనెలలోనే విడుదల కానుంది' అని తెలిపారు.

తన చిన్న నాటి స్నేహితుడు ఆంటోనీతో దాదాపు 15 ఏండ్ల నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు ఇటీవల కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. అలాగే వీరిద్దరి ఫొటోని సైతం షేర్ చేసింది. తాజాగా పెళ్ళి ముహూర్తం ఖరారు నేపథ్యంలో వీరిద్దరి ఫొటో బాగా వైరల్ అయ్యింది. ఇదిలా ఉంటే, వరుణ్ ధావన్‌తో కీర్తిసురేష్ నటించిన చిత్రం 'బేబీ జాన్'. తమిళంలో విడుదలైన 'తేరీ' చిత్రానికి రీమేక్‌గా దీన్ని తెరకెక్కించినట్టు సమాచారం.

మంచు విష్ణు ప్రోత్సాహంతో..



హీరో విష్ణు మంచు, ఆయన సతీమణి విరానికా మంచు వారి వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్ మహేష్‌కి సంబంధించిన టొయో యునిసెక్స్ సెలూన్‌ను శుక్రవారం బంజారా హిల్స్‌లో ప్రారంభించారు. లాంచ్ స్పాట్‌లో ముఖ్య అతిథుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో విష్ణు మంచు మాట్లాడుతూ, 'నేను స్టోర్స్ ఓపెనింగ్స్‌కు చాలా అరుదుగా వెళ్తుంటాను. మహేష్ నా పర్సనల్ హెయిర్ స్టైలిస్ట్. చాలా టాలెంటెడ్ పర్సన్. 5 సంవత్సరాల క్రితం పర్మనెంట్ పర్సనల్ హెయిర్ స్టైలిస్ట్ కోసం వెతుకుతున్నప్పుడు నాకు ఈయన తారసపడ్డాడు. మహేష్ ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాడు. హెయిర్ స్టయిలింగ్‌లో ఇంకా ఎక్కువగా మెళుకువలు నేర్చుకోవాలని దుబాయ్, యూరప్‌కు పంపాను. 'కన్నప్ప' చిత్రానికి కూడా స్టైలిస్ట్‌గా పని చేశాడు. ఇప్పుడు ఇలా కొత్తగా సెలూన్ ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

'నేను సెలూన్ ప్రారంభించాలని అనుకున్నప్పుడు విష్ణుకి చెప్పాను. నా నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆయన నాకు సలహా ఇచ్చారు. అలాగే 'కన్నప్ప' సినిమాకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఆయన ఆశీర్వాదంతో సెలూన్‌ని ప్రారంభించాను' అని టొయో యునిసెక్స్ సెలూన్ మహేష్ చెప్పారు.

గ్రామీణ నేపథ్యంలో ప్రణయ గోదారి



సాయి కుమార్

విలేజ్ డ్రామాగా రాబోతున్న చిత్రం 'ప్రణయగోదారి'. సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పిఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించారు.

డిసెంబర్ 13న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టుగా మేకర్లు అధికారికంగా పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సినిమాలోని ప్రధాన పాత్రలను చూపించారు. ఇందులో సాయికుమార్ అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారన్న సంగతి తెలిసిందే. ఆయన వేషధారణ, ఆహార్యం, నటన ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానున్నాయి. ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు రిలీజ్ అయిన కంటెంట్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంది. పాటలు, పోస్టర్‌లు ఇలా అన్నీ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మున్ముందు మరింత మంచి కంటెంట్‌తో ఆడియెన్స్‌లో హైప్ పెంచేందుకు చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886